fb/prajasakti, www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి


ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 31 | విజయవాడ, గురువారం 1 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

చంద్ర సోయగం

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా విజయవాడలో బుధవారం రాత్రి కనిపించిన సూపర్ మూన్, రెడ్ మూన్, బ్లూ మూన్ దృశ్యాలు -టివిఆర్



150 కోట్ల కమీషన్

- ఏసిబి వలలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్
- నిందితుడు లక్ష్మీ ప్రసాద్ అరెస్ట్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌గా పనిచేస్తున్న గెడ్డపు లక్ష్మీ ప్రసాద్ కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల ఇళ్లపై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 20 ప్రాంతాల్లో ఏక కాలంలో జరిగిన సోదాల్లో భారీగా ఆదాయానికి మించిన అక్రమాస్తుల్ని అధికారులు గుర్తించారు. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరా బాద్‌లలో నిర్వహిం చిన సోదాల్లో సుమారు రూ.150 కోట్లు విలువైన చర, స్థిరాస్తుల్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు లక్ష్మీ ప్రసాద్ అతని ఇద్దరు భార్యలు, అత్త పేరుమీద ఎక్కువగా ఆస్తుల్ని కొనుగోలు మిగతా 9లో

ఇకపై ప్రతిభ ఆధారిత వీసాలే

- గొలుసుకట్టు వలస విధానాలు చెల్లవు
- పార్లమెంట్‌లో తొలి ప్రసంగంలో ట్రంప్ స్పష్టీకరణ
- కీలకమైన సంస్కరణల అమలుకు చేతులు కలపండి
- డెమోక్రాట్లకు పిలుపు



వాషింగ్టన్ : ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థను అమలు చేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం పిలుపిచ్చారు. చైన్ ఇమ్మిగ్రేషన్ (గొలుసుకట్టు వలస విధానాలు)కు ఇక స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన మిగతా 8లో



నేడే బడ్జెట్

- ఉదయం 11 గంటలకు పార్లమెంట్ జైట్లీ ప్రసంగం
- తొలిసారిగా హిందీలో
- ఎన్నికలే లక్ష్యం
- మోడీ సర్కార్‌కు ఇదే చివరి పూర్తి కాలం బడ్జెట్

8

నిధులు కురిసేనా

- కేంద్ర బడ్జెట్‌పై వేల కోట్ల ఆశలు
- రాజధానికి రూ.1000 కోట్లు
- లోటు నిధులకు రూ.4000 కోట్లు
- ఉపాధి హామీకి రూ.1200 కోట్లు
- అంతర్జాతీయ విమానాశ్రయంగా గన్నవరం
- రోడ్లు, కోస్టల్ కారిడార్‌లకు నిధులు
- ఇఎపి పనులకు 90:10 నిష్పత్తి అమలు
- 2019లోగా పోలవరం పూర్తి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

కేంద్రం గురువారం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం కోటి ఆశలు పెంచుకుంటోంది. ఇప్పటికే పలు డిమాండ్లపై కేంద్రానికి ఇచ్చిన ప్రతిపాదనల్లో ఎంతవరకు ఫలవంతమవుతాయన్నదే ఇప్పుడు ఆశక్తి కలిగిస్తున్న అంశం. కొన్ని నిధులు అన్ని రాష్ట్రాలకు మాదిరిగానే వచ్చే పరిస్థితి ఉండగా, విభజనానంతరం అదనంగా ఇవ్వాల్సిన నిధులపైనే ఎక్కువ ఆశలు పెంచుకుంటు న్నారు. రాష్ట్ర అవసరాలను ప్రత్యేకంగా చూడాలంటూ ఇప్పటికే కేంద్రాన్ని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు బడ్జెట్ ప్రకటన కోసం వేచి చూస్తున్నారు.

రాష్ట్రం ప్రత్యేకంగా కోరుతున్న నిధులు (రూ. కోట్లలో)

రాజధాని నిర్మాణం	1,000
లోటు నిధులు	4,117
ఉపాధి హామీ అడ్వాన్స్	1,200
పారిశ్రామిక ప్రోత్సాహకాలు	1,500
ప్రత్యేక ప్యాకేజీ కింద	3,238

రాష్ట్ర విభజన జరిగిన తరువాత కేంద్రం ఇస్తామన్న నిధులు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదని ఆరోపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, తాజా బడ్జెట్‌కు అనేక విభాగాల్లో నిధులు కావాలని ప్రతిపాదనలు మిగతా 9లో



రైల్వే జోన్ వచ్చేనా ?

- అమరావతి రైల్వే ప్రాజెక్టు అమల్లోకొచ్చేనా
- ప్రతిపాదనలకే పరిమితమైన కొత్తలైన్లు
- రిపేర్ల కోసం 600 కళ్వర్టులు ఎదురుచూపు

9



తమ ఆవేదనను జె.రాములుతో చెప్పుకుంటున్న పెదగొట్టిపాడు దళితులు

గొట్టిపాడు బాధితులకు తక్షణ లబ్ధి

- రోజువారీ కూలి 24 గంటల్లో చెల్లించాలి
- పెదగొట్టిపాడు సందర్శనలో ఆర్‌డిఒను ఆదేశించిన జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జె.రాములు
- నలుగురిపై 307 సెక్షన్ కింద కేసు నమోదుకూ ఆదేశాలు

ప్రజాశక్తి-పత్తిపాడు/గుంటూరు

పెదగొట్టిపాడులో పెత్తందార్ల దాడికి గురైన దళితులతోపాటు, కాలనీ వాసులకు వ్యక్తిగతంగా చేకూర్చాల్సిన పలు అంశాల్లో తక్షణమే లబ్ధి చేకూర్చాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జె.రాములు అధికారులను ఆదేశించారు. పెత్తందార్ల దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళితులకు ఆస్పత్రి ఖర్చులతోపాటు అప్పటి నుంచి నేటి వరకు రోజువారీ కూలిని 24 గంటల్లో చెల్లించాలని ఆర్‌డిఒ శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా ఘటనకు బాధ్యులైన నలుగురు పెత్తందార్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలన్నారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు దళితవాడను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగానే కమిషన్ పని చేస్తుందన్నారు. ఇటీవల వచ్చిన చట్టాల ప్రకారం ఒక అధికారి దళితులను ఉరిమి చూసినా, దళితవాడల్లోని వీధుల్లో తిరక్కపోయినా అట్రాసిటీ చట్టం కిందికి వస్తుందని చెప్పారు. ఎవరికి అన్యాయం జరిగినా బాధితులు నేరుగా కమిషన్‌కు చెందిన 9908505215 నెంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేసులో ఉన్న దళితులకు రూ.25 వేలు చెల్లిస్తారన్నారు. వీటితోపాటు దళితవాడలో పక్కా గృహం లేని దళితులకు రూ.ఐదు లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో పక్కా ఇల్లు, చదువుకున్న నిరుద్యోగులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు, కాలనీలో 50 ఏళ్లు దాటిన అందరికీ పింఛన్లు, సత్వరమే అంబేద్కర్ భవన నిర్మాణం, డ్వాక్రా మహిళలకు ఒక్కో గ్రూపునకు రూ.50 లక్షల రూణం, బీటెక్ పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారు. దళితులపై దాడి ఘటనలో ఇంకా కేసు నమోదవని ఎ.పాండు, మారెళ్ల భాస్కరావు, జి.ఉపేంద్ర, కోటేశ్వరావుపై 307 సెక్షన్ కింద కేసును 24 గంటల్లో నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. రాడ్డులతో దాడి చేసిన వారిపైనా ఇదే సెక్షన్ కింద కేసు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు, అర్బన్ ఎస్‌పి విజయరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి మల్లికార్జునరావు, మిగతా 9లో

రాలిన విద్యా కుసుమాలు

- ఫీజు కట్టలేక చైతన్య విద్యార్థిని..
- కాలేజీకి వెళ్లాలని తల్లి మందలించిందని ఎన్ఆర్ఐ విద్యార్థి ఆత్మహత్య



తేజస్విని



సంజయ్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి, సీతమ్మధార/ గన్నవరం (కృష్ణా)

కళాశాల ఫీజు కట్టలేక ఓ విద్యార్థిని, కాలేజీకి ఎందుకు వెళ్లలేదని తల్లి మందలించిందని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలు విశాఖలోనూ, కృష్ణాజిల్లా గన్నవరంలోనూ బుధవారం జరిగాయి విశాఖపట్నంలోని లలితానగర్‌లో నివాసముంటున్న గ్రంధి తేజస్విని(16) శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ సెకెండియర్ చదువుతుంది. పేదరికంలో పుట్టిన తేజస్విని తండ్రి శ్రీనివాస్ జివిఎంసి ఎదురుగా ఫుట్‌పాత్ వద్ద వ్యాపారం చేసి సంపాదించిన డబ్బులతోనే చదువు కొనసాగిస్తోంది. ఇటీవల కళాశాలకు చెందిన ఫీజు చెల్లించలేదు. దీంతో కళాశాల యాజమాన్యం హాల్ టిక్కెట్ ఇవ్వలేదు. ఫుట్‌పాత్‌పై తండ్రి చేసుకుంటున్న వ్యాపారాన్ని ట్రాఫిక్ పోలీసులు తొలగించడంతో కొద్ది రోజులుగా ఆ కుటుంబం ఉపాధి కోల్పోయింది. పైగా ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితి దాపురించింది. ఫీజులు కట్టకపోవడం, దుకాణం తొలగించడంతో తనకు ఇంకా భవిష్యత్ లేదని మనస్తాపం చెందిన తేజస్విని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తె చనిపోవడానికి కారణం చైతన్య కళాశాల యాజమాన్యం వేధింపులేనని తండ్రి రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు కొద్దిరోజులుగా వ్యాపారం సాగకుండా చేశారని, దాని వల్ల డబ్బులు లేకపోవడం, చైతన్య కళాశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేయడం వల్ల తమ కుమార్తె చనిపోయినట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆరోగ్యం బాగోలేక తేజస్విని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కృష్ణాజిల్లా గన్నవరంలో కూడా ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గన్నవరంలో ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్న రాజశేఖర్ అశోక్ లేలెండ్ లారీ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆయన పెద్ద కుమారుడు అల్లంకి సంజయ్(16) విజయవాడ సీతారామపురంలోని ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఏదో కారణాల రీత్యా కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండిపోయాడు. ఈ విషయమై తల్లి కొడుకుని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సంజయ్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కాసేపటి తర్వాత అపార్టుమెంట్ పైనుంచి కిందకు మిగతా 9లో

అక్టోబర్ నాటికి హైకోర్టు భవనాలు సిద్ధం

మంత్రులు ప్రత్తిపాటి, నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో అక్టోబర్ నాటికి హైకోర్టు భవనాలు సిద్ధం కానున్నట్లు మంత్రి పి నారాయణలు తెలిపారు. మరో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ఆయన బుధవారం వెలగపూడి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సిఆర్‌డిఏ సమావేశంలో హైకోర్టు భవన నిర్మాణం, తరలింపుపై ప్రధానంగా చర్చించారన్నారు. రూ. 110 కోట్లతో హైకోర్టు భవన సముదాయాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి నెలాఖరులోగా కానీ, మార్చి మొదటి వారంలో కానీ పనులు ప్రారంభిస్తామన్నారు. డిజైన్లు తుది దశలో ఉన్నాయని, వీటిని హైకోర్టు న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. శాశ్వత పద్ధతిలోనే నిర్మాణాలుం టాయని తెలిపారు. నీరుకొండపై నిర్మించే ఎన్టీఆర్ భారీ విగ్రహం డిజైన్లకు సంబంధించి శుక్రవారం జరగనున్న మంత్రిమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో రూ. 11,000 కోట్లతో మురికి నీటిని శుద్ధి చేయనున్నట్లు తెలిపారు. సుమారు 203 చదరపు అడుగుల్లో రూ. 4.60 లక్షలతో ఇళ్లను నిర్మించి పేదలకు ఇస్తామన్నారు. 65 మునిసిపాలిటీల్లో 200 అన్న క్యాంటీన్లను మేలోగా ప్రారంభిస్తామని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆరు వేలకు పైగా విలేజ్ మాల్స్‌ను ప్రారంభిస్తామన్నారు. రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసే మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాను యూనిట్‌గా చేసుకొని రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు.

ఆర్ఎస్ఎస్ చేతిలో టిటిడి స్టీరింగ్!

- ఈవో నియామకంతో మొదలు
- అన్యమత నోటీసులతో రాద్ధాంతం
- ధర్మకర్తల మండలి ప్రకటనకు మోకాలడ్డు
- ఏడాదికి రెండుసార్లే దర్శనమంటూ ఆంక్షలు



టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం.. దేశ విదేశాల నుంచి అన్ని రకాల మతాల వారు, జాతుల వారు శ్రీవారిని దర్శించుకుంటారు.. ఓ రకంగా చెప్పాలంటే ఏడుకొండల స్వామి 'సెక్యులర్' దేవుడుగా గుర్తింపు పొందారు.. ప్రశాంతతకు మారుపేరు తిరుమల.. అయితే బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకోవడంతో టిటిడిలో ఆర్ఎస్ఎస్ జోక్యం ఎక్కువయింది. టిటిడి కార్యనిర్వహణాధి కారి నియామకంతో ప్రారంభమైన వీరి అల్టిమేటం, ధర్మకర్తల మండలి నియామకం మిగతా 9లో

3 నుంచి అమరావతి బౌద్ధ వారసత్వ మహోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ స్వరాజ్ మైదానం వేదికగా ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు విశ్వశాంతి అమరావతి బౌద్ధ వారసత్వ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ఎంకె మీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు నగరంలో శాంతి యాత్ర జరగుతుందని, సాయంత్రం 5 గంటల నుండి బౌద్ధ సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ భిక్షువులు దాదాపు వెయ్యి మంది వరకూ ఈ వేడుకల్లో పాల్గొంటారని, బైలకూపే బౌద్ధ నృత్య ప్రదర్శన మూడు రోజుల కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి అఖిల ప్రియ, ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, శ్రీలంకకు చెందిన భిక్కుని కుసుమ, మహాభోది బెంగుళూరు ప్రధాన కార్యదర్శి ఆనంద భంతే ప్రసంగిస్తారని తెలిపారు. అమరావతిలో కొలువై ఉన్న నాగార్జునా విశ్వవిద్యాలయంలో బౌద్ధ అధ్యయన కేంద్రం ఉందని, వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు.

స్మార్ట్ సైకిళ్లు

సచివాలయంలో బుధవారం స్మార్ట్ సైకిళ్లు సిఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సైకిల్ తొక్కుతూ తన కార్యాలయానికి వెళ్లారు.



సచివాలయంలో స్మార్ట్ సైకిళ్లు

ప్రారంభించిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సచివాలయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ సైకిళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మార్ట్ కార్డ్ ద్వారా డిజిటల్ తాళం తీసే పద్ధతి, సైకిల్‌ను ఉపయోగించే విధానాన్ని నిర్వాహకులు సిఎంకు వివరించారు. సచివాలయం వద్ద మూడు స్టాండులు, 24 స్మార్ట్ సైకిళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సచివాలయం ఆంధ్రాబ్యాంక్ సౌజన్యంతో వాటిని ఏర్పాటు చేశారు. వీటిని జర్మనీ నుంచి దిగుమతి చేశామని, ప్రభుత్వం అనుమతిస్తే త్వరలో అమరావతిలో అసెంబ్లింగ్ యూనిట్ నెలకొల్పుతామని ఆలిండియా బైసైకిలింగ్ ఫెడరేషన్ చైర్మన్ డివి మనోహర్ సిఎంను కోరారు. స్మార్ట్ సైకిళ్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలించాలని కమిషనర్ శ్రీధర్‌కు సిఎం సూచించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో కూడా స్మార్ట్ సైకిళ్లు ప్రవేశపెట్టాలని సిఎం సూచించారు. అలాగే సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసి ఏసీకి, విద్యుత్ వాహనాలకు వినియోగించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సిఎం సైకిల్ తొక్కుతూ ఒకటో బ్లాక్‌లోని తన కార్యాలయానికి వెళ్లారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగానే నమోదవుతున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. నాలుగు రోజుల తర్వాత ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి రావచ్చని తెలిపారు. చలి ప్రభావం స్వల్పంగా ఉందని, కొద్దిరోజులు ఇదే కొనసాగుతుందని పేర్కొన్నారు.

సేద్య పరికరాల తయారీకి ప్రోత్సాహం : సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో వ్యవసాయ యంత్ర పరికరాల తయారీకి ముందుకొచ్చే సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన పరిశ్రమల ఏర్పాటుపై పారిశ్రామిక వేత్తల అవగాహనా సమావేశాన్ని బుధవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమిరెడ్డి మాట్లాడుతూ సేద్య పరికరాల తయారీ పరిశ్రమలకు రాయితీలు కూడా కల్పిస్తామన్నారు. అమెరికాకు చెందిన ఐయోవా యూనివర్సిటీ సహకారంతో కర్నూలులో రూ. 680 కోట్లతో మెగాపుడ్ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలతిపారు. ఈ సమావేశంలో ఎపిఐఐసి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి కృష్ణయ్య, చైర్మన్ జెఎస్ఆర్‌కె ప్రసాద్, ఉద్యానవన, సెరీకల్చర్ కమిషనర్ చిరంజీవి చౌదరి, పరిశ్రమల శాఖ కార్యదర్శి సిద్ధార్ధ జైన్, వ్యవసాయ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.com
కు పంపవచ్చు.

తొలుత సచివాలయ నిర్మాణం

- వచ్చే ఏడాదికి శాఖాధిపతుల కార్యాలయాలు, ప్రభుత్వ ఆవాసాలు
- నాలుగు ఎకరాల్లో హైకోర్టు
- భవానీద్వీపంలో సంతోష నగరాల సదస్సు
- సిఆర్‌డిఎ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధానిలోని పాలనా నగరంలో తొలుత సచివాలయం, అటు తర్వాత శాఖాధిపతుల కార్యాలయ భవనాలు, ప్రభుత్వ ఆవాసాల్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నారు. పరిపాలన నగరంలో చేపట్టే అన్ని నిర్మాణాలలో మొట్టమొదటి ప్రాధాన్యంగా ఈ మూడు ప్రాజెక్టుల్ని పూర్తి చేసి వచ్చే ఏడాదిలోనే వినియోగంలోకి తీసుకొస్తామని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియజేశారు. సిఆర్‌డిఎ సమీక్షా సమావేశాన్ని సచివాలయంలో బుధవారం నిర్వహించారు. రాజధానిలో చేపట్టిన రహదారులు, పరిపాలనా నగర శాశ్వత భవంతుల నిర్మాణాలు తదితర అంశాలతో పాటు, మెరీనా, ఐటీ టవర్లు, హెల్త్ స్ట్రీట్, కంటైనర్ హోటళ్లు వంటి ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులపై చర్చించారు. అమరావతిలో వచ్చే ఏప్రిల్‌లో జరుగనున్న సంతోష నగరాల సదస్సు, తొమ్మిది మాసాల్లో పూర్తి చేయాల్సివున్న ఇంటెరిమ్ హైకోర్టు నిర్మాణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో చర్చించి ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. సచివాలయం, శాఖాధిపతుల భవంతుల నిర్మాణ ప్రణాళికలను నార్మన్ ఫోస్టర్ సంస్థ బుధవారం రాత్రిలోగా తమకు పంపుతున్నట్టు తెలియజేసిందని, వీటికి మార్చిలోగా టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తున్నట్టు సిఆర్‌డిఎ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ సిఎంకు వివరించారు. హైకోర్టు భవంతి ఆకృతులు, నిర్మాణ ప్రణాళికలు ఫిబ్రవరి నాలుగైదు తేదీల్లోగా రానున్నాయన్నారు. శాసనసభ భవంతి ఆకృతులు మరో రెండు వారాల్లో వస్తాయన్నారు. వచ్చే అక్టోబర్ నాటికి ప్రభుత్వ ఆవాసాలు మొత్తం సిద్ధం కానున్నాయన్నారు. పది ప్రదేశాల్లో 69 టవర్ల నిర్మాణం సాగుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీస్ అధికారులకు 18 టవర్లలో 144 ఫ్లాట్లు, ఎన్జీవోలకు 22 టవర్లలో 1968 ఫ్లాట్లు, టైప్ 1, 2 అధికారులు, గ్రూప్ డి ఉద్యోగులకు 21 టవర్లలో 1440 ఫ్లాట్లను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్మించే రెసిడెన్షియల్ టవర్స్ అన్నింటిలో క్లబ్ హౌస్‌తో పాటు కచ్చితంగా స్విమ్మింగ్ పూల్ కూడా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. అమరావతిలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు ఆరోగ్యవంతులుగా ఉండాలని, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి మంచి అలవాట్లలో వారి జీవనశైలిలో తప్పక మార్పు వస్తుందన్నారు. అమరావతిలో ఐటీ కంపెనీల కోసం ఆఫీస్ స్పేస్ నిర్మాణాలను చేపట్టడానికి సిఆర్‌డిఎ ప్రతిపాదనల్ని సిద్ధం చేసి సిఎం ముందుంచారు. ముందుగా సిఆర్‌డిఎ ఈ ప్రాజెక్టును చేపడుతుందని, తరువాత చేపట్టే నిర్మాణాలను అభివృద్ధిదారుకు అప్పగిస్తారని తెలిపారు. తొలుత 10 లక్షల చదరపు అడుగుల మేర జంట భవంతుల నిర్మాణాన్ని చేపడతారని, 42 ఐటీ సంస్థల నుంచి 5 లక్షల చదరపు అడుగుల వరకు ఆఫీస్ స్పేస్ కావాలని, మరో 5 లక్షల చదరపు అడుగుల కోసం సంప్రదింపులు చేస్తున్నారని అధికారులు చెప్పారు. ఐటీ టవర్లలో మొదటి దశ నిర్మాణాన్ని 12 మాసాల్లో, రెండవ దశను 24 నెలల్లో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. సిఆర్‌డిఎ నిర్మిస్తున్న ఆఫీస్ స్పేస్‌ను విక్రయించడం ద్వారా చదరపు అడుగుకు రూ.3 వేల వంతున ధర రావచ్చని అంచనావేశారు. మొత్తం రూ.90.6 కోట్ల ఆదాయం సమకూరవచ్చని భావిస్తున్నారు. పరిపాలనా నగరం మధ్యభాగంలో 7 ఎకరాల్లో నిర్మించే సిటీ స్క్వేర్‌కు ఒకవైపు స్టేడియం, మరోవైపు కన్వెన్షన్ సెంటర్ నిర్మించే ప్రతిపాదనలను సిఎం ముందుంచగా, స్టేడియం అక్కడ కాకుండా స్పోర్ట్స్ సిటీలోనే నిర్మించాలని సూచించారు. 4 ఎకరాల్లో హైకోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టనున్నామని అధికారులు తెలిపారు.

చిన్న పనుల్లోనూ జాప్యమేనా? : ముఖ్యమంత్రి

సిఆర్‌డిఎ పరిధిలో చిన్నచిన్న పనులకు కూడా కాలయాపన జరుగుతోందని, ఇక మీదట అలా జరగకూడదన్నారు. రహదారి నిర్మాణంలో గ్రావెల్ అవసరం మరింతగా ఉందని అధికారులు తెలపగా అనంతవరం కొండ ప్రాంతం నుంచి గ్రావెల్ తీసుకోవాలని సూచించారు. వైకుంఠపురంలో రిజర్వాయర్ నిర్మాణానికి కొండవీటివాగు నుంచి వచ్చే గ్రావెల్‌ను వినియోగించుకోవచ్చునన్నారు.

గాంధీ పార్క్‌పై వీడియో ప్రెజంటేషన్

శాఖమూరు ఉద్యానవనంలో భాగంగా 19.5 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న గాంధీ పార్కుపై వీడియో ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ పార్కుకు 'గాంధీ టు మహాత్మా పార్కు' అనే పేరు పెట్టాలని సిఎం సూచించారు. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు జరిగే సంతోష నగరాల సదస్సు ద్వారా మరోసారి అమరావతి ప్రాభవాన్ని ప్రపంచానికి చాటే అవకాశం దక్కిందని సిఎం అభిప్రాయపడ్డారు.

అసెంబ్లీకి నూతన భవనం

స్పీకర్ కోడెల శివప్రసాదరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు వెల్లడించారు. అసెంబ్లీలో నూతన భవనాల నిర్మాణానికి సంబంధించి అసెంబ్లీ, సిఆర్‌డిఎ, ఎల్అండ్‌టి అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ సరిపోవకపోవడంతో సిఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడి నూతన భవనాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ భవనం 4,500 చదరపు అడుగులతో అత్యాధునిక హంగులతో నిర్మిస్తామన్నారు. నూతన భవనం మొదటి అంతస్తులో అసెంబ్లీ సిబ్బంది, గ్రౌండ్‌ఫ్లోర్‌లో మీడియా పాయింట్, లైబ్రరీ, క్యాంటీన్, సెక్యూరిటీ కార్యాలయాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం ఉన్న భవనాలలో సిబ్బంది నూతన భవనంలోకి వెళ్లాక, ప్రస్తుత భవనాల ఖాళీ గదుల్ని మంత్రులు, విప్‌లకు కేటాయిస్తామన్నారు. అసెంబ్లీ కమిటీలకు సహాయపడే విధంగా నూతన భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. అసెంబ్లీ సిబ్బంది కొరతను సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉమ్మడి అసెంబ్లీలో 800 మంది సిబ్బంది ఉంటే ప్రస్తుత అసెంబ్లీలో కేవలం 100 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీనివల్ల అసెంబ్లీ సిబ్బందికి పనిభారం పెరిగిందన్నారు. సిబ్బందిని పెంచే విషయంపై సిఎం సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. అలాగే నరసరావుపేటలో జెఎన్‌టియు, కోటప్పకొండలో రోప్ వే ప్రారంభానికి సిఎంను ఆహ్వానించామని, త్వరలో ఆయా ప్రాంతాల్లో సిఎం పర్యటన ఉంటుందన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 4న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి 5కె వాక్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏపిలో ఫేస్‌బుక్ పైలెట్ ప్రాజెక్టు

పలు కంపెనీల ప్రతినిధులతో లోకేశ్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన సాంకేతిక ఆవిష్కరణల కోసం ఆంధ్రప్రదేశ్‌లో పైలెట్ ప్రాజెక్టు చేయనున్నట్లు ఫేస్‌బుక్ ప్రతినిధులు తెలిపారు. శాన్‌ఫ్రాన్సిస్‌కో పర్యటనలో భాగంగా ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ ఫేస్‌బుక్, గూగుల్ తదితర కంపెనీల ప్రతినిధులతో బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో వినియోగిస్తున్న సాంకేతికతను, కంపెనీలకు అందిస్తున్న సౌకర్యాలను ఫేస్‌బుక్ ప్రతినిధులకు లోకేశ్ వివరించారు. డేటా వినియోగం పెరిగితే స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) పెరిగే అవకాశముందని, అందుకే ఫైబర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేశామని గూగుల్ బృందంతో భేటీ అనంతరం లోకేశ్ తెలిపారు. గూగుల్ క్లౌడ్ మినీ క్లస్టర్ల ఏర్పాటుకు ఏపిని పరిశీలించాలని కోరారు. ఏపికి ప్రత్యేక బృందాన్ని పంపి వివిధ రంగాల్లో భాగస్వామ్యంపై అధ్యయనం చేస్తామని గూగుల్ ప్రతినిధులు తెలిపారు. క్యాడెన్స్ కంపెనీ సిఇఒ లిప్ భూ ట్యాన్, ప్రెసిడెంట్ అనిరుద్‌తో కూడా లోకేశ్ భేటీ అయ్యారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో రంగంలో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, అందుకు సహకారం అందించాలని కోరారు. క్లౌడ్‌లో ఉండే సమాచారానికి భద్రత కల్పించేందుకు చట్టాల్లో తీసుకురావాల్సిన మార్పులపై కేంద్రంతో చర్చిస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లో ఏపిలో కలిసి పనిచేయాలని, మినీ క్లౌడ్ క్లస్టర్ ఏర్పాటులో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. త్వరలోనే ఏపి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని వివిధ రంగాల్లో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని గూగుల్ క్లౌడ్ బృందం హామీ ఇచ్చింది.

11 అంకెలతో 'భూధార్' : కెఇ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆధార్ తరహాలో రాష్ట్రంలో తీసుకురానున్న భూధార్ ద్వారా ప్రతి భూభాగానికి 11 అంకెలతో విశిష్ట సంఖ్యను అందజేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి వెల్లడించారు. ఆటోమ్యుటేషన్ ప్రక్రియకు సంబంధించి సచివాలయంలో బుధవారం రెవెన్యూ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కెఇ మాట్లాడుతూ ప్రాజెక్టులో భాగంగా ప్రతి పట్టాదారుని భూ భాగానికీ జియో ట్యాగింగ్ చేసి 11 అంకెలతో ఒక సంఖ్య ఇస్తామన్నారు. జియో ట్యాగింగ్ చేసిన వెంటనే 99 సీరిస్‌తో తాత్కాలిక భూధార్ నంబరు ఇస్తామని, భూ వివరాలన్నీ సక్రమైనవేనని నిర్ధారించుకున్న తర్వాత రాష్ట్ర సెన్సస్ కోడ్ 28తో ప్రారంభమయ్యే శాశ్వత భూధార్ నంబరు అందిస్తారన్నారు. ప్రభుత్వ భూముల్ని సులువుగా గుర్తించే విధంగా విశిష్ట సంఖ్య రెండు సున్నాలతో ప్రారంభమవుతుందన్నారు. మొత్తం 2.84 కోట్ల వ్యవసాయ భూముల వివరాలతోపాటు 50 లక్షల పట్టణ ఆస్తులు, 85 లక్షల గ్రామీణ ఆస్తుల వివరాల్ని భూసేవ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

జగ్గయ్యపేట మండలంలోని 24 గ్రామాలు, ఉయ్యూరు మున్సిపాలిటీలో ప్రయోగాత్మకంగా పైలట్ ప్రాజెక్టు చేపట్టామని, ఫిబ్రవరి 15 నాటికిది పూర్తవుతుందన్నారు. అక్టోబర్ నాటికి రాష్ట్రమంతటా ప్రాజెక్టును అమలు చేస్తామన్నారు. దేశంలోనే ఈ తరహా ప్రాజెక్టు రాష్ట్రంలో తొలిసారిగా అమలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ భూముల కొనుగోలు, అమ్మకాలు జరిగిన వెంటనే రెవెన్యూ రికార్డుల్లో ఆటోమెటిక్‌గా కొత్త యజమాని పేరున నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో మ్యుటేషన్ అయిన వెంటనే రైతుకు లేదా భూ యజమానికి ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా వివరాలు తెలుపుతామన్నారు. రికార్డులో పేరు నమోదైనప్పటికీ 30 రోజుల వరకు ఎలాంటి లావాదేవీలు జరగకుండా దీనికి నోషనల్ ఖాతా నంబరు ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత సంబంధిత భూమి రిజిస్ట్రేషన్‌కి సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయవచ్చున్నారు. సమగ్ర విచారణ తర్వాతే శాశ్వత ఖాతా ఇస్తామన్నారు.

5లోగా పరిహారం కేసుల వివరాలు : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ అవసరాల నిమిత్తం ప్రజల నుంచి సేకరించిన భూముల పరిహారానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాల్ని ఫిబ్రవరి 5 లోగా అందించాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. సచివాలయంలో బుధవారం కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే 50 శాతం పరిహారం చెల్లించిన వారికి మిగతా పరిహారాన్ని చెల్లించేందుకు ఆర్థిక శాఖ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్‌మోహన్ సింగ్, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయి సాగును గుర్తించేందుకు డ్రోన్లు

గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలను గుర్తించేందుకు డ్రోన్లను వినియోగించాలని సిఎస్ దినేశ్ కుమార్ సూచించారు. గంజాయి సాగు నివారణపై డిజిపి, ఎక్సైజ్, అటవీ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. గంజాయిని సాగు చేసినా, రవాణా చేసినా అటువంటి వ్యక్తులపై పిడి చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి యం మాలకొండయ్య, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే

భూములు వెనక్కి

- మంత్రి యనమల ఆదేశం
- విశాఖ, విజయవాడ, తిరుపతిలో వినోద కేంద్రాలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాజెక్టులేవైనా నిర్ణయించిన సమయానికి పూర్తిచేయని పక్షంలో కేటాయించిన భూముల్ని వెనక్కి తీసుకోవాలని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అధికారుల్ని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రాజెక్టుల్ని గిరిజనేతరులు చేపట్టడానికి అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో సొసైటీలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సచివాలయంలో ఆర్థిక శాఖ సమావేశ మందిరంలో పట్టణాభివృద్ధిపై మంత్రివర్గ ఉప సంఘం, పర్యాటక శాఖ అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఏపీ టూరిజం బోర్డు ఏర్పాటు, మహేంద్ర సంస్థకు శ్రీకాకుళంలో స్థలం కేటాయింపు, తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లిలో పర్యాటక ప్రాజెక్టు, ఐల్యాండ్, ఇతర పర్యాటక, టిడిపి ప్రాజెక్టులు, అరసవల్లి, కుప్పం, తోటకొండ, ఎర్రకాలు భూముల కేటాయింపు, తదితర అంశాలపై మంత్రులు కె.ఎర్రన్నాయుడు, పితాని సత్యనారాయణ, అఖిలప్రియ, ఆ శాఖల అధికారులతో చర్చించారు. విశాఖ, విజయవాడ, తిరుపతిలలో భారీ స్థాయి కుటుంబ వినోద కేంద్రాల (ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు-ఎఫ్ఈసీ) ఏర్పాటును పర్యాటక శాఖ అధికారులు ప్రతిపాదించారు. ఎఫ్ఈసీలు, కాకినాడ, చీరాలలో రిసార్ట్‌ల గురించి ఆ శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా వివరించారు. విశాఖ, విజయవాడ ఎఫ్ఈసీలలో ఒక ఐమాక్స్ థియేటర్, 8 వెండి తెరల మల్టీపెక్స్, రెండు వేల సీట్ల సామర్థ్యం గల కాన్ఫెరెన్స్ హాలు, 50 వేల అడుగుల వాణిజ్య స్థలం, త్రీస్టార్ హోటల్ ఉంటాయని చెప్పారు. తిరుపతిలో అన్నింటితోపాటు వాణిజ్య స్థలాన్ని 50 నుంచి 80 వేల అడుగులకు పెంచినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులకు రూ.100 నుంచి 150 కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశముందన్నారు. పర్యాటక శాఖకు సంబంధించి అంశాల్ని కమిషనర్ హిమాన్షు వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, గృహనిర్మాణ శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 65 గురుకుల పాఠశాలలు

రూ.1000 కోట్లతో ఆదరణ పథకం

మంత్రి అచ్చెన్నాయుడు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యా సంవత్సరంలో నూతనంగా 65 బిసి గురుకుల పాఠశాలల్ని ఏర్పాటు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారుల్ని ఆదేశించారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో బుధవారం బిసి సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరు పై ఆ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత బిసి స్టడీ సర్కిళ్లను పునరుద్ధరించడంతో పాటు కొత్త స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాపు భవనాలతో పాటు, బిసి భవనాల నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రీమెట్రిక్, కాలేజీ హాస్టళ్లలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజు, ఫీజు రియంబర్స్‌మెంట్‌కు సంబంధించి ఏ విద్యార్థీ ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే ఉపకారవేతనాల గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాల్ని చేపట్టాలన్నారు. రూ. 1000 కోట్లతో ఆదరణ పథకాన్ని అమలు చేయాలని, అలాగే కాపు విద్యార్థులకు రూ. 263 కోట్లతో పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్సీకి కూడా శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. సమావేశంలో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బి ఉదయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ 'లీజు' వ్యవహారం

పెద్దల గుప్పిట్లోకి ఆర్టీసి ఆస్తులు

- లీజు కంటే పది రెట్ల ఆదాయం
- ఆర్టీసి స్థలాలు గుట్టుగా టెండర్ల ద్వారా బివోటీకి
- ఆదాయానికి అదే మార్గం?
- 390 ఎకరాలు ఖాళీగా



తూర్పుగోదావరి జిల్లా అన్నవరం బస్‌స్టాప్ వద్ద ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలం

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి చెందిన పట్టణ ప్రాంతాల్లోని విలువైన ఖాళీ స్థలాలన్నీ రాజకీయ, వ్యాపార, పారిశ్రామికవేత్తల గుప్పెట్లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పటికే తక్కువ లీజుకు, గుట్టుగా టెండర్ల ద్వారా బీవోటీలకు అనేక స్థలాలు మరలిపోయాయి. విలువైన ఆర్టీసీ స్థలాలను లీజుకు తీసుకుంటున్న వ్యాపారులు చెల్లించే మొత్తం కంటే పదింతల ఆదాయం పొందుతున్నారు. మిగిలిన చిన్న పట్టణాలు, పురపాలక సంఘాల్లోని స్థలాల పైనా వీరి కన్ను పడింది. కేవలం ఆదాయ కోణంలో ఖాళీ స్థలాలను లీజుకు/ బీవోటీ కింద ఇచ్చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు చూస్తున్నారు. కానీ భవిష్యత్తులో సంస్థ అవసరాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని కార్మిక సంఘాల వాదిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి 2,014 ఎకరాల భూములున్నాయి. వీటి విలువ రెవెన్యూ రికార్డుల ప్రకారం రూ.7,500 కోట్లు. బహిరంగ మార్కెట్ విలువ రూ.25 వేల కోట్లు ఉంటుందని అంచనా. రకరకాల కారణాలతో నష్టాల బాట పడుతున్న ఆర్టీసీ ఉన్న స్థలాలను వినియోగించుకుని లాభాల దిశగా అడుగులు వేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 128 బస్సు డిపోలు, గ్యారేజీలు, కాంప్లెక్స్‌ల పరిధిలోని ఖాళీ స్థలాలను అద్దెకు, లేదంటే దుకాణాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా అద్దె రాబట్టి మరింత ఆదాయం సమకూర్చుకునే పనిలో పడింది. ఈ ప్రయోగం ఫలితాలిస్తున్నా వీటి కేటాయింపు వెనుక రాజకీయ ఒత్తిళ్లు, పరపతి సవారీ చేస్తున్నాయని సర్వత్రా వినవస్తోంది. వినియోగంలో ఉన్నవి మినహాయిస్తే రాష్ట్రంలో 450 స్థలాల్లో 390 ఎకరాల వరకు భూమి ఖాళీగా ఉన్నట్లు యాజమాన్యం గుర్తించింది. ఆర్టీసీకి ఉన్న అప్పులు, నష్టాలు కలిపితే రూ.4వేల కోట్ల వరకు ఉంది. ఖాళీస్థలాలు ఏళ్ల తరబడి ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోనే ఉండిపోతే మళ్లీ వెనక్కి తీసుకోలేమన్న సంగతి తెలిసినా అదే పంథాలో ఆర్టీసీ యాజమాన్యం ముందుకెళ్తోందన్న విమర్శలూ ఉన్నాయి. ఈ విధానాలు ప్రయివేటుకు బాటలు వేయడమేనని కార్మిక వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. విలువైన ఆర్టీసీ స్థలాలను లీజుకు తీసుకుంటున్న వ్యాపారులు చెల్లించే మొత్తం కంటే పదింతల ఆదాయం పొందుతున్నారు. ఇలా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 25 ఎకరాలు లీజులో ఉన్నాయి. ఇలాంటి కీలక స్థలాల్లో ఆర్టీసీ యాజమాన్యమే నిర్మాణాలు చేపట్టి అద్దెలకిస్తే ఇప్పుడొస్తున్న ఆదాయం కంటే ఏడాదికి కనీసం రూ.20 కోట్ల పైగానే రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు బీవోటీ ద్వారా 15 ముఖ్యమైన స్థలాలు లీజుకిచ్చేశారు. విజయవాడ బస్ స్టేషన్ అవుట్ గేటు దగ్గరి స్థలం, విశాఖలోని ద్వారకా నగర్ బస్ స్టేషన్ ఎదురుగా స్థలం ఇలాంటివే. ఇంకా చిన్నాచితకా షాపింగ్ కాంప్లెక్స్‌లకు ఇచ్చినవి చాలానే ఉన్నాయి. ప్రస్తుతం బీవోటీలో ఉన్న వాటిలో విశాఖలోని మద్దిలపాలెం, ద్వారకా బస్ స్టాండ్, ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, త్రిపురాంతకం, విజయనగరం జిల్లాలోని ఎస్.కోట, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాలోని అమలాపురం, ఏలూరులో రెండుచోట్ల, గుంటూరు జిల్లాలోని గుంటూరు, తెనాలి, చిత్తూరు జిల్లాలోని తిరుపతి ఇలా మరికొన్ని ఉన్నాయి. తాజాగా ఖాళీ స్థలాల్లో మినీ థియేటర్ల నిర్మాణానికీ టెండర్లు పిలిచారు. ప్రస్తుతం ఆర్టీసీకి నిర్మాణాలు పోను ఖాళీ స్థలాల విలువ సుమారుగా రూ.2 వేల కోట్లు ఉంటుంది. ఆర్టీసీకి బీవోటీలు, లీజుల ద్వారా ప్రస్తుతం రూ.45 కోట్ల పైబడి ఆదాయం వస్తోంది. ఈ ఆదాయాన్ని రూ. 100 కోట్లకు పెంచాలన్న లక్ష్యంతో అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సంక్షిప్తం

సఫాయి కర్మచారీలకు రూ. 150 కోట్లు

అమరావతి బ్యూరో : రాష్ట్రంలోని సఫాయి కర్మచారీలకు, ఎస్సీలకు నేషనల్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌డిసి), నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ డెవలప్‌మెండ్‌కారొపరేషన్ (ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి) కింద రూ.150 కోట్లతో రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీల రుణాల కోసం ఎన్ఎస్ఎఫ్‌డిసి కింద రూ. 130 కోట్లు, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి కింద రూ. 30 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

సేవా కేంద్రాలుగా అటవీ నర్సరీలు : శిద్దా

అటవీ నర్సరీలను సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. వీటికి 'వనమిత్ర' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. వనమిత్ర కార్యక్రమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులకు సమీపంలో 20 అటవీ శాఖ నర్సరీలను గుర్తించామన్నారు. ప్రజలకు వనమిత్ర సేవల్ని ఈ ఏడాది ఉగాదికి అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

రొయ్యలసాగులో యాంటీబయోటిక్స్

రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న రొయ్యల్లో ఎలాంటి యాంటీబయోటిక్స్ అవశేషాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు మత్స్యపరిశ్రమ, పశుసంవర్ధరకశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. సచివాలయంలో బుధవారం అఖిల భారత రొయ్యల సాగు రైతుల సమాఖ్య ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారికంగా సాగవుతున్న రొయ్యల చెరువుల్ని గుర్తించి వాటన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయించాలని మంత్రి ఆదేశాలిచ్చారు. లైసెన్స్‌ల రెన్యువల్ పరిధిని ప్రస్తుతమున్న ఏడాది గడువును పెంచాలన్నారు.

అమెరికాలో ఎంఎస్ చేస్తున్న బందరు విద్యార్థి మృతి

ప్రజాశక్తి - మచిలీపట్నం

అమెరికాలో ఎంఎస్ చదువుతున్న కృష్ణాజిల్లా బందరుకు చెందిన బొమ్మల చైతన్యకుమార్ అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. యుఎస్ఎ, ఫ్లోరిడా మాయామిలో ఎంఎస్ చదువుతున్న చైతన్యకుమార్ మచిలీపట్నం పురపాలక సంఘం రెవెన్యూ సెక్షన్‌లో పనిచేస్తున్న బొమ్మల రామ్మోహనరావు, అంజనాదేవీల కుమారుడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. బిటెక్ పూర్తిచేసిన చైతన్యకుమార్ రెండేళ్ల క్రితం ఎంఎస్ చదవడానికి అమెరికా వెళ్లి ఎంఎస్ పూర్తిచేసుకొని ఉద్యోగానికి సంబంధించిన శిక్షణ తీసుకుంటున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. స్నేహితుల రూమ్‌లో ఉంటున్న చైతన్యకుమార్ మృతిచెందిన సమాచారం బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు రామ్మోహనరావుకు ఫోన్ ద్వారా అందిందని తెలిపారు.



కడపలో జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న కౌన్సిలర్ రామమునిరెడ్డి

ప్రొద్దుటూరులో కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజా సమస్యలపై చర్చిస్తున్న మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 36 వార్డుకు చెందిన కౌన్సిలర్ మార్తల రామమునిరెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మైకు వైరును మెడకు చుట్టుకుని బిగించుకునేందుకు ప్రయత్నించారు. సహచర కౌన్సిలర్లు అడ్డుతగిలి ఆయన ప్రయత్నాన్ని నియంత్రించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ తనవార్డులో శానిటేషన్ సమస్య అధికంగా ఉందని, ఐదు రోజులుగా వేసిన చెత్తకుప్పలు వేసినట్లుగా ఉన్నాయని, ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నానన్నారు. తనవార్డులో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని కనీసం ఇద్దరు పారిశుధ్యకార్మికులను తనకిస్తే ఎవరి అవసరం లేకుండా తానే చెత్తకుప్పలు ఎత్తివేస్తానని పేర్కొన్నారు. తనవార్డుతో సంబంధం లేదని శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ సమస్య గురించి చెప్పడం తన అవమానంగా ఉందని తెలిపారు. అటు సిబ్బందితో పనిచేయించుకోలేక ఇటు ప్రజలకు సమాధానం చెప్పుకోలేక అవస్థలు పడుతున్నానని ఆవేశంగా మాట్లాడుతూ అక్కడే మైకులకు అమర్చిన వైరును తనమెడకు చుట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంతలో కౌన్సిలర్లు రఫీ, మురళీధర్‌రెడ్డి అడ్డుపడి సర్దిచెప్పారు. అప్పటికీ శాంతించకుండా కౌన్సిలర్లు రామమునిరెడ్డి, జయశంకర్ పోడియం ముందు బైఠాయించారు. శానిటరీ సూపర్‌వైజర్ రాంప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని 40వ వార్డులలో నాలుగు డివిజన్‌లుగా విభజించి పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని 23 నుండి 30వ వార్డుల వరకు నూర్‌బాష పారిశుధ్య పనులు చేయిస్తున్నారని సమాచార లోపం ఫలితంగా కౌన్సిలర్ రామమునిరెడ్డి అపార్థం చేసుకున్నారని ఏదీ ఏమైనా జరిగిన సంఘటనకు క్షమాపణ కోరుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఔట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లకు పొగ

అవసరానికి వాడుకోవడం.. అవసరం తీరిన తర్వాత గెంటేయటం.. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు పరిపాటయింది. 2006 నుండి ఇప్పటివరకూ నాలుగుసార్లు ఔట్‌సోర్సింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్లను విధుల నుండి తొలగించి మరల భర్తీ చేసింది. తాజాగా గృహ మిత్రలంటూ కొత్త నిర్వచనమివ్వబోతోంది. ఈ వింత చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1500 వర్క్ ఇన్‌స్పెక్టర్ల కుటుంబాలు రోడ్డున పడబోతున్నాయి.

గృహ మిత్రలుగా పనిచేయాలని ఉత్తర్వులు
రోడ్డున పడనున్న 1500 కుటుంబాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి


రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఎపి హౌసింగ్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసింది. తర్వాత ఫెడరేషన్‌ను ఎపి స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్‌గా మార్పుచేశారు. దీంతో పెద్ద సంఖ్యలో యంత్రాంగాన్ని నియమించారు. ఇందిరమ్మ పథకం మొదటి విడత నుండి మూడో విడతకు చేరుకునే సరికి ఎన్నో అక్రమాలు వెలుగు చూడటం, నిధుల కొరత ఎదురవ్వటంతో 2013లో వర్కుఇన్‌స్పెక్టర్లను విధుల నుండి తొలగించింది. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టింది. వీటి పర్యవేక్షణకు మరల



రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

సిబ్బంది అవసరమైంది. గతంలో పనిచేసిన వర్కు ఇన్‌స్పెక్టర్లను తిరిగి విధుల్లోకి తీసుకుంది. జియోట్యాగింగ్ పేరుతో ఆరు నెలల పాటు వెట్టిచాకిరీ చేయించుకుని ఇక అవసరం లేదంటూ ఇంటికి సాగనంపింది. ఏడాదిన్నర తర్వాత ఏప్రిల్, 2017న వర్కుఇన్‌స్పెక్టర్లు కావాలంటూ గృహనిర్మాణ శాఖ మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వడంతో గతంలో పనిచేసిన వాళ్లంతా తిరిగి విధుల్లోకి వచ్చారు. నెలకు రూ 15 వేలు మూలవేతనం, పిఎఫ్, ఇఎస్ఐకుపోగా చేతికి సుమారు రూ 13 వేలు వస్తుండటంతో ఉన్నంతలో సంతృప్తికరంగా ఉన్నారు. అయితే ఈసారి ఆరు నెలలు తిరక్క మునుపే ఔట్‌సోర్సింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్స్ బాధ్యతల నుండి తొలగించి గృహ మిత్రలుగా నియమిస్తున్నామంటూ గృహ నిర్మాణ సంస్థ సర్క్యులర్ నెం.ఎ5/4833/2017/ జారీ చేసింది. ఇందులో నెలనెలా వేతనాలు చెల్లించటం జరగదని, ఒక్కొక్కరికి 250 ఇళ్లు కేటాయిస్తామని గృహ లబ్ధిదారులకు చెల్లిస్తున్నట్లుగా బేస్‌మెంట్ లెవెల్‌కు రూ 150లు,, లెంటల్ లెవెల్‌కు రూ 150లు, రూఫ్ లెవెల్‌కు రూ 150లు, రూఫ్‌కాస్ట్ లెవెల్‌కు రూ 150లు, మరుగుదొడ్డి లెవెల్‌కు రూ 150 చొప్పున చెల్లిస్తామనీ, ఇష్టమైతే పనిచేయండి, కష్టమైతే ఇంటికి పొండనీ పొగపెడుతున్న తీరు వారిని కలవరపరుస్తోంది.

గృహనిర్మాణ సంస్థకు ఊడిగం చేస్తున్నాం..



ఎపి గృహ నిర్మాణ సంస్థకు ఊడిగం చేస్తున్నాం. కష్టం మాది.. పెత్తనం వాళ్లది.. చైర్మన్లు, ఉన్నతాధికారులు మారినప్పుడల్లా విధివిధానాలు మారిపోతూ ఉంటాయి. ఏవైపు నుండి ఏ అస్త్రం వస్తుందోనన్న భయం నిత్యం వెన్నాడుతూ ఉంటోంది. పన్నెండేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎంతో మానసిక వేదనకు గురయ్యాం.

- గౌసియా బేగం, ఐటిఐ (డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్)

అవమానాలు, ఆర్థిక బాధలే..



ఏరోజు గృహ నిర్మాణ శాఖలో అడుగుపెట్టిన నాటి నుండి ఇంటాబయటా అవమానాలు, ఆర్థిక ఇబ్బందులే. నాతోపాటు ఐటిఐ (డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్) చదువుకున్న మిత్రులు ప్రైవేటు సంస్థల్లో నెలకు రూ 35 వేల నుండి రూ 40 వేలు వేతనం తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగమని వెంపర్లాడినందుకు గృహ నిర్మాణ సంస్థ తగిన బుద్ధి చెప్పింది.

- ఆర్.మోషే, ఐటిఐ (డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్)

ప్రైవేటుకు ఇసుక రవాణా

టిడిపి ప్రభుత్వం ఇసుక రవాణాను ప్రైవేటుకు అప్పగించింది. ఉభయగోదావరి జిల్లాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఇసుక ర్యాంపుల నిర్వహణా బాధ్యతలను 'క్యాట్‌లాగ్ ఐటీ సొల్యూషన్స్' ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు అప్పగిస్తూ ఈ నెల 8న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ఏడాది పాటు ఇసుక ర్యాంపుల నిర్వహణా బాధ్యతలను ఆ సంస్థే చేపడుతోంది. ఇసుక రవాణా చేసే వాహనానికి జియోట్యాగింగ్ నుంచి ఇసుక లోడింగ్ ర్యాంపు నిర్వహణా బాధ్యతలను ఆ సంస్థ ఉద్యోగుల కనుసన్నల్లోనే జరగనున్నాయి. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని నియమించనున్నారు. ఇసుక తవ్వకాలు జరిగే అన్ని రీచ్‌ల్లోనూ ఈ నిబంధనలు అమలులోకి రానున్నాయి.



- క్యాట్‌లాగ్ ఐటి సొల్యూషన్ కంపెనీకి అప్పగింత
- నిర్వహణా బాధ్యతలు ఆ సంస్థవే
- రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో అమలు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో 64 ఇసుక రీచుల్లో తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అనుమల్లేకపోయినా ఇసుక లభ్యమయ్యే ప్రాంతాల్లో తవ్వకాలు చేసుకోవచ్చని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగానే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని రాజకీయ నాయకులు ఇసుక దందాను చేపడుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రాజకీయ నాయకులంతా సిండికేట్‌గా మారి కొన్ని చోట్ల ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. తాజాగా ఇసుక రవాణ బాధ్యతను 'క్యాట్‌లాగ్ ఐటీ సొల్యూషన్స్' ప్రైవేటు లిమిటెడ్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో రాజకీయ దందాకు కొంతమేరకు చెక్‌పడే అవకాశాలున్నాయి. కానీ ప్రభుత్వం చెబుతున్నట్లు ఇసుక రవాణా ప్రైవేటీకరణతో వినియోగదారులకు ఉచితంగా ఇసుక అందుతుందన్న ప్రభుత్వ ఆలోచనపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలివే..

ఇసుక రవాణా ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో ఇకపై ఇసుక తవ్వకాలు జరిగే రీచ్‌లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేయాలని మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలకు సంబంధించి నెంబర్, డ్రైవర్ పేరు, మొబైల్ నెంబర్లను ప్రైవేటు సిబ్బంది నమోదు చేస్తారు. ఆ ఇసుక ఏ వినియోగదారునికి వెళ్తుందో ఆ వ్యక్తి పేరు, ఆయన మొబైల్ నెంబర్ సేకరించి ఆన్‌లైన్లో పొందుపరుస్తారు. వీటితో ఇసుక తవ్వకానికి అనువైన రహదారుల నిర్వహణ ప్రైవేటు సంస్థే చూస్తోంది. వీటి నిర్వహణకు యూజర్ ఛార్జీలు వసూలు చేస్తారని నిబంధనల్లో పేర్కొంది.

విజయనగరం జిల్లాలో అమలవుతోంది

జిల్లాలో ఇసుక రీచ్‌ల నిర్వహణ ప్రైవేటు సంస్థకు అప్పగించిన విషయం వాస్తవమే. జిల్లాలో సాలూరు రీచ్‌లో ఇప్పటికే అమలవుతోంది. ప్రతి రీచ్ నుంచి తరలిస్తున్న ఇసుక వాహనాన్ని జియోట్యాగింగ్ చేసి, వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. త్వరలో అన్ని రీచ్‌ల్లోనూ నిబంధనలు అమలు చేస్తాం.

- ఎస్‌కెవి సత్యనారాయణ, ఎడి మైన్స్

'పశ్చిమ'లో ఉప్ప కయ్యలుగా పంట భూములు

రబీలో రెండుసార్లు నాటినా ప్రయోజనం శూన్యం



పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు మండలం అడవికొలను కలదండకోడుపాయలో ఉప్పునీటితో దెబ్బతిన్న వరిపొలం

ప్రజాశక్తి -ఏలూరు ప్రతినిధి

ధాన్యాగారంగా పేరొందిన పశ్చిమగోదావరి జిల్లాలో వరిసాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా చేపలు, రొయ్యల సాగు సాగుతోంది. డెల్టాలో 5.29 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. దాదాపు మూడు లక్షల ఎకరాలు చేపల చెరువులుగా మారిపోగా రెండు లక్షల ఎకరాల్లో నిబంధనలకు పాతరేసి రొయ్యల సాగు చేస్తున్నారు. అనధికారికంగా బోర్లు వేసి ఉప్పునీటి రొయ్యల సాగు చేస్తూ ఆ నీటిని పంట కాలువల్లో వదిలేస్తున్నారు. అవి పొలాలకు చేరి ఉప్పు కయ్యలుగా మారిపోతున్నాయి. దీంతో నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది నిడమర్రు మండలం అడవికొలను కలందకోడుపాయలో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరినాట్లు దెబ్బతిన్నట్లు అంచనా. ఇటీవల నిడమర్రు జన్మభూమి సభలో రైతులు ఎంఎల్ఎను ఈ విషయమై నిలదీస్తే ఏమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. ఎకరాకు రూ.పది వేలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఎకరానికి 50 బస్తాలకుపైగా దిగుబడులొచ్చే పొలాలు పంటకు పనికిరానివిగా మారిపోవడంతో రైతుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. ఆకివీడు, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు మండలాల్లో ఐదో కాంటూరులోని వేలాది ఎకరాల జిరాయతీ భూముల్లో రబీసాగు చేస్తారు. ఇవి పంటకు పనికిరాకుండా పోవడంతో కాంటూరు పైభూములను చెరువులుగా మార్చేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కాంటూరు పరిధిలో ఉన్న భూముల్లో చెరువులు తవ్వేందుకు వీల్లేకుండా పోయింది. దీంతో వేలాది ఎకరాల భూములు వచ్చే ఏడాది నుంచి బీడుగా మారే పరిస్థితి నెలకొంది. మరో రెండేళ్లలో 'పశ్చిమ' డెల్టాలో వరిసాగు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి కన్పిస్తోంది. నిడమర్రుకు మండలం అడవికొలను కలందకోడుపాయలో మూడున్నర ఎకరాల్లో వరివేసి రెండుసార్లు నాట్లు వేసి నష్టపోయానని రైతు ఇప్పిలి వెంకటరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన రైతు అబ్బులు కూడా రెండుసార్లు నాట్లు వేసి నష్టపోయినట్లు తెలిపారు.

95 మంది కోడి పందెం రాయుళ్లకు జైలు

ప్రజాశక్తి - నిడదవోలు, చాగల్లు

సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేల్లో పాల్గొన్న 95 మందికి పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు కోర్టు మూడు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికీ రూ.వంద చొప్పున జరిమానా విధించింది. నిడదవోలు సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధి నిడదవోలు, చాగల్లు మండలాల్లో నిర్వహించిన కోడిపందేల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 95 మంది పందెం రాయుళ్లను అరెస్టు చేశారు. వారిని బుధవారం కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో మూడు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.వంద చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్రీలక్ష్మి తీర్పునిచ్చారు. కొంతమందిని తణుకు సబ్‌జైలుకు, మరికొంత మందిని ఏలూరు జిల్లా జైలుకు తరలించారు.

2, 3 తేదీల్లో జెకెసి గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు



వివరాలు వెల్లడిస్తున్న ఎన్ఇఎస్ పాలకవర్గ సభ్యులు

గుంటూరులో జెకెసి కళాశాలను స్థాపించి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఫిబ్రవరి 2, 3 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సిఎం చంద్రబాబు, అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ హాజరవుతారని చెప్పారు. ఈ మేరకు వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. ఎన్ఇఎస్ అధ్యక్షులు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య మాట్లాడుతూ.. కాలేజీ గ్రామీణ ప్రాంతాల్లోని రైతు, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు జాగర్లమూడి చంద్రమౌళి సారథ్యంలో చేబ్రోలు హనుమాయమ్మ, విద్వాన్ గోగినేని కనకయ్య, వైకెఎస్ ప్రకాశరావు, డాక్టర్ కె.బసవపున్నయ్య, డాక్టర్ కె.సదాశివరావు, మరికొంతమంది భాగస్వాములుగా ఏర్పడి ఎన్ఇఎస్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్ఇఎస్ సెక్రెటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రెండ్రోజులపాటు నిర్వహించే వేడుకల్లో మొదటి రోజు జస్టిస్ జాస్తి జలమేశ్వర్, కోడెల, రెండోరోజు వెంకయ్య నాయుడు, చంద్రబాబు హాజరవుతారని వివరించారు. ఎన్ఇఎస్ ట్రెజరర్ జె.మురళిమోహన్ మాట్లాడుతూ.. ఎన్ఇఎస్‌కు సంబంధించి 10 వేల మంది విద్యార్థులు, వెయ్యి మంది అధ్యాపకులు ఉన్నారని తెలిపారు.

శ్రీవారి ఆలయంలో 'కదిలే పైకప్పు'

మూడు నెలల్లో నిర్మాణం పూర్తి : జెఇఒ

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి



శ్రీవారి ఆలయంలో 'కదిలే పైకప్పు'కు విరాళాన్ని అందిస్తున్న దాతలు.

శ్రీవారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం 'కదిలే పైకప్పు'ను తెరపైకి తెచ్చారు.. మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు జెఇఒ శ్రీనివాసరాజు వెల్లడించారు. వర్షం పడుతున్నపుడు, తీవ్రమైన ఎండల సమయంలోనూ భక్తులకు ఇబ్బంది లేకుండా 'పైకప్పు'ను ఏర్పాటు చేయడం, వాతావరణం అనుకూలంగా ఉన్నపుడు పైకప్పును తొలగించడమే కదిలే పైకప్పు అంటే. శ్రీనివాసరావు బుధవారం మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ బ్యాడ్మింటన్ అధ్యక్షులు, మాజీ క్రికెటర్ శ్రీచాముండేశ్వరినాథ్ రూ.50.14 లక్షలను విరాళంగా అందించారని, వాటితో తిరుమలరాయ మండపం తరువాత కళ్యాణ మండపానికి వెళ్లే మార్గంలో 'కదిలే పైకప్పు'ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మైం హోం గ్రూప్ ఛైర్మన్ రామేశ్వరరావు రూ.1.01లక్షల విరాళాన్ని ఇచ్చారని, రూ.74 లక్షలను వెచ్చించి పడికావలి నుంచి ధ్వజస్తంభం వరకు మరో కదిలే పైకప్పును ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆలయ ప్రదక్షిణ మార్గంలో వకుళమాత పోటు, పరకామణి, సబేరా ప్రాంతాల్లోనూ కదిలే పైకప్పు ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారని చెప్పారు.

ప్రత్యేకం

టెట్ విద్యార్థులకు ఇక్కట్లు

- విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో పనిచేయని సర్వర్
- 13 జిల్లాల నుండి భారీగా తరలివచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి



విద్యాశాఖ కార్యాలయంలో బారులు తీరిన టెట్ విద్యార్థులు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పరీక్ష రాయాల్సిన విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. టెట్ పేపర్‌లో తెలుగు, హిందీ లాంగ్వేజీ పండిట్స్‌కు ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పులు చేసుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుండి టెట్ విద్యార్థులు వందలాదిగా రాజధాని బాట పట్టారు. ఇబ్రహీంపట్నం విద్యాశాఖ కార్యాలయంలోని ఐటి సెల్ విభాగం బుధవారం విద్యార్థులతో కిటకిటలాడింది. ఆన్‌లైన్‌లో అప్లికేషన్స్ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ అందులో ఎడిట్ కాలం ఆప్షన్‌లో తరచుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో మార్పులు చేర్పులు చేసుకునేందుకు తప్పనిసరిగా అభ్యర్థులు విద్యాశాఖ ప్రధాన కార్యాలయానికి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎవరైనా టెట్‌లో పేపర్-2 నుంచి పేపర్-3 లాంగ్వేజ్ పండిట్స్ తెలుగు, హిందీగా మార్చుకోవాలనుకుంటే కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇబ్రహీంపట్నం వెళ్లి అక్కడే ఫిర్యాదులను రాసి ఆన్‌లైన్ అప్లికేషన్‌ను జతపరిస్తే వెంటనే ఫిర్యాదును స్వీకరించి సబ్జెక్ట్ ఆప్షన్‌ను మారుస్తారు. ఈ అవకాశం ఫిబ్రవరి రెండో తేదీ వరకూ మాత్రమే ఉండగా గడువును ఈ నెల 6వ తేదీ వరకు పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రిపరేషన్‌కు సమయం చాలదంటున్న విద్యార్థులు

టెట్ పరీక్ష మరోసారి వాయిదా వేయడం అనివార్యంగా కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అస్పష్ట విధానంతో ప్రకటించిన సిలబస్ మారుతుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ మరింతగా పెరుగుతోంది. టెట్ ప్రిపరేషన్‌కు సమయం సరిపోదని శ్రీకాకుళం జిల్లా నుండి వచ్చిన కృష్ణ, విజయనగరం జిల్లా నుండి వచ్చిన పార్వతి ప్రజాశక్తికి తెలిపారు.

సంక్షిప్తం

కోరమాండల్‌లో అప్రెంటీస్ విద్యార్థి మృతి

కాకినాడ రూరల్ (తూర్పుగోదావరి):తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కోరమాండల్ కంపెనీలో ప్రమాదవశాత్తు అప్రెంటీస్ విద్యార్థి బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ కొత్తపల్లికి చెందిన బాళ్లపాటి ప్రేమ్‌కుమార్ (19) ఐటిఐ మెకానికల్ పూర్తి చేశాడు. ఆరు నెలల క్రితం కోరమాండల్ ఫ్యాక్టరీలో అప్రెంటీస్‌గా చేరాడు. బుధవారం విధుల్లో భాగంగా ఫ్యాక్టరీకి వెళ్లాడు. యంత్రాలను పైకి ఎక్కి శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. యాజమాన్యం వెంటనే జిజిహెచ్‌కు తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. చేతికందొచ్చిన కుమారుడు చనిపోవడంతో తండ్రి రోదిస్తున్న తీరు అందరినీ కంట తడిపెట్టించింది. తమ కుమారుడు ఎలా చనిపోయాడో కూడా చెప్పట్లేదని గంగారావు కన్నీరుమున్నీరయ్యారు. సర్పవరం ఎస్ఐ తమ్మినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.మృతుని కుటుంబానికి రూ.30 లక్షలు పరిహారం అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ డిమాండ్ చేశారు.

నెల్లూరులో అవయవదానం

నెల్లూరు: జిల్లాలోని సింహపురి వైద్యశాలలో అవయవదానం జరిగింది. జిల్లాలోని విడవలూరు మండలం మోడేగుంటకు చెందిన బుజ్జయ్యకు బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. అనంతరం బుజ్జయ్యకు చెందిన గుండెను చెన్నై గ్లోబల్ ఆసుపత్రికి కిడ్నీ తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు.

సంపాదకీయం

కార్మికాగ్రహం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మికలోకం సత్యాగ్రహం నిర్వహించిన తీరు అపూర్వం! సంఘాల అనుబంధాలను, రాజకీయ భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి ఉద్యోగులు, కార్మికులు ఈ కార్యక్రమంలో భాగస్వాములైన తీరు అమోఘం! ఈ కార్మికాగ్రహాన్ని అణచివేయడానికీ, దాన్ని విఫలం చేయడానికీ ప్రభుత్వాలు పన్నని పన్నాగం లేదు. అనేక చోట్ల భారీ ఎత్తున అరెస్ట్‌లకు దిగాయి. కొన్ని చోట్ల తీవ్ర నిర్బంధ చర్యల్ని అమలు చేశాయి. అయినా, ఈ కార్యక్రమం విజయవంతమైన తీరు తాము పట్టిన కుందేలుకు మూడేకాళ్లన్నట్టుగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద చెంపపెట్టు! నిజానికి కార్మికలోకం ఈ విధంగా స్పందించడం ఇదే మొదటిసారి కాదు. కొద్ది రోజుల క్రితమే స్కీం వర్కర్లు దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో రోడ్లమీదకొచ్చారు. అంతకుముందు కార్మికసంఘాల ఆధ్వర్యంలో దేశ రాజధానిలో జరిగిన మహాముట్టడి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. అన్ని రాష్ట్రాల నుండి లక్షలాది మంది వివిధ రంగాలకు చెందిన కార్మికులు , ఉద్యోగులు న్యూఢిల్లీకి తరలివెళ్లి రోజుల తరబడి భైఠాయించి హక్కుల పరిరక్షణకోసం నినదించారు. ప్రభుత్వరంగాన్ని పరిరక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్మిక గర్జన దేశప్రజల చెవికిసోకకుండా చూడటానికి కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం, ఆ ప్రభుత్వ వందిమాగాధులు, దళంగా వ్యవహరించే కార్పొరేట్ మీడియా పడ్డపాట్లు ఇన్నీఅన్నీ కావు. తాజా సత్యాగ్రహం సందర్భంగానూ ప్రధాన స్రవంతిగా తమనుతాము చెప్పుకునే మీడియా సంస్థలు ఇదే ధోరణి అనుసరించడం విచారకరం! కార్మికలోకం డిమాండ్లపై చెవిలో సీసం పోసుకున్నట్లు వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం అదేసమయంలో కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తుతున్న తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాల్ని మరింతగా సవరిస్తామని దావోస్ సమావేశంలో ప్రధాని మోడీ ఉద్ఘాటించిన తీరు దీనికో ఉదాహరణ మాత్రమే! ఈ మాటల అర్థం ఇప్పటికే అంతంతమాత్రగా ఉన్న శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలను మరింత దిగజారుస్తామనే! ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఈ వైఖరి కారణంగానే కార్మికలోకంలో ఆగ్రహం రోజురోజుకీ తీవ్రమౌతోంది.

దేశంలో ఆర్థికసరళీకరణ విధానాల ప్రారంభంతోనే కార్మిక హక్కులపై దాడికూడా మొదలయ్యింది. ఉజ్వల భవిష్యత్ పేరుతో కాంగ్రెస్, మెరిసే భారత్ కోసమంటూ బిజెపిలు కార్పొరేట్‌లకు సలాం కొట్టాయి! ఫలితంగా ఎనిమిది గంటల పనిదినం ఇప్పుడు కాగితాలకే పరిమితమయ్యింది. ఉద్యోగభద్రత గాలికెగిరిపోయింది. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పీస్ రేట్ విధానాలతో కనీసవేతనాల చట్టం పారిశ్రామికాధిపతులకు చుట్టంగా మారింది. పని ప్రదేశంలో భద్రత, వారాంతపు సెలవులు, ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటివి అడగడమే నేరంగా మారింది. సంఘాల్ని ఏర్పాటు చేసుకోవడమంటేనే విద్రోహ చర్యగా భావించే పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో కార్మిక సంఘాలను రిజిస్ట్రేషన్ చేయడం కూడా మానివేశారు. సంఘాలను రిజిస్టర్ చేయించడం కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితుల్ని ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. చాపకింద నీరులా అమలు చేసిన ఈ విధానాల్ని కార్మికలోకం ఎప్పటికప్పుడు ప్రతిఘటిస్తూ, సంఘటితమౌతూ వచ్చింది. యుపిఎ ప్రభుత్వ హయంలోనూ, ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వ హయంలోనూ జరిగిన దేశ వ్యాప్త సమ్మెలే దీనికి నిదర్శనం. అయినా, ప్రభుత్వ విధానాల్లో మార్పులేకపోవడంతో తాజా సత్యాగ్రహం అనివార్యమయ్యింది.

నిజానికి కార్మికలోకం అడుగుతున్నవి గొంతెమ్మ కోరికలేమీ కావు. ఉపాధికల్పనా చర్యల్ని మెరుగుపరచడం ద్వారా నిరుద్యోగాన్ని అదుపుచేయాలన్నది వారి మొదటి డిమాండ్. మినహాయింపు ఏమాత్రం లేకుండా కార్మిక చట్టాల్ని అమలు చేయాలని, సార్వత్రిక సామాజిక భద్రతను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని, 18వేల రూపాయలను నెలకు కనీస వేతనంగా నిర్ధారించాలని, 3 వేల రూపాయల మొత్తాన్ని కనీస ఫించనుగా ఇవ్వాలని కోరుతున్నారు. అదే విధంగా ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరించడం మానుకోవాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, బోనస్, పిఎఫ్‌లమీద సీలింగ్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. దరఖాస్తు సమర్పించిన 45 రోజుల్లోగా కార్మికసంఘాలను రిజిస్టర్ చేయాలని, యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను సవరించడం మానుకోవాలని, రైల్వే, బీమా, రక్షణ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని అనుమతించొద్దని కూడా వీరి డిమాండ్లలో కొన్ని! వీటిని అమలు చేస్తే కార్మికులకే కాదు, మాంద్యంతో కునారిల్లుతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా లాభం. అయినా, వీటిలో ఏ ఒక్కదానిపట్ల కూడా ప్రభుత్వం సానుకూల స్పందన వ్యక్తం చేయకపోవడం దాని కార్మిక వ్యతిరేక వైఖరిని తెలియచేస్తోంది. ప్రభుత్వ వైఖరిలో ఇప్పటికైనా మార్పు రాకపోతే రానున్న కాలంలో మరిన్ని పెద్ద ఉద్యమాల్ని చవి చూడాల్సివస్తుంది.

ఇదీ విషయం




గ్రహణాలంటే ఎందుకు
దేవుళ్ళకు భయం...
తలుపులు మూసేసి మరీ
కూర్చున్నది బ్రాహ్మణ్యం!

వేద సంప్రోక్షణలంటూ
అజ్ఞానపు తెరలు...
ఖగోళ సంభ్రమల పైన
పెంచుతున్న భ్రమలు...

- కొల్లూరు వెంకట్

మోడీ మోతలో అతిశయాల రాతలు



తెలకపల్లి రవి



దేశంలో రాజకీయాలతో పాటే సంపాదకుల, వ్యాఖ్యాతల దృష్టి కోణాలు కూడా మారుతున్నాయి. జయాపజయాలతో నిమిత్తం లేకుండా దేశ హితం దృష్టిలో వుంచుకుని దిశా నిర్దేశం చేయడం ప్రజాపక్ష మేధావుల బాధ్యత. న్యాయం గెలుస్తుందన్న మాట నిజమే గాని గెలిచేదంతా న్యాయం కాదంటాడు శ్రీశ్రీ. ఎవరెవరి ఇష్టాయిష్టాలతోనూ నిమిత్తం లేకుండా వ్యాఖ్యాతలు నిష్టుర సత్యాలను నిరభ్యంతరంగా వక్కాణించవచ్చు. కాని ఆ చెప్పడంలో నిగ్రహం నిజాయితీ నిష్పాక్షికత వుండాలి. ఓడిపోయినంత మాత్రాన మంచి నాశనమైపోదనీ విజయం సాధించినంత మాత్రాన చెడు శాశ్వతం కాదనే విశ్వాసం కలిగించాలి. కాంగ్రెస్ మంచిది కాదు గనక బిజెపి ఎంతటి ప్రమాదకర వ్యూహాలు చేపట్టినా ఫర్వాలేదని, వైసీపీ నేతపై పాత కేసులను కూడా పట్టించుకోనవసరం లేదని అంటే కుదరదు. చిరకాల మిత్రులు సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి తన 'త్రికాలం' శీర్షికలో 'బహుళత్వంతోనే భవిష్యత్తు' అంటూ ఒక వ్యాసం రాశారు (28.1.18). మరో మిత్రుడు ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు 'సార్వత్రిక సమీకరణలు' అంటూ (31.1.18న) తన కాలమ్ రాశారు. పరస్పరం బద్ధశత్రువుల్లా కనిపించే పత్రికల్లో ఒకే విధమైన రాతలే రావడం పాలక వర్గాల అదృశ్య బంధాలకు నిదర్శనం.

రామచంద్ర మూర్తి ఇటీవల నేపాల్ లోని లుంబిని నుంచి లక్నో వరకూ కారులో యాత్ర చేశారట. అన్నీ చూశాక బోధి చెట్టు కింద కూచోనవసరం లేకుండానే జ్ఞానోదయమైందట. మైనారిటీలను పూర్వపక్షం చేసి మెజారిటీ మతస్తులను ఏకం చేయడం ద్వారా బిజెపి అధికారం సాధించడం, ఇందుకు క్షేత్రస్థాయి వాస్తవికతను అర్థం చేసుకుని చాకచక్యంగా వ్యూహం రచించడం జరిగిందని తెలుసుకున్నారు. అమెరికాలో జాతిమత దురహంకార రచయిత శామ్యూల్ హంటింగ్టన్ చెప్పిన 'క్లాష్ ఆఫ్ సివిలైజేషన్స్' (నాగరికతల లేదా మతాల యుద్ధం) పుస్తకంలో అమెరికాను వైట్ ఆంగ్లో ప్రొటెస్టెంట్ 'వాస్ప్' అన్నట్టు ఒక మూస లోకి ఇండియాను మార్చడమే బిజెపి వ్యూహమట. అది సాధ్యమైనా కాకున్నా ఆ దిశగా ప్రయత్నానికి ఊతం దొరికిందట. మతోన్మాదం అనక పోయినా కనీసం మతతత్వం అనడానికి కూడా సిద్ధపడకపోగా అదే చాకచక్యమైన వ్యూహమనీ క్షేత్ర స్థాయి వాస్తవికత అనీ కీర్తించడం ఆశ్చర్యకరం. రథయాత్రతో మొదలై బాబ్రీ విధ్వంసంతో బిజెపి లక్ష్యం నెరవేరిందట. ఒక 2014లో మోడీ అద్భుత విజయానికీ రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన 'ఇండియా దటీజ్ భారత్'కూ ఈ భావజాలానికి పొంతన లేదని చాలా జాగ్రత్తగా అన్నారు. అంటే ఆ భావనే తప్పునా? యోగి ఆదిత్యనాథ్‌ను ప్రస్తావించి-మతం పట్ల భక్తి ముక్తికి దారి తీస్తే, రాజకీయాలలో భక్తి...వ్యక్తి పూజ పతనానికి దారి తీస్తాయని, నియంతృత్వానికి బాట వేస్తాయని అంబేద్కర్ చెప్పిన మాట ప్రస్తావించారు. అందుకే 'ఇందిరే ఇండియా' అన్న అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు దేవకాంత బారువా నల్లటి అక్షరాలతో నమోదైన దోషిగా మిగిలిపోయాడన్నారు. ఇలాంటి వర్ణనలు బాబ్రీని కూలదోసిన అద్వానీకి గాని, గుజరాత్ మారణహోమాన్ని అనుమతించిన మోడీకి గాని (నిజానికి ఆ ప్రస్తావనే ఆయన తీసుకోలేదు) వర్తింపచేయలేదు. మోడీ పట్ల కొందరు ముఖ్యమంత్రుల పట్ల అంధ భక్తుల వీర విధేయత చూస్తే భయం కలగక మానదని మాత్రం ముక్తాయించారు. రాజకీయ వంధిమాగధులు అంధ భక్తులవుతారా? ఈ రోజున ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో అత్యంత జనాదరణ గల నాయకుడు అనడంలో ఎవ్వరికీ సందేహం లేదు అని వ్యాసం మొదలెట్టిన రచయితకు ఈ అంధ భక్తి గమనంలో వున్నట్లా? లేనట్టా?

ఈ వ్యాసకర్త స్వాతంత్ర్య యోధులలో అత్యధికులు తమ మతాన్ని ప్రేమించారని చెప్పడం, వివేకానందను ప్రస్తావించడం ఇప్పటి హిందూత్వకు సమర్థనలా అనిపిస్తే తప్పు పట్టలేం. వివేకానంద చెప్పిన దానికి ఇప్పటి మోడీత్వ/ హిందూత్వకు హస్తిమ శకాంతరం వుంది. దేశభక్తితో పాటు వివేకానందనూ పటేల్‌ను అంబేద్కర్‌నూ సొంతం చేసుకోవడానికి బిజెపి దాని అనుబంధ సంస్థలూ 'శక్తి వంచన' లేకుండా ప్రయత్నిస్తున్నాయని వ్యాసకర్త రాశారు. రాజకీయ కుయుక్తి వంచనను శక్తి వంచన లేని ప్రయత్నం అనుకోమంటారా? బిజెపియే ఆరెస్సెస్‌కు అనుబంధం కాగా బిజెపి అనుబంధ సంస్థలని చెప్పడంలో ఆంతర్యమేమిటి? ఈ వ్యాసంలో ఎక్కడా ఆరెస్సెస్ ముచ్చటే లేదు. పైగా నెహ్రూ, ఫిరోజ్ గాంధీ కుటుంబ వృక్షాన్ని మాత్రమే పట్టుకుని వేళ్లాడటం వల్ల బిజెపికి అవకాశం వచ్చిందట. కాంగ్రెస్ చేసిన చాలా తప్పులూ, అవినీతి రాజకీయాల కంటే పివి నరసింహారావును మరణానంతరం అవమానించడం, వైఎస్ జగన్‌పై కేసులు పెట్టడం ఆయనకు మహాపరాధాలుగా కనిపించాయి. పివి హయాంలో అనేక కుంభకోణాలు జరిగిన మాట నిజం. నిర్లిప్తంగా కూచుని బాబ్రీ విధ్వంసం అనుమతించిన మాట నిజం. రచయిత కీర్తిస్తున్నట్టు అయిదేళ్లు ప్రధానిగా కొనసాగడానికి ఫిరాయింపులు ప్రోత్సహించి దొరికిపోయిన మాట నిజం. ఇక జగన్‌పై కేసులు న్యాయ స్థానంలో వున్నాయి. వాటి వెనక సోనియా గాంధీ కక్ష వుండొచ్చు. వాటిని అదేపనిగా చెబుతూ ఆయన ప్రతిపక్ష నాయక గౌరవాన్ని టిడిపి ప్రభుత్వం గుర్తించకపోవడం ముమ్మాటికీ తప్పే కావచ్చు. కాని ఆ కేసులను ఏకపక్షంగా కుట్ర కింద తీసిపారేయడం కుదిరే పని కాదు. ఇలాంటివన్నీ బిజెపి కుటిల వ్యూహాలకు సమర్థనలెలా అవుతాయో మాన్య సంపాదకులకే తెలియాలి. రాజీవ్‌గాంధీ షాబానో బిల్లు తప్పన్నట్టే ఇప్పుడు తలాక్ పేరిట రాజకీయాన్ని కూడా విమర్శించగలగాలి తప్ప దీన్ని ఆకాశానికెత్తడం ఏం న్యాయం?

రామచంద్ర మూర్తి తన వ్యాసంలో కమ్యూనిస్టులపై అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేశారు.. 'కమ్యూనిస్టు పార్టీలు కూడా నేల విడిచి సాము చేయడం, విదేశీ అనుభవాలనూ భావజాలాలను అరువు తెచ్చుకోవడానికి ప్రయత్నించడం ద్వారా చీలికలూ పేలికలై కృశించి నశించడానికి సిద్ధంగా వున్నాయని సెలవిచ్చారు. దీనివల్ల కూడా బిజెపి భావజాలం బలపడటానికి దోహదం కలిగిందట. శామ్యూల్ హంటింగ్టన్ వాస్ప్ భావనను అమిత్‌షా-మోడీలు అనుసరిస్తే వ్యూహం. ప్రపంచ చరిత్రనే మార్చిన మార్క్సిజాన్ని కమ్యూనిస్టులు అనుసరిస్తే విదేశీ భావజాలం! ఎంత విచిత్ర తర్కం!! భారత రాజ్యాంగంలో రాసుకున్న సోషలిస్టు పదం మనదా విదేశాలదా? తామే నమ్మని గాంధేయ సోషలిజం తెస్తామని చెప్పిన బిజెపి విదేశీ భావజాలం అనుసరించలేదా? మొత్తానికి విధ్వంసాలు మారణహోమాలతో సహా బిజెపి తప్పులేమో వ్యూహాలు. ఇతరులు చేసినవేమో పాపాలు. మధ్యలో కమ్యూనిస్టులకు మరణ శాసనాలు. బిజెపి వ్యూహాల ఫలితమైన మితవాద మొగ్గుకు ఇవే నిదర్శనాలనుకోవాలా? వైసీపీ బిజెపికి సన్నిహితమవు తున్నదనే కథనాలు కూడా ఇలాంటివేనా? వైసీపీ మెల్లగా బిజెపితో సన్నిహితం అవుతుండడం కూడా ఇలాంటి పరిణామమేనా?

నిజంగా కమ్యూనిస్టులు కృశించి వుండవచ్చు. సింహం కృశించినా గడ్డి తినదన్న భర్తృహరి మాట పండితులు గుర్తు పెట్టుకోవాలి. అవకాశవాదాలూ అనర్థక వ్యూహాలతో అందలాలు అందిపుచ్చుకోవడం కంటే ఆశయాల కోసం కృశించడం గొప్ప. అంత మాత్రాన వారు నశించి పోతారనడం అనుచితమే గాక అసంబద్ధం. ఇంతకన్నా పెద్ద సవాళ్లే కమ్యూనిస్టులను నాశనం చేయలేకపోయాయి. కనుకనే ఇప్పటికీ బిజెపికి ప్రథమ శత్రువుల్లా కనిపిస్తున్నారు. వారే నశించి పోయి వుంటే జెఎన్‌యులో హెచ్‌సియులో దాడులూ ప్రతిఘటనలూ సంభవించి వుండేవి కావు. త్రిపురలో సిపిఎంను ఓడించేందుకు బిజెపి ఉగ్రవాదులతోనూ జతకట్టి వుండేది కాదు. ఈ క్షణం రెండు రాష్ట్రాల్లో పాలిస్తున్న వారిని, మరో రాష్ట్రంలో మూడు దశాబ్దాలు పాలించిన వారినీ, కేంద్రంలో మూడు సార్లు ప్రత్యామ్నాయానికి పునాదులు వేసిన వారినీ ఇంత మాట అనడం ఎర్రజండా నీడన వున్న కోటానుకోట్ల మందిని అవమానించడమే. నేపాల్ దాకా వెళ్లిన సంపాదక మహాశయులకు ఒక 'హిందూ' రాజ్యంలో కమ్యూనిస్టుల అఖండ విజయం ఎలాటి జ్ఞానోదయం కలిగించలేదా? పివి అనే ఒక్క వ్యక్తిని అవమానించినందుకే అంత ఆవేదనకు గురైన వ్యాసకర్త ప్రగతిశీల శక్తులను ఈ మాటతో ఎంతగా అవమానిస్తున్నారు? కేంద్రంలో మోడీ దాడులు మొదలెట్టాక ప్రతికూల పరిస్థితులు ఎంతగా పెరిగాయో ప్రతిఘటన కూడా పెరుగుతున్న మాట కాదనలేనిది. మోడీ మరోసారి గెలుస్తారని నమ్మితే నమ్మండి, చెబితే చెప్పండి. ఆయనపై సానుకూలత పెంపొందించాలంటే నిరభ్యంతరంగా కీర్తించండి. కాని అందుకోసం కమ్యూనిస్టుల నాశనం వూహించకండి.

ఇక ఇండియా గేట్‌లో ఎ.కృష్ణారావు కూడా ఇప్పుడు దేశంలో మోడీ అమిత్ షా తప్ప మరెవరూ కనిపించడం లేదంటూ మొదలు పెట్టారు. అది ఆయన స్వీయ భావన కావచ్చు. పైగా ఈసారి కేంద్రంలో ఆరెస్సెస్ భావజాలం గలవారి నియామకాలు పెరిగాయంటూనే ఇతరేతర ప్రభావాలు తగ్గిపోయాయని కితాబిచ్చారు. కొంతమంది అక్రమంగా ప్రయోజనం పొందినా బిజెపి, ఆరెస్సెస్‌లు సాధ్యమైనంత జాగ్రత్త తీసుకుంటున్నాయని మెచ్చుకున్నారు. విశ్వ విద్యాలయాల అధిపతుల నుండి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తుల వరకూ ఎంతటి ప్రకంపనాలు ఎదుర్కొంటున్నదీ ఈ రచయితకు కనిపించినట్టు లేదు. పైగా యుపిఎ హయాంలో పైసలు, పైరవీలతో తల్లీ కొడుకులు కూతురు చెప్పే వారికే పదవులు దక్కేవని ప్రతివాదన చేశారు. అంతేగాక యుపిఎ వున్నప్పుడు వామపక్షవాదులను నియమించేదని నేరుగా వామపక్షాలే వుంటే ఏం జరిగేదో వూహాగానం చేయాలన్నారు. ఇదంతా ఒక సైద్ధాంతిక ఘర్షణగా అభివర్ణిస్తూ-అందులో భాగంగానే ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ కులతత్వాలు వదలిపెట్టాలని పిలుపునిచ్చారని, ఎన్నో దశాబ్దాల తర్వాత కుల ప్రాతిపదికన ప్రభుత్వాలకు ఆస్కారం లేకుండా పోయిందట. ఇప్పుడు మోడీపై బిజెపిపై ఆ కులాన్నే ప్రయోగించడానికి బిజెపియేతర శక్తులు సమీకృతమవుతున్నా యట. ఒకప్పుడు ప్రగతి భావమే ప్రాణంగా కవితలల్లిన కృష్ణుడు రాసిన రాతలేనా ఇవి? వెంకయ్య నాయుడు స్నేహం ఎంత ప్రగాఢమైనా మరీ ఇంత ప్రతీప భావజాల ప్రశంస అవసరమా? వర్ణ వ్యవస్థను భుజాన మోసే ఆరెస్సెస్ దళితులు, మైనార్టీలపై చేస్తున్న దాడులను, ఆవు రాజకీయాలను, స్త్రీ వ్యతిరేక వ్యాఖ్యానాలను చూడరు. పైగా వీటిని వ్యతిరేకించే ఈ శక్తులన్నీ కలసి మోడీ అమిత్ షా సంఘ పరివార్ భావజాలన్ని ఎదుర్కోగలుగుతాయని చెప్పడానికి ఆధారాలేమీ లేవంటున్నారు రచయిత. ఇంతకూ మొన్నటి గుజరాత్ ఫలితాలు, ఇప్పుడు కొన్ని సర్వేల ఫలితాలతో మోడీ, అమిత్ షాలే విజయానికి వంద విన్యాసాలు చేస్తున్నారు. కాని ప్రతీపశక్తులకు అజేయతను ఆపాదిస్తూ ప్రత్యామ్నాయం కోసం తమ తమ పద్ధతులలో పోరాడుతున్న వారిని నిరుత్సాహపర్చే ఇలాటి రాతలు ఉద్దేశపూర్వకమైనవనుకుంటే పొరబాటు లేదు. ఇవి ఎవరినీ కాపాడలేవు కూడా. ✦

చర్చ

అంతా బాగుంటే చదువేది?

2017-18 ఆర్థిక సర్వేలో విద్యకు సంబంధించిన అంశాలు అసంబద్ధంగా వున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు బాగా పెరిగినట్లు, మధ్యలో బడి మానేస్తున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గినట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ వుండాలి. అంతకన్నా మెరుగ్గా 23 మంది విద్యార్థులకు ఒక టీచర్ వున్నట్లుగా చెప్పారు. 30 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున తరగతి గది వుండాలన్న నిబంధనకు అనుగుణంగా 73.4 శాతం పాఠశాలలు వున్నట్లు ప్రకటించారు. ఇవన్నీ ప్రభుత్వ విద్య నాణ్యతకు బాటలు పరిచినట్లు ప్రశంసించారు. కానీ ఇటీవల విడుదలైన వార్షిక విద్యాస్థాయి నివేదికలు, జాతీయ సామర్థ్య సర్వే నివేదికలోని అంశాలు అందుకు విరుద్ధంగా వున్నాయనే విషయాన్ని గమనించాలి.

అసెర్ 2016 నివేదిక ప్రకారం 3వ తరగతి విద్యార్థుల్లో 42.5 శాతం మంది మాత్రమే ఒకటో తరగతి ప్రథమ భాష వాచకాన్ని చదవగలరు. 5వ తరగతి విద్యార్థుల్లో ఇంగ్లీష్ వాక్యాలు చదవగలవారు నూటికి 24.5 మందే. 8వ తరగతి విద్యార్థుల్లో మూడంకెల సంఖ్యని ఒక అంకెతో భాగించగల వారు 43.3 శాతం మంది మాత్రమే. అసెర్ 2017 నివేదిక ప్రకారం సెకండరీ (9-12 తరగతులు) స్థాయి విద్యార్థుల్లో నూటికి 25 మంది మాత్రమే ప్రథమ భాషా పుస్తకాన్ని అనర్గళంగా చదవగలరు. మూడంకెల సంఖ్యని ఒక అంకెతో భాగహారాలు చేయగల వారు సగం మంది మాత్రమే. చిన్న చిన్న ఇంగ్లీష్ వాక్యాలను తప్పుల్లేకుండా చదవగలవారు 56.5 శాతం మంది ఈ నెల 15న కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ విడుదల చేసిన 'జాతీయ సామర్థ్య సర్వే (ఎన్‌ఎఎస్)' నివేదికలో కూడా అసంతృప్తికరమైన పరిస్థితే కనిపించింది. అయినా ఆర్థిక సర్వేలో అంతా బాగుందని చెప్పుకోవడం సరైంది కాదు.

కాగా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి (ఎస్‌టిఆర్) 23.1 గా వుందని, విద్యార్థి తరగతి గది నిష్పత్తి (ఎస్‌సిఆర్) 30:1 మెజార్టీ (73.4) పాఠశాలల్లో పాటించబడుతుంది, అనేవి నిజమే కావచ్చు. అయితే అది ఉపాధ్యాయుల నియామకాలు, తరగతి గదుల నిర్మాణాలు పెరగటం వలన కాదు (9.5 లక్షల టీచర్లు కావాలనే డిమాండ్ గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో వున్న విషయం తెలిసిందే).

అయితే ఎస్‌టిఆర్, ఎస్‌సిఆర్ బాగుండటానికి కారణం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోవటమనే వాస్తవాన్ని గుర్తించాలి. గత ఆరేళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 1.30 కోట్ల మంది విద్యార్థులు తగ్గిపోగా, 1.75 కోట్ల మంది ప్రయివేట్ స్కూళ్లలో పెరిగినట్లు ఎంహెచ్ఆర్‌డి నివేదికలు తెలియజేశాయి. గత నాలుగేళ్ల గా కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు తగ్గిపోతున్న విషయమూ తెలిసిందే. 2014-15లో రూ.1,10,351.10 కోట్ల నుండి 2017-18కి రూ.79,685.95 కోట్లకు తగ్గిపోయింది. శాతాలలో చూస్తే 6.15 నుండి 3.71కి క్షీణించింది. పెట్టుబడి తగ్గినా పాఠశాలల ఫలితాలు పెరిగాయని చెప్పటం అసంబద్ధమైంది.

- నాగటి నారాయణ

జన వాక్యం

మృగాళ్ల దాడులు ఎంత కాలం!


గాంధీజీ వర్ధంతి నాడు, దేశ రాజధానిలో మద్యం మత్తుతో ఓ 28 ఏళ్ళ తాగుబోతు, 8 నెలల పసిపాపపై 'మృగం'లా అత్యాచారం చేయడం సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునే ఘటన. అసలు ఆ రోజున మద్యం దుకాణాలు మూసేయ్యాలనే నిబంధన ఉంది. దీన్నిబట్టే దేశంలో పాలక ప్రభుత్వాల చిత్తశుద్ధి అర్థమౌతోంది. 'మద్యం వ్యాపారాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుంటూ, బడి-గుడి-జనావాసా ల మధ్య విచ్చలవిడిగా, మద్యం దుకాణాలకు ప్రభుత్వాలు అనుమతు లిచ్చేస్తున్నాయి. వావి-వరుస రాత్రి-పగలు తేడాల్లేకుండా, పాలు తాగే పసిబిడ్డల నుండి వృద్ధురాళ్ల వరకు అత్యాచారానికి గురౌతూనే వున్నారు. ఇటువంటి ఘటనల్లో బాధ్యులకు శిక్ష పడటానికి ఎంత కాలం పడుతుందో చెప్పలేం. రాజకీయ నాయకులు సైతం వీరికి అండగా నిలబడుతు న్నారు. వీటిని అరికట్టాలంటే తక్షణం కేంద్ర ప్రభుత్వం 'మద్య నిషేధ చట్టం' అమల్లోకి తేవాలి. వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి.

చాకలకొండ శారద, కావలి, నెల్లూరు జిల్లా.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

వ్యవసాయదారులను ఉద్ధరించలేని బడ్జెట్లు

వ్యవసాయ రంగం



ప్రొ॥ ఎన్ వేణుగోపాలరావు



మళ్లీ బడ్జెట్ సీజన్ వచ్చింది. అంకెల గారడీలు, అబద్ధపు చర్చలు, పేజీల తరబడి రాతలు, నిద్ర మత్తులో ఉన్న లెజిస్లేటర్ల చేత తలలూపించడం, ఎన్నాళ్లీ ప్రహసనాలు?!

'వ్యవసాయాభివృద్ధిని, ఉత్పత్తిదారుల ఆదాయ వ్యయాల ఆధారాలతో బేరీజు వెయ్యాలి గాని తిండి గింజల ప్రమాణాలతో కాదు! పంట ఉత్పత్తికయ్యే ఖర్చు మీద, 50 శాతం అదనంగా ఉత్పత్తిదారుడికి రాబడి కలిగించాలి! అంతర్జాతీయ మార్కెట్ పోటీని తట్టుకొనేందుకు తగిన భారత వాణిజ్య సంస్థ (ఐటిఒ)ను రూపొందించుకోవాలి! ప్రత్యేక ఆర్థిక మండళ్లతో పాటు ప్రత్యేక వ్యవసాయ మండళ్లను ఏర్పర్చాలి! సారవంతమైన పంట భూములను వ్యవసాయేతర అవసరాలకు మరల్చకూడదు! భూమి, నీరు, విత్తనం వంటి ముఖ్య వనరుల పంపకం బాధ్యత ప్రభుత్వానిదే! పరిశోధన, విస్తరణ రంగాలపై ఎక్కువ కేటాయింపులు వుండాలి...' ఇటువంటి అనేక ముఖ్య అంశాల్ని విపులంగా చర్చించి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇచ్చింది జాతీయ రైతు కమిషన్. ఆ నివేదికల్ని ప్రభుత్వం ముందుపెట్టి 11 ఏళ్లు గడిచాయి. నివేదికలు సమర్పించాక యుపిఎ కూటమి 7 బడ్జెట్లను ఎన్‌డిఎ ముఠా 4 బడ్జెట్లను సమర్పించాయి. ప్రతి సందర్భంలో వ్యవసాయానికి కేటాయింపులు పెంచామని, నిధుల్ని, పథకాల్ని ఇంకా ఇంకా పెంచి రైతుల ఆదాయం ద్విగుణీకృతం చెయ్యబోతున్నామని మభ్య పెట్టడాన్ని చూస్తున్నాం.

గత సంవత్సర బడ్జెట్ కేటాయింపులను చూస్తే, వాటి వినియోగాన్ని విశ్లేషిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం ఎలా వుండబోతుందో తెలుస్తుంది. జాతీయ స్థాయి నమూనా సర్వేల ప్రకారం 2004-05లో 16.61 కోట్ల మంది రైతులుంటే, వారి సంఖ్య 2011-12కు 14.62 కోట్లకు, 2015-16కు 14.13 కోట్లకు దిగజారింది. వ్యవసాయం స్థాయి జాతీయ స్థూల అభివృద్ధిలో 2004-05 నాటికి 5.52 శాతంగా ఉంది. అది 2011-12 నాటికి 1.56 శాతం, 2015-16కు 1.23 శాతంగా దిగజారుతూ వచ్చింది. వ్యవసాయ కుటుంబ సగటు ఆదాయం నెలకు రూ.6,426గా వుందని సర్వేలు తెలుపుతున్నాయి. ఖర్చులు ఇంచు మించు అంతే వుండడమో లేక ఇంకా ఎక్కువగా వుండడమో పరిపాటిగా మారింది. ఫలితంగా ఎక్కువ కుటుంబాలు అప్పుల ఊబిలో ఉన్నాయి. దానివల్ల వ్యవసాయదారుల సంఖ్య తగ్గుతోంది. ఈ అంశాన్ని రైతు కమిషన్ ప్రముఖంగా (యువ రైతులు లేని స్థితిని) చర్చించింది. అయినా బడ్జెట్ కేటాయింపుల మంత్రికి ఇది పట్టలా!

గత శతాబ్దం చివరికి దేశంలో 169 మిలియన్ హెక్టార్లుగా వున్న సాగు భూమి 2010-11 కు 160 మి.హె, 2015-16 నాటికి 157 మి.హె. దిగజారిందనే భయంకర సత్యం కూడా ప్రభుత్వ దృష్టిలో లేదు. అభివృద్ధి పేరుతో వ్యవసాయ భూములను వ్యవసాయేతర అనుత్పాదక రంగాలకు మరల్చడం, మానవ వనరుకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించలేక పోవడం ప్రత్యక్ష అనుభవం. పైగా చాలా రాష్ట్రాల్లో 'గైర్హాజరు రైతుల' సంఖ్య పెరుగుతూ రావడం, కౌలు/పాలి/వార/భాగస్వామ్య రైతులు పెరుగుతుండడం చూస్తున్నాం. రైతుల సంఖ్య తగ్గుతున్నా సగటు భూమి లభ్యత పెరక్కపోగా తగ్గటాన్ని గమనంలో ఉంచుకోవాలి. అలాగే భూసార సమస్యలు పెరిగిపోయాయి. ప్రభుత్వ నిర్వాక బడ్జెట్ల వల్ల యూరియా ఎరువు ఉత్పత్తిదారుల లాభాలకు కేటాయింపులు పెరిగాయి. సూక్ష్మ పోషకాల లోపం, సామాన్య రైతులకు అందుబాటులో ఉండని ముఖ్య పోషక ఎరువుల స్థితి కొనసాగుతూనే వుంది. మొత్తం సాగు భూమిలో కేవలం 40 శాతం భూములకు మాత్రమే సాగు నీటి వనరున్నది. అనగా కేవలం 65 మి.హె.లకు పూర్తి తడి లేక ఆరు తడి వసతి కల్పించబడ్డది. ఈ నీటిని సద్వినియోగం చేసుకోగల స్థాయి ప్రభుత్వ శాఖలకు, రైతులకు లేదని తెలిసీ బడ్జెట్ ద్వారా సరిచెయ్యలేక పోతున్నారు.

దేశంలో 33 శాతం పంటల సాగు అతి తక్కువ వర్షపాత ప్రాంతాల్లో (750 మి.మీ కంటే తక్కువ) నడుస్తున్నదని తెలిసీ, ప్రభుత్వ బడ్జెట్ల ద్వారా ఈ ప్రతికూల అంశాల్ని పట్టించుకోలేదు. ప్రాజెక్టుల పేరుతో పట్టించుకొన్నట్లు, నటిస్తున్నారు. ఈ వర్షాధార వ్యవసాయదారులు ప్రతి పది సంవత్సరాల్లో 3-4 సంవత్సరాలు పూర్తి నష్టకర వ్యవసాయంలో కూరుకుపోతారు. వారిని రక్షించగల పథకాలు (ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం) ఎంత ప్రయోజన శూన్యంగా మారాయో ప్రముఖ టీవీ సంస్థల సర్వేలు బయటపెట్టాయి. వారి అంచనా ప్రకారం దేశం మొత్తం మీద బీమా కంపెనీలు రూ.30 వేల కోట్లకు పైగా రైతుల నుండి ప్రీమియంగా వసూలు చేస్తే, ఆ కంపెనీలు రైతులకు ఇచ్చిన నష్ట పరిహారం రూ.3 వేల కోట్లు కూడా లేదు.

2016-17లో ప్రభుత్వం అనుసరించిన వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ పద్ధతి ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతున్నది. దేశంలో అపరాలు, నూనె గింజల కొరత నెలకొన్నది కాబట్టి ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఎంతో విదేశీ మారక ద్రవ్యం వృథా అయ్యిందని ప్రభుత్వం వాపోయి, అపరాలు, నూనె గింజల అభివృద్ధి పథకాల పేరుతో బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. తీరా రైతులు పంట పండించి మార్కెట్‌కు తెస్తే వారెదుర్కొన్న దయనీయ స్థితి ప్రభుత్వ వైఖరికి ప్రతిబింబంగా మారింది. మినుమల సాగు ఖర్చు క్వింటాకు రూ.3265. అయితే మార్కెట్ ధర రూ.3,500 మించి లేదు. ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.4,500. రైతులు ఇదే వరవడిని కంది, పెసర, శనగ, మొక్కజొన్న, వేరుశనగ వంటి ముఖ్య పైర్ల విషయంలో ఎదుర్కొన్నారు. ఇక 'ఇ-నామ్' ఎంత నవ్వుల పాలయ్యిందో తెలిసిందే. ఇంతవరకు అరకొరగా, చేసిన కేటాయింపుల వల్ల ఇ-నామ్‌ను వ్యాపారులు ఈనామ్ (బహుమతి)గా వాడుకున్నారు.

ప్రభుత్వ లెక్కల ప్రకారం గత దశాబ్ద కాలంలో వ్యవసాయ పరపతి రూ.4.68 లక్షల కోట్ల నుండి రూ.8.77 లక్షల కోట్లకు పెంచామని ఆర్భాటంగా ప్రకటించారు. 2016-17లోనైతే దాన్ని రూ.9.92 లక్షల కోట్లకు పెంచామని చెప్పారు. కాని అందులో చిన్న, సన్నకారు కౌలు రైతుల భాగమెంతో ప్రభుత్వం ఎప్పుడైనా పట్టించుకోగలిగిందా? పట్టించుకొన్నట్లయితే బ్యాంకు రుణాలు తీసుకున్న భూస్వాములే వడ్డీ వ్యాపారులుగా ఎందుకు మారతారు? రుణ మాఫీ పేరుతో నడిచే ప్రహసనంలో లాభం పొందుతున్నదెవరు? నోటుకు ఓటుతో నడిచే ప్రభుత్వాలు!

ఇక పంట విత్తనాలన్నీ దాదాపు కంపెనీల పరమయ్యాయి. ఎరువులు, సస్య రక్షణ మందుల నాణ్యత లోపించి రైతుల్ని దిగజార్చాయి. గత సంవత్సరం మహారాష్ట్ర అనుభవాన్నుండి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవడం లేదు. వారిచ్చే సబ్సిడీలు కంపెనీలు లేక మధ్య రాజకీయ దళారుల పరం అవుతూ వున్నాయి. జాతీయ స్థూల పెట్టుబడి కేటాయింపుల పరంగా మిగిలిన రంగాలతో పోలిస్తే వ్యవసాయానికి ప్రభుత్వ కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయని తెలిసి కూడా... తామేదో రైతుల కోసమే ఉన్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదే పదే ప్రకటించుకోవడం విడ్డూరం.

బడ్జెట్ ప్రాధాన్యతలు ఎలా వుండాలి?

✦ పరిశ్రమల కోసం రాయితీలు, వనరులు కల్పిస్తున్నట్లే వ్యవసాయానికి కూడా ఇవ్వాలి! భూస్వాములు, ధార్మిక సంస్థలు, ప్రభుత్వేతర కంపెనీల పడావు భూములను ప్రభుత్వమే కొని వ్యవసాయం చేసే వాళ్ల పరం చెయ్యాలి. దాని కోసం ప్రత్యేక భూ బ్యాంక్ నిధిని ఏర్పర్చాలి. ✦ ప్రభుత్వ మద్దతు ధరలు ముందుగా ప్రకటించి చిత్తశుద్ధితో అవి రైతులకు అందేలా ఏర్పాటు చెయ్యాలి. దీనికి తగిన వ్యవస్థ కోసం నిధులు కేటాయించాలి. ✦ ప్రతి రైతు కుటుంబానికి వ్యవసాయేతర కుటుంబాల స్థాయిలో ఆదాయం వచ్చే స్థితిని కలిగించాలి. ఈ లక్ష్యం నెరవేరాలంటే ప్రతికూల పరిస్థితుల నుండి రైతుల్ని రక్షించగల పథకాలు, నిధులు కావాలి. ✦ ప్రధాన మంత్రి కృషి సంచయి యోజన ద్వారా కొత్త నీటి పథకాలను చిత్తశుద్ధితో నిధులు కేటాయించి అమలు పరచాలి. నిధులు మరల్చకుండా సకాలంలో పూర్తయ్యేట్లుగా నిఘా వ్యవస్థను ఏర్పర్చాలి. ✦ విచ్చలవిడి వ్యాపార వైఖరితో ఎరువులు, విత్తనాలు, సస్య రక్షణ మందుల వాడకం దిశలో నడిచే వ్యవసాయాన్ని అదుపు చెయ్యాలి. అంటే గుడ్డిగా మూఢత్వాన్ని, అశాస్త్రీయతను పెంచే 'దేశీయ ఆవు' ఆధారిత వ్యవసాయాన్ని కాదు. సేంద్రీయతను పెంచి పర్యావరణ రక్షణకు, ప్రజారోగ్యానికి తోడ్పడే వ్యవసాయ విధానాన్ని రూపొందించి, ఆచరింపచేయాలి. ✦ నిపుణుల కమిటీ సిఫార్సులకు విలువనిస్తూ జాతీయ వ్యవసాయ విధానాన్ని రూపొందించుకోవాలి. ✦

jeevanapageps@gmail.com
జీవన the family
JEEVANA



ఉన్నచోటే ఉంటే.. ఆలోచనలు ముందుకుసాగవు. ఒక్కొక్కసారి... అంతకుమించి ప్రపంచం లేదనుకునే ప్రమాదమూ ఉంది. బావిలో కప్ప జీవితం అంటే ఇదే. కానీ.. నాలుగు అడుగులు ముందుకేసి.. కొత్త ప్రదేశాలకు వెళ్ళగలిగినప్పుడే.. అప్పటిదాకా మనం అనుకున్న ప్రపంచం మరోలా.. కొత్తగా తోస్తుంది. అనుభవంలోకి రాని, తెలియని సంతోషాలకూ దగ్గర చేస్తుంది. అందుకే, మనిషన్నాక నాలుగుచోట్లకు తిరగాల్రాబ్బాయ్.. అంటారు పెద్దలు. కానీ, ఈ రోజుల్లో ఎక్కడికైనా వెళ్ళాలంటే.. ఎంతో ఖర్చు.. పర్యటనలు చేయడం అందరికీ సాధ్యమా? అని డీలా పడిపోనక్కరలేదు. మనసుంటే టీ అమ్ముకునైనా నాలుగు దేశాలు చుట్టి రావొచ్చు. ఏంటీ భలేవారే.. జోకులాపండీ అంటారా..?! అయితే ఇదిగో ఈ..ఛాయ్‌వాలాను అడగండి. నాలుగే కాదు.. నలభైనాలుగు దేశాలు సంతోషంగా చుట్టిరావొచ్చంటాడు. పదండి.. ఛాయ్‌వాలా విదేశీయాత్రల గురించి తెలుసుకుందాం!!

ఛాయ్ వాలా! ప్రపంచయాత్ర

'తిరిగే తుమ్మెదకే తేనె దొరుకుతుంది' అనేది ఒక సూక్తి. కేరళ రాష్ట్రం కొచ్చిలో బాలాజీ కాఫీహౌస్ నిర్వహిస్తున్న 67 ఏళ్ల విజయన్, అతని భార్య 65 ఏళ్ల మోహన ఇద్దరూ పర్యాటక ప్రియులు. కొత్త ప్రదేశాలు చూడడం, కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం వంటి విషయాలంటే ఎగిరి గంతేస్తారు. వీరి పర్యటనలు కేరళ రాష్ట్రానికో, స్వదేశానికో పరిమితం కాలేదు. విదేశాలూ తిరిగి రావడం వీరికి ఒక హాబీలా మారింది. ఆనందంగా బతకడమంటే అభిరుచి మేరకు జీవించడమే అన్నది వీరి అభిప్రాయం. వీరికి అత్యంత ఆసక్తి కలిగిన జీవితాభిరుచి ఒకే ఒక్కటి.. అదే పర్యటనలు చేయడం. వీరిద్దరికీ జీవనాధారం వీరు స్వయంగా నడుపుకునే టీ స్టాల్ మాత్రమే.

ఆరేళ్ల వయసులో.. తొలియాత్ర

విజయన్‌కు పర్యటనలపై ఆరేళ్ల వయసు నుంచే ఆసక్తి ఏర్పడింది. తన తండ్రితో కలిసి తమిళనాడు రాష్ట్రంలోని మధురై, పళని వంటి ఎన్నో కొత్త ప్రాంతాలకు వెళ్లి చూసొచ్చాడు. తెలిసీ తెలియని వయసులో ఈ యాత్ర అతని మనసులో చెరగని ముద్ర వేసింది. తన తండ్రితో పాటు ఆ యాత్ర జ్ఞాపకాలు అతనిలో కొత్త కలలకు దారులు తెరిచాయి. అయితే విజయన్ జీవితం పూలబాట కాదు. అతను ఎదుగుతున్నకొద్దీ ఆ కుటుంబం కష్టాలు పడుతూనే రకరకాల బాధ్యతల బరువుని విజయన్‌పై మోపింది. అయినా వీలుచిక్కినప్పుడల్లా తండ్రి తోడుగా కేరళ, తమిళనాడుల్లోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాలన్నీ తిరిగేశాడు. ఇలా ఉంటుండగా అతని తండ్రి చనిపోవడంతో పర్యటనలకు అవాంతరం ఎదురైంది. కుటుంబ బాధ్యతలు చుట్టుముట్టడంతో తన ఆకాంక్షల్ని కొంతకాలం వాయిదా వేసుకోక తప్పలేదు.

భర్తకు తోడుగా కుటుంబ పరిస్థితులు వెనక్కి లాగుతున్నాగానీ, 1988లో హిమాలయాలకు యాత్ర చేయగలిగాడు విజయన్. అయితే ఈ యాత్ర ఆయన తనకు తానుగా సిద్ధమైనది కాదు. హిమాలయాల ట్రెక్కింగ్‌కు వెళ్తున్న వారికి వంటసాయం అందించడానికే వారివెంట వెళ్లాడు విజయ్. అంతకుముందే కోచికి చెందిన మోహనతో అతనికి వివాహమైంది. మోహనకి కోచి పట్టణంలో తాను నివసించే వీధులు తప్ప ఇంకేమీ తెలియదు. విజయన్‌తో వివాహమైన తర్వాత వీరిద్దరూ కేరళలోని ముఖ్యమైన నగరాలు, పట్టణాలే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు, ముఖ్యపట్టణాలలో యాత్రలు చేశారు. ఈ పర్యటనల్లో మోహన ఎంతో ఆనందం అనుభవించిందని, ఆమె ముఖం కొత్త కాంతులతో వెలిగిపోయేదని విజయన్ ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు.

అసాధ్యం కాదు గానీ..?!

పేద కుటుంబానికి చెందిన తాము విదేశాలలో యాత్ర చేయడానికి వెళ్లగలమని మొదట్లో విజయన్ దంపతులు ఊహించనే లేదు. కలలో కూడా విదేశీయాత్ర గురించి ఆయన ఆలోచించనే లేదు. అతని భార్యదీ అదే పరిస్థితి. అయినా సరే విజయన్‌తో కలిసి ఆమె కూడా ఎన్నో విదేశీయాత్రలు చేశారు. ఎన్ని దేశాల్లో పర్యటించినా తనను బాగా ఆకట్టుకున్న దేశం స్విట్జర్లాండ్ అని ఆమె చెబుతుంటారు. ఇజ్రాయిల్‌లో ఎత్తయిన జీసెస్ విగ్రహం చూడడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందంటారామె.

పర్యాటక ప్రణాళిక ఇలా!

విజయన్ దంపతులు చేసే ఈ యాత్రలు అప్పటికప్పుడు జరుగుతున్నవి కావు. పక్కా ప్రణాళికతోనే కొనసాగిస్తుంటారు. ఎక్కడికి వెళ్లడానికి ఎంత ఖర్చవుతుంది? ఎన్ని రోజులు ఉండాలి? అక్కడి వాతావరణం ఎలాంటిది? ఇలాంటి ఆంశాలన్నీ ముందుగానే తెలుసుకుని, పక్కా ప్రణాళికతో ప్రయాణానికి సిద్ధమవుతారు.



టీస్టాల్ వల్ల రోజుకు మూడొందల రూపాయలకు తక్కువ కాకుండా సంపాదిస్తారు. ఆ సొమ్ముని ఆరు నెలలకుగానీ ఏడాదికోసారిగానీ లెక్కలు వేసుకుంటారు. తమ దగ్గరున్న సొమ్ము సరిపోదు అనుకుంటే బ్యాంకు నుంచి కొంత మొత్తాన్ని లోన్‌గా తీసుకుంటారు. తనకు ఓ మూడు నాలుగు టీ షర్టులు, ఫ్యాంట్లు, ఆమెకు మూడు పంజాబీ డ్రెస్‌లు, ఇలా పెద్ద లగేజీ ఏదీ లేకుండా బ్యాగులు సర్దుకుంటారు. ఫ్లయిట్ ఎక్కేసి తాము వెళ్లాలనుకున్న దేశానికి రివ్వున ఎగిరిపోతారు. అలా వీరు పర్యటించిన దేశాల్లో థాయ్‌లాండ్, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా, ఆస్ట్రియా, అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, సింగపూర్, మలేషియా, ఈజిప్టు, ఇజ్రాయిల్, పాలస్తీనాల్నీ కలుపుకొని, 18 దేశాల వరకూ ఉన్నాయి. పర్యటన నుంచి వచ్చాక టీ వ్యాపారంపై వచ్చే ఆదాయంతో బ్యాంకు రుణాన్ని తీర్చేస్తారు. మళ్లీ ఆదాయాన్ని కూడబెట్టడం పర్యటనలకు రెడీ కావడం ఒక నిరంతర ప్రక్రియగా వీరు ప్రణాళిక వేసుకుంటారు. తాము పర్యటించబోయే దేశాలకు సంబంధించిన సావనీర్లు, ఇతర సమాచారాన్ని జాగ్రత్తగా తమతో తీసుకువెళ్తారు.. అంతకుమించి పెద్దగా ఏమీ ఖర్చు చేయరు.

విదేశీ అతిథులుగా

టీ అమ్మకాలతో ఆదాయాన్ని కూడబెట్టుకుని విజయన్ దంపతులు చేసే విదేశీయాత్రలు చాలామంది విదేశీయులతో స్నేహాన్ని అందించాయి. ఆయా దేశాల్లో వీరిని అభిమానించి, ఆదరించేవారూ పెరిగారు. పదేళ్ల కిందట ఒకసారి 2008లో జోర్డాన్, ఈజిప్ట్ తదితర దేశాల్లో 18 రోజులు గడిపి, స్వదేశానికి తిరిగొస్తున్న సమయంలో దుబాయ్‌లో ఆగారు. అయితే చేతిలో ఉన్న సొమ్మంతా ఖర్చైపోవడంతో అక్కడి పత్రికా విలేకరి ఒకరితో మాట్లాడుతూ ఈ ఒక్క దేశంలోనే సరిగ్గా ఏమీ చూడకుండా వెళ్లిపోవాల్సి వస్తోంది అని చెప్పారట! ఆ విషయం పత్రికలో రావడంతో దుబాయ్‌లోని అరూహా టూర్స్ అనే ఒక ట్రావెల్ ఏజెన్సీ ఎంతో సానుకూలంగా స్పందించి అక్కడ విజయన్, మోహన టూర్ ఖర్చులను స్పాన్సర్ చేయడానికి ముందుకొచ్చింది. అంతేకాదు ఆ దేశంలో నాలుగు పగళ్లు, మూడు రాత్రులు గడపడానికి తగిన షెడ్యూల్‌నీ పంపించింది. అలా మళ్లీ టూర్ వెళ్లి, అక్కడ ..గ్లోబల్ విలేజీ, బుర్జ్ ఖలీఫా, మిరాకిల్ గార్డెన్, ధవ్ క్రూయిజ్, డిజర్ట్ సఫారీ తదితర ప్రాంతాలన్నీ తిరిగేసి ఇదో 'మిరాకిల్ సిటీ' అని కితాబిచ్చారు.

వయోభారమైనా?!

వయసు పెరుగుతున్న కొద్దీ విజయన్ దంపతులకు కొన్ని కష్టాలు ఎదురౌతున్నాయి. ముఖ్యంగా పర్యటనల కోసం బ్యాంకుల నుంచి లోను పొందడానికి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఒక సందర్భంలో దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్నప్పుడు చేతిలో ఉండే సొమ్మంతా ఖర్చైపోయింది. ఆ సమయంలో దక్షిణాఫ్రికాలో ఉన్న మిత్రులు కొందరు ఆశ్రయం కల్పించి, ఆహారమూ అందించారు. తిరుగు ప్రయాణానికి టిక్కెట్ల కోసం నగదు సాయమూ చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సరే పర్యటనలకు వెళ్లకుండా ఉండలేమని ఈ దంపతులు చెబుతున్నారు. పూర్తి నిరాడంబరతతో ఎలాంటి వ్యర్థమైన సామాగ్రికీ సొమ్ము దుర్వినియోగం చేయకుండా పొదుపుగా ఉండడం వీరి ప్రత్యేకత. ఈ ఏడాది అంటార్కిటికా, చైనా వెళ్లాలని వీరిద్దరూ ప్లాన్ చేసుకుంటున్నారు. భవిష్యత్తులోనూ ఈ దంపతలిద్దరి జీవనయాత్రలు సజావుగా సాగాలని మనమూ కోరుకుందాం.

- జీవన డెస్క్


ఊహించలేనివి.. చూశా!



ఇలా కొత్త కొత్త ప్రదేశాలకు, విదేశాలకు వెళ్లి అక్కడి విశేషాలు చూస్తానని పెళ్లికి ముందు ఏనాడూ ఊహించనేలేదు. కానీ విజయన్‌తో విదేశీపర్యటనలు చేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. ఈజిప్ట్‌లోని ఎడారి ప్రాంతాలు, నైలు నదిలాంటి విశేషాలు చూడడం మరిచిపోలేని అనుభూతి.

- మోహన,
విజయన్ భార్య.

ప్రయాణమే ప్రాణం



నిలకడగా ఒకేచోట ఉండిపోవడం కన్నా సాధ్యమైనంత వరకూ కొత్త ప్రాంతాలకు వెళ్లే కొత్త అనుభవాలను సొంతం చేసుకోవచ్చు. నాకు ఆరేళ్ల వయసు నుంచీ ప్రయాణాలు చేయాలన్నది ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది కానీ తగ్గడం లేదు.

- విజయన్,
చాయ్‌వాలా, ప్రపంచ పర్యాటకుడు.

చలికాలంలో కేశ సంరక్షణ!

వాతావరణంలో మార్పులు, కాలుష్యంవల్ల జుట్టు సమస్యలు ఎక్కువ అవుతాయి. శీతాకాలంలో చుండ్రు సమస్య చాలా మందిని వేధిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో జుట్టుకు కావాల్సిన పోషణను అందించాలి. లేకపోతే జుట్టు రాలిపోవడం, పొడిబారి, గరుకుగా మారి అందవిహీనంగా కనిపిస్తుంది. అయితే కొన్ని చిన్నచిన్న టిప్స్ పాటించగల్గితే ఈ సమస్యలను దూరంగా ఉంచవచ్చు.



మైనోసిస్: మైనోసిస్, కొబ్బరిపాలు కలిపి, ఆ మిశ్రమాన్ని తలకు రాసుకుంటే జుట్టు బిరుసుదనం తగ్గుతుంది. ఆ తర్వాత తలస్నానము చేస్తే మరింత మృదువుగా మారుతుంది.

వేప ఆకులు : వేపాకులను మిక్సీలో మెత్తగా రుబ్బుకుని, దానికి నిమ్మరసం కలిపి తలకు రాసుకుని, గంటసేపటి తర్వాత తలస్నానం చేస్తే చుండ్రు పోతుంది.

వెనిగర్ : 2-3 స్పూన్ల వెనిగర్‌ని బక్కెట్ నీటిలో కలిపి తలస్నానం చేస్తే చుండ్రు పోతుంది.

బాదం నూనె: ఇది చర్మానికి, తలలోని వెంట్రుకలకూ మంచిది. ఆల్మండ్ నూనె రాసుకొని, కొంత సేపు జుట్టును మృదువుగా మర్దన చేయాలి. దీనివల్ల జుట్టు కాంతివంతంగా, మృదువుగా మారుతుంది. కుదుళ్లకు పోషణా అందుతుంది.

బీట్‌రూట్ : వేపాకులు, బీట్‌రూట్ కలిపి తలకు రాసుకుంటే మాడుకు మంచిది. వేప, బీట్‌రూట్‌ను మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వడకట్టి, ఆ రసాన్ని రోజు మార్చి రోజు తలకి రాసుకుంటే చుండ్రు తగ్గిపోతుంది. ★

ఇది.. ఒడిశా.. మాంఝీ కథ



ఆమె డాక్టర్ బృంద ఐఏఎస్. ఒడిశాలోని కాంధమాల్ జిల్లాకు కలెక్టర్. కాస్తోకూస్తో జనం కోణంలో ఏదైనా మంచి చేయాలనుకునే కలెక్టర్ ఆమె. అదసలే ఒడిశా, బీమారు రాష్ట్రాల్లో ఒకటి. అంతులేని పేదరికం, జాడ తెలియని అభివృద్ధి. అనేక గ్రామాలకు రోడ్లుండవు. చదువు అసలే ఉండదు. వైద్యం అందనే అందదు. ఒకరోజు ఆమె పత్రికలు చదువుతుంటే ఓ వార్త ఆమెను ఆకర్షించింది. వివరాలు తెలుసుకొని. ఓ కలెక్టర్‌గా సిగ్గుపడింది. డ్రైవర్‌ను పిలిచి, గుమ్సాహి అనే ఊరి దగ్గరకు తీసుకువెళ్లాలని చెప్పింది. డ్రైవర్ ముందు కంగారుపడ్డాడు. అయినా ఆమె బయల్దేరింది. ఊరు చేరుకుంది. 'ఇక్కడ జలంధర్ నాయక్ అంటే ఎవరు?' అని అడిగింది.

ఒడిశా మాంఝీ!

ఆయన ఓ మట్టిమనిషి. వయసు 45. పుల్బానీ తాలూకాలోని గుమ్సాహి తన సొంతూరు. ఒంటి చేత్తో కొండను తొలిచి, తమ ఊరికి రోడ్డు వేసిన బీహారీ దశరథ్ మాంఝీ కథ తెలుసు కదా?! ఈయనేమో ఒడిశా మాంఝీ. ఎందుకో తెలుసా..? ఇతనూ అంతే. ఊరికి రోడ్డు లేదు, నిజం చెప్పాలంటే, కరెంటు కూడా లేదు. మంచినీటి సరఫరా ఆశించేదే లేదు. ఒక్కొక్కరే ఊరు విడిచి వెళ్లిపోయారు. ఆ స్థితిలో ఆ ఊరికి రోడ్డు తనే సొంతంగా వేయాలని నిర్ణయించుకున్నాడు, ఎందుకు? తన ఊరి నుంచి పుల్బనీలోని పాఠశాలకు పిల్లలు వెళ్లాలన్నా అవస్థలే. ఎవరిని ఎన్నేళ్లు వేడుకున్నా ఫలితం లేదు. లంచాలు తప్ప ఇంకేమీ తెలియని అధికారులకు ఈ సమస్య అస్సలు పట్టలేదు. ఈ దేశానికి పట్టిన దరిద్రమే ఈ నాయకులు, ఈ అధికారులు అనుకున్నాడు. దాంతో ఓ నిర్ణయానికి వచ్చాడు. అదే కనీసం తన ఊరికి రోడ్డు వేసుకోలేనా.. అని.. తన భార్య సద్దిమూట కట్టి ఇచ్చింది. ఓ పలుగూ, పార పట్టుకుని బయల్దేరాడు. రోజూ పొద్దున మొదలుపెట్టి సాయంత్రం వరకూ తనే రోడ్డు వేయడం మొదలుపెట్టాడు. రాళ్లూరప్పల్ని తొలగిస్తూ, రోడ్డు వేసుకుంటూ పోతున్నాడు. మొత్తం 15 కిలోమీటర్ల రోడ్డు తన లక్ష్యం.

ఒక్కడూ సహకరించినవాడు లేడు. అయితేనేం? ఆ గడ్డపార ఆగలేదు, ఆ గడ్డపార పట్టిన చేయీ అలసిపోలేదు. రెండేళ్లపాటు కష్టపడ్డాడు. నా జీవిత లక్ష్యం అదే అని తీర్మానించుకుని, అదే పనిలో మునిగిపోయాడు. ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు తనొక్కడే నిర్మించాడు. ఓరోజు ఓ స్థానిక పత్రిక జర్నలిస్టు ఆ కథను రాశాడు. అదీ ఆ కలెక్టర్ దగ్గరకు చేరింది. ఆమె చదివింది. ఆమె కళ్లు చెమర్చాయి. ఈ



వ్యవస్థలో భాగమైన తను కూడా సిగ్గుపడాలి కదా! అనే భావన ఆమెకు కలిగింది. అందుకే ఆ ఊరికి బయల్దేరింది. అతన్ని కలిసింది. మాట్లాడింది. ఓసారి రోడ్డు చూద్దామంటూ వెళ్లింది. అక్కడ ఒక మనిషి శ్రమను, లక్ష్యాన్ని, నిబద్ధతను, కష్టాన్ని, సంకల్పాన్ని చూసింది.



మిగతా ఆ ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి తనకు అందుబాటులో ఉన్న నిధులను అడ్జెస్ట్ చేసింది. ఆ రోడ్డు పూర్తయ్యేదాకా దగ్గరుండి మరీ నిర్మాణ పర్యవేక్షణ చేసింది. అంతేకాదు, ఇప్పుడా ఊరికి కరెంటు స్థంబాలు, లైన్లు పడుతున్నాయి. మంచినీటి సరఫరా ప్రణాళికా రూపుదిద్దుకుంది. మరో విషయం ఈ రెండేళ్లపాటు జలంధర్ నాయక్ చేసిన పనికి ఉపాధి హామీ కింద డబ్బులు ఇవ్వటానికి ఆమె అంగీకరించింది.

వావ్.. ఇవి కదా సక్సెస్ స్టోరీలు. ఇవి కదా పదిమందికీ స్ఫూర్తినిచ్చే అసలు విజయగాథలు.!! ★

మీ కోసం



ముఖంపై మచ్చలను తొలగించడానికి మెంతికూర చక్కగా పనిచేస్తుంది. అంతే కాకుండా చర్మాన్ని ప్రకాశవంతంగా చేస్తుంది.

జీవన సౌరభం

పరిస్థితులు ఎలాగైనా మారవచ్చు.. అందుకే ఎవరినీ తక్కువగా చూడకండి.. ఎవరి మనసూ గాయపరచకండి..

సెన్సెక్స్ ↓ 69
35,965

నిఫ్టీ ↓ 22
11,027

రూపాయి ↑ 03 పై॥
అమెరికా డాలరుకు రూ. 63.58



| తుది మెరుగులు..

కేంద్ర బడ్జెట్ 2018-19కు తుది మెరుగుల్లో భాగంగా బుధవారం ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీతో పాటు ఆ శాఖ సహాయ మంత్రులు ప్రతాప్ శుక్లా, రాధాక్రిష్ణన్, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. న్యూఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌లో వీరంతా భేటీ అయ్యారు. ఫిబ్రవరి 1న జైట్లీ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.



| ఫోర్డ్ నుంచి ఫ్రీస్టైల్..

ఫోర్డ్ మోటార్ బుధవారం కొత్త 'ఫ్రీస్టైల్' వాహనాన్ని ఆవిష్కరించింది. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో ఈ కారును భారత మార్కెట్లోకి అందుబాటులోకి తేనుంది. మంచి ఇంధన సామర్థ్యంతో పాటు వినూత్న టెక్నాలజీతో దీన్ని రూపొందించినట్లు ఆ కంపెనీ పేర్కొంది. దీని ధర రూ.5.50-6 లక్షల మధ్య ఉంటుందని అంచనా.

50వేల మంది పర్యాటకులు లక్ష్యం

సదరన్ ట్రావెల్స్ వెల్లడి



సదరన్ ట్రావెల్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ రామారావు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రస్తుత ఏడాదిలో 50వేల మంది పర్యాటకులను లక్ష్యంగా పెట్టుకున్నామని సదరన్ ట్రావెల్స్ డైరెక్టర్ ఎం రామారావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గతేడాది 30వేల పర్యాటకులకు సేవలందించామన్నారు. ఈ ఏడాది భారీ వృద్ధి అంచనా వేస్తున్నామని తెలిపారు. గత 47 సంవత్సరాలుగా ఈ రంగంలో విశేష సేవలు అందిస్తున్నామన్నారు. దేశంలోని అన్ని ముఖ్యమైన మెట్రోపాలిటిన్ నగరాలు, పట్టణాల్లో తాము శాఖలు కలిగి ఉన్నామన్నారు. కాగా తెలంగాణలో నాలుగు చోట్ల హాలిడే బజార్‌ను నిర్వహించనున్నామని తెలిపారు. ఫిబ్రవరి 3,4 తేదిల్లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మంలో ప్రత్యేక హాలిడే బజార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో బుక్ చేసుకున్న పర్యాటకలు క్యాష్‌బ్యాక్‌తో పాటు వెండి కాయిన్, జీఎస్‌టి వెసులుబాటును పొందే అవకాశం ఉందన్నారు.

నిరాశపర్చిన ఐసిఐసిఐ బ్యాంకు

ముంబయి : దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రంగ విత్త సంస్థ ఐసిఐసిఐ బ్యాంకు గత ఏడు త్రైమాసికాల్లో ఎప్పుడూ లేని విధంగా పేలవమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ఈ బ్యాంకు నికర లాభాలు 32 శాతం క్షీణించి రూ.1650 కోట్లకు పరిమితమయ్యాయి. 2016-17 ఇదే క్యూ3లో రూ.2,441.82 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో బ్యాంకు కేటాయింపులు 31.59 శాతం ఎగిసి రూ.3,569.56 కోట్లకు చేరాయి. కాగా నికర వడ్డీపై ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.5,705 కోట్లుగా నమోదయ్యాయి. బుధవారం బిఎస్ఇలో ఐసిఐసిఐ బ్యాంకు షేర్ 0.10 శాతం పెరిగి రూ.352.95 వద్ద ముగిసింది.

ఎన్‌టిపిసి లాభాలు 2361 కోట్లు

న్యూఢిల్లీ : విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టిపిసి 2017-18 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 2361 కోట్ల నికర లాభాలతో సరిపెట్టుకుంది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.2469 కోట్ల లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గత క్యూ3 లాభాల్లో 4 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. ఈ కాలంలో ఎన్‌టిపిసి రూ.2680 కోట్ల లాభాలు సాధించవచ్చని తొలుత థామ్సన్ రాయిటర్స్ అంచనా వేసింది. కాగా ఆ కంపెనీ రెవెన్యూ మాత్రం 5 శాతం పెరిగి రూ.20,558 కోట్లకు చేరింది. బుధవారం బిఎస్ఇలో ఎన్‌టిపిసి షేర్ 0.12 శాతం పెరిగి రూ.170.25 వద్ద ముగిసింది.

ఇక ప్రయివేటు బ్యాంకింగే..!

- విదేశీ సంస్థల వాటా పెరుగొచ్చు
- పిఎస్‌బిల్లో భారీ డిజిన్వెస్ట్‌మెంట్
- నేటి బడ్జెట్‌లో ప్రకటన..!
- ప్రభుత్వ ఆర్థిక సలహాదారు సంకేతాలు
- కార్పొరేట్ల పన్ను తగ్గొచ్చు



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

భారత ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో ప్రయివేటు వాటాను పెంచడానికి మోడీ ప్రభుత్వం ఈ దఫా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అదే విధంగా అమెరికా తరహాలో కార్పొరేట్ల పన్ను రేటును తగ్గించేలా ఇక్కడ కూడా నిర్ణయం తీసుకోవచ్చు. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణ్యన్ వ్యాఖ్యలను పరిశీలిస్తే తాజా బడ్జెట్‌లో ఈ నిర్ణయాలు ఉండొచ్చు. ఆయన మింట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే తరహా అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఫిబ్రవరి ఒక్కటిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు ఇచ్చే కార్పొరేట్ పన్ను రాయితీలను తాము విస్మరించలేమని సుబ్రమణ్యన్ అన్నారు. ఈ మధ్య కాలంలోనే అగ్రరాజ్యం కార్పొరేట్ పన్నును 35శాతం నుంచి 21శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించకుండా తమని ఎవరూ ఆపలేరని సుబ్రమణ్యన్ అన్నారు. బడ్జెట్ రూపకల్పనలో కీలక వ్యక్తిగా ఉన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారంటే ఇప్పుడు కాకపోయిన అతి త్వరలోనే కార్పొరేట్లకు మేలు చేసే ఇలాంటి నిర్ణయాలు జరుగొచ్చని సంకేతాలు ఇచ్చారు. ఇది వరకే భారత్‌లో కార్పొరేట్ల పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే దీనిలో కొత్తగా మార్పులు చేయాల్సి ఉందన్నారు.



అర్వింద్

చూస్తూ ఉండలేం..

ఇతర దేశాల్లో ముఖ్యంగా యూరోపియన్ ఆర్థిక వ్యవస్థల్లో జరుగుతున్న మార్పులు, సంస్కరణలను ఊరికే చూస్తూ ఉండలేమన్నారు. ప్రపంచ ఆలోచనల మార్పులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాల్సిందేనని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రైయివేటు భాగస్వామ్యం కచ్చితంగా అవసరమని సుబ్రమణ్యన్ నొక్కి చెప్పారు. అయితే భారత బ్యాంకుల్లో దేశీయ, విదేశీ భాగస్వామ్య వాటాలపై ఆలోచించాల్సి ఉందన్నారు. సుబ్రమణ్యన్ వ్యాఖ్యలను పరిశీలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా వాటాల విక్రయం జరుగొచ్చని స్పష్టమవుతుంది. పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలన్నారు. ఇంధన ధరల పెరుగుదలను భారత్ సమర్థంగా ఎదుర్కొంటే 7 నుంచి 7.5 శాతం వద్ధిని సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. స్టాక్ మార్కెట్ల షేర్ల ధరల్లో పెరుగుదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ విషయంలో రెగ్యూలేటరీ పర్యవేక్షణ మరింత పెరగాలన్నారు.

సర్వాత్రా ఆసక్తి

భారత బ్యాంకింగ్ రంగం తాజా బడ్జెట్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. ముఖ్యంగా మూలధనం కొరతతో తల్లడిల్లుతున్న బ్యాంకులు సర్కార్ నుంచి పెట్టుబడులను ఆశిస్తున్నాయి. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా భారీగా పెరుగుతున్న మొండి బాకీలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అదే విధంగా 2016 నవంబర్‌లో మోడీ సర్కార్ రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేయడంతో ఈ ప్రతికూల ప్రభావం నుంచి ఇప్పటికీ బ్యాంకులు బయటపడలేకపోయాయి. ఈ దెబ్బతో తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ఎఫ్ఆర్‌డిఐ బిల్లుతో తమ పొదుపు డబ్బులు పోతాయేమోనని ప్రజలు తమ వద్ద ఉన్న నగదును బ్యాంకుల్లో డిపాజిటు చేయడం తగ్గించారు. ఈ పరిణామాలు భారత బ్యాంకింగ్ రంగాన్ని తీవ్ర సంక్షోభానికి గురి చేశాయి. దీంతో ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోబోతుంది అనే దానిపై బ్యాంకింగ్ వర్గాలు సర్వాత్రా ఆసక్తితో ఉన్నాయి. తిరిగి బ్యాంకుల్లో నగదు నిండుకోవడం, మూలధనం పెరగడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి చర్యలను ప్రకటిస్తుందోనని ఆ వర్గాలు చాలా ఆశల్లో ఉన్నారు.

రేపటి నుంచి కంట్రీ ప్లానర్స్ కాంగ్రెస్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఫిబ్రవరి 2-4 తేదిల్లో 66వ టౌన్ అండ్ కంట్రీ ప్లానర్స్ కాంగ్రెస్‌ను నిర్వహించనున్నట్లు ఇన్‌స్ట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా (ఐటిపిఐ) వెల్లడించింది. హైదరాబాద్‌లో నిర్వహించినున్న ఈ సమావేశానికి దేశంలోని నైపుణ్యవంతులైన పట్టణ, నగర ప్లానర్స్ హాజరు కానున్నారని ఆ సంస్థ అధ్యక్షులు డిఎస్ మేష్రామ్ తెలిపారు. ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరీకరణ వల్ల ఎదురవుతున్న పర్యావరణ సవాళ్లు, అభివృద్ధి ప్రణాళికలు, అర్బన్ ఫ్లడింగ్ వంటి అంశాలపై చర్చించనున్నామన్నారు.

మార్కెట్లకు రెండో రోజూ నష్టాలు

ముంబయి : కేంద్ర బడ్జెట్‌కు ముందు వరుసగా రెండో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల పాలయ్యాయి. బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 68.71 పాయింట్లు కోల్పోయి 35,965కు పడిపోయింది. నిఫ్టీ 21.95 పాయింట్లు తగ్గి 11,028 వద్ద ముగిసింది. లిస్టెడ్ కంపెనీల్లో ఏడాది దాటిన పెట్టుబడులను దీర్ఘకాల పెట్టుబడిగా పరిగణించి, ఈ పెట్టుబడులపై వచ్చే లాభాలపై పన్ను విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందన్న వార్తలు మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. ఈ నేపథ్యంలోనే నిఫ్టీలో రంగాల వారిగా ఎఫ్ఎంసిజి 1.40 శాతం, ఫార్మా 1.87 శాతం, లోహ 1.22 శాతం, ఐటి 0.93 శాతం, ఆటో 0.14 శాతం, పిఎస్‌యు బ్యాంకింగ్ 0.56 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్‌లో ఇన్ఫోసిస్ 1.63 శాతం, సన్ ఫార్మా 2.02 శాతం, హెచ్‌యుఎల్ 2.13 శాతం, కోల్ ఇండియా 2.32 శాతం, టాటా స్టీల్ 3.49 శాతం, డాక్టర్ రెడ్డీస్ 3.75 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి.

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

మానవునిలో దంత సూత్రం



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

జీర్ణవ్యవస్థ

జీర్ణవ్యవస్థలో సంక్లిష్టమైన ఆహార పదార్థాలు సరళ పదార్థాలుగా మార్పు చెందుతాయి.

జీవులు తీసుకునే ఆహారాన్ని బట్టి పదార్థాలను ఈ కింది రకాలుగా వర్గీకరించారు.

1. శాకాహారులు (హెర్బివోర్స్) : కేవలం మొక్కలను మాత్రమే ఆహారంగా తీసుకునేవి.

ఉదా : కుందేలు, ఆవు, జింక, జిరాఫీ, ఏనుగు, కంగారు మొదలైనవి.

2. మాంసాహారులు (కార్నివోర్స్) : కేవలం మాంసాన్ని మాత్రమే తీసుకునేవి.

ఉదా : పులి, సింహం, కుక్క, నక్క, పిల్లి.

3. సర్వభక్షులు (అమ్నివోర్స్) : అనగా శాకాహారాన్ని, మాంసాహారాన్ని తీసుకునేవి.

ఉదా : మానవుడు, కాకి, ఎలుక, బొద్దింక మొదలైనవి..

4. స్వజాతి భక్షులు (కానిబల్స్) : అనగా తమ జాతి జీవులను తామే తినేవి.

ఉదా : చేపలు, పాములు, తేళ్లు

5. స్పాంగీవోరస్ జీవులు : అనగా రక్తాన్ని తాగేవి.

ఉదా : జలగ, దోమ, నల్లి, పేను

✧ మానవుని జీర్ణవ్యవస్థను మూడు భాగాలుగా విభజించవచ్చు.

1. ఆహారనాళం, 2. జీర్ణగ్రంథులు, 3. జీర్ణక్రియ

1. ఆహారనాళం : దీని పొడవు తొమ్మిది మీటర్లు.

✧ ఇది నోటితో ప్రారంభమై పాయువుతో అంతమవుతుంది.

✧ ఆహారనాళంలో వరుసగా ఈ కింది భాగాలు ఉంటాయి.

నోరు - గ్రసని - అన్నవాహిక - జీర్ణాశయము - చిన్నపేగు - పెద్ద పేగు - పురీషనాళం - పాయువు

నోరు (మౌత్)

ఇది ఆహారనాళం యొక్క మొదటిభాగం.

✧ ఇది ఆస్యకుహరం/ ముఖకుహరం లోనికి తెరుచుకుని ఉంటుంది.

✧ ఆస్యకుహరంలో రెండు దవడలు, వాటిపై దంతాలు, వాటి మధ్యన కండరయుతమైన నాలుక ఉంటుంది.

దంతాలు : దంతాల అధ్యయనాన్ని ఓడెంటాలజీ అంటారు.

✧ దంతాలకు చేసే చికిత్స - రూట్‌కెనాల్ థెరపీ.

✧ మానవునిలో దంతాలు రెండుసార్లు ఏర్పడతాయి. దీనినే 'ద్వివర దంత విన్యాసం' అంటారు.

✧ చేపలలో దంతాలు అనేకసార్లు ఏర్పడతాయి. దీనినే 'బహువర దంత విన్యాసం' అంటారు.

✧ దంతాలు పొట్టిగా, వెడల్పుగా అమరి ఉంటాయి. దీనినే 'బూనోడాంట్ దంత విన్యాసం' అంటారు.

✧ దంతాలు దవడ ఎముకపై గుంతలలో అమరి ఉంటాయి. దీనినే 'థీకోడాంట్ దంత విన్యాసం' అంటారు.

✧ మానవునిలో పాల దంతాల సంఖ్య −20

✧ ఈ దంతాలు ఏడు నుంచి తొమ్మిది సంవత్సరాల మయస్సులో రాలిపోయి శాశ్వత దంతాలు ఏర్పడతాయి. వీటి సంఖ్య 32. మొదట 28, తరువాత 17 నుంచి 25 సంవత్సరాల మధ్యలో నాలుగు దంతాలు ఏర్పడతాయి. వీటినే జ్ఞానదంతాలు (విస్‌డమ్ టీత్) అంటారు.

✧ ఇవి ఎప్పటికీ రాలిపోవు.

మానవునిలోని దంతాలు నాలుగు రకాలు

1. కుంతకాలు/ కత్తెర పళ్లు/ కొరికే దంతాలు - ఇవి ఎనిమిది (ఇన్‌సిజార్స్)
2. రధనికలు/ చీల్చే దంతాలు/ కోరపళ్లు - ఇవి నాలుగు (క్యానైన్స్)
3. అగ్రచర్వణకాలు/ నమిలే దంతాలు/ దవడ దంతాలు - ఇవి ఎనిమిది (ప్రీ-మోలార్స్)
4. చర్వణకాలు/ విసిరే దంతాలు/ దవడ దంతాలు - ఇవి 12 (మోలార్స్)

✧ చర్వణకాలు జీవితంలో ఒకసారి మాత్రమే ఏర్పడతాయి.

✧ అగ్రచర్వణకాలు, చర్వణకాలను కలిపి దవడ దంతాలు అంటారు.

✧ విషసర్పాలలో పై దవడలోని రదనికలు విషపుకోరలుగా మారతాయి. వీటినే **సిరికా దంతాలు** అంటారు.

✧ ఏనుగులో పై దవడలోని **కుంతకాలు** కోరలుగా మారతాయి.

✧ మాంసాహార జంతువులలో రదనికలు బాగా అభివృద్ధి చెంది ఉంటాయి.

✧ శాఖాహార జంతువుల (ఆవు)లో పై దవడలోని రధనికలు లోపించి కేవలం గట్టి చిగురు మాత్రమే ఉంటుంది. దీనినే **'డయాస్టెమ్మా'** అంటారు.

✧ ఆవులు గడ్డిని కత్తిరించేటప్పుడు కింది దంతాలను పై దవడకు వత్తి పడతాయి.

✧ మానవునిలో దంత సూత్రాన్ని లెక్కించేటప్పుడు దవడ యొక్క సగభాగాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దీనినే దంత సూత్రం అంటారు.

✧ **మానవునిలో దంతసూత్రం**

2/2, 2/2, 2/2, 3/3 X 2 = 32

✧ **పిల్లల్లో పాలదంత సూత్రం**

2/2, 1/1, 0/0, 2/2

దంత నిర్మాణం

మానవుని దంతంలో మూడు భాగాలు ఉంటాయి.

1. కిరీటం - పైకి కనిపించే దంతభాగం.
2. మెడ - చిగురు వద్ద ఉండే దంతభాగం.
3. మూలం - దవడ లోపల ఉండే దంతభాగం.

✧ దంతాలలో డెంటాయిన్ అనే పదార్థం ఉంటుంది.

✧ దంతాలపైన తెల్లగా మెరుస్తూ ఉండే పింగాణీ పొర ఉంటుంది. దీనిని ఎనామిల్ అంటారు. ఇది 93 శాతం ఉంటుంది. దీనివల్ల దంతాలు గట్టిగా ఉంటాయి.

✧ ఎనామిల్ మానవ శరీరంలో అన్నింటికంటే గట్టి పదార్థం.

✧ దంతం లోపల మృదుకుహరం ఉంటుంది. దీనిలో రక్తనాళాలు, నాడీ తంతువులు ఉంటాయి.

✧ దంతాలకు పయోరియా (చీము ఏర్పడటం) జింజివైటిస్ (చిగురువాయడం) వంటి వ్యాధులు కలుగుతాయి.

✧ ఫ్లోరోసిస్ అంటే దంతాలు పసుపురంగులోకి మారడం.

నోట్ : అత్యధికంగా దంతాలు గల జీవులు - అపోసం (50), గుర్రం (44)

2. గ్రసని : ఇది ఆహారం, వాయు మార్గాల కూడలి. దీనిలో ఎలాంటి జీర్ణక్రియ జరగదు.

3. అన్నవాహిక : ఇది గొట్టం వంటి భాగం.

✧ ఇది గ్రసనితో ప్రారంభమై, జీర్ణాశయంలోకి తెరుచుకుంటుంది.

✧ దీనిలో ఆహారం తక్కువ సమయం నిల్వ ఉంటుంది. ఎలాంటి జీర్ణక్రియ జరగదు.

✧ దీని లోపల జిగురు (శ్లేషం)ను స్రవించే శ్లేష్మపొర ఉంటుంది. ఇది ఆహారం జీర్ణాశయంలోనికి పడేటట్లు చేస్తుంది.

✧ దీనిలో ఉండే కండరాలు పెరిస్టాలిటిక్ చలనాలను చూపుతాయి.

4. జీర్ణాశయం : ఇది సంచి వంటి కండర నిర్మిత భాగం.

✧ ఇది విభాజక పటలానికి కుడివైపున ఉంటుంది.

✧ దీనిలో కండరాలు ఏటవాలుగా ముడతలు పడి, వర్తుల ఆకారంలో ఉంటాయి. ఈ ముడతలనే 'రూగే' అంటారు.

✧ జీర్ణాశయంలో ఆహారం రెండు నుంచి నాలుగు గంటలపాటు నిల్వ ఉంటుంది.

✧ దీనిలో జఠరగ్రంథులు ఉంటాయి.

✧ జీర్ణాశయం చిన్న పేగులోనికి కలిసిన దగ్గర జఠర నిర్గమ సంవరిణి అనే కవాటం వంటి నిర్మాణం ఉంటుంది.

✧ జీర్ణాశయానికి సంబంధించిన చికిత్సను బారియాట్రిక్ సర్జరీ అంటారు.

5. చిన్నపేగు :దీని పొడవు −7 మీటర్లు, దీని వెడల్పు - 3 సెంటీమీటర్లు.

✧ ఇది మానవ శరీరంలో అతి పొడవైనది.

✧ దీనిలో రెండు భాగాలుంటాయి.

ఎ. ఆంత్రమూలం : ఇది చిన్నపేగు మొదటి/ ముందు భాగం.

✧ ఇది యు ఆకారంలో ఉంటుంది.

✧ దీనిలో ఎలాంటి ముడతలూ ఉండవు.

బి. శేషాంత్రికం : ఇది చిన్నపేగు చివరి భాగం.

✧ ఇది అనేక ముడతలు పడి ఉంటుంది. ఈ ముడతలనే 'ఆంత్రచూషకాలు/ విల్లై' అంటారు. వీటిద్వారా జీర్ణమైన ఆహారం శోషించబడుతుంది.


✧ చిన్నపేగు గోడలలో ఆంత్ర గ్రంథులు/ బ్రూనర్ గ్రంథులు ఉంటాయి.

✧ చిన్నపేగు, పెద్దపేగుతో కలిసే దగ్గర 'కొరియానిక్ సంవరిణి' అనే రంధ్రం ఉంటుంది. చిన్నపేగు మధ్యభాగాన్ని 'జుజునం' అంటారు.

6. పెద్ద పేగు : దీని పొడవు −1.5 మీటర్లు

✧ దీనిలో రెండు భాగాలుంటాయి.

ఎ. అంధనాళం : ఇది పెద్దపేగు యొక్క మొదటిభాగం.



✧ దీని కింద వేలు వంటి ఉండుకం (అపెండిక్స్) ఉంటుంది. ఇది మానవునిలో ఎలాంటి పాత్ర వహించదు. కనుక ఈ ఉండుకాన్ని అవశేష అవయవం అంటారు. కానీ గుర్రం, కుందేలు వంటి శాఖాహార జంతువులలో ఉండుకం గడ్డిలోని సెల్యులోజ్‌ను జీర్ణం చేస్తుంది.

✧ మానవునిలో మొత్తం అవశేష అవయవాల సంఖ్య −180

✧ మానవుడు జంతువులలోకెల్లా అతి ఎక్కువ అవశేష అవయవాలుగల జంతువు.

బి. పురీషనాళం : దీని ముందు భాగంలో కొలాన్ ఉంటుంది.

✧ కొలాన్ చివర పురీషనాళం ఉంటుంది.

✧ పురీషనాళంలో పైకి వెళ్లే భాగం, కిందికి వెళ్లే భాగం ఉంటుంది.

✧ పురీషనాళం పాయువు ద్వారా వెలుపలికి తెరుచుకుంటుంది.

నోట్ : జీర్ణాశయంలోని ముడతలు - రూగే

✧ **చిన్న పేగులోని ముడతలు - విల్లై/చూషకాలు అంటారు.**

2. జీర్ణగ్రంథులు

ఎ. లాలాజల గ్రంథులు : ఇవి నోటి లోపల ఉంటాయి. సాధారణంగా క్షీరదాలలో నాలుగు జతలు ఉంటాయి.

✧ కానీ మానవునిలో ఇవి మూడు జతలు ఉంటాయి. 'నిమ్ననేత్ర కోఠర గ్రంథులు' ఉండవు.

1. పెరోటిడ్ గ్రంథులు : ఇవి చెవి కింది భాగంలో ఉంటాయి. కనుక వీటిని 'కర్ణమూల గ్రంథులు' అని/ అధివోష్ఠ గ్రంథులు అనీ అంటారు.

✧ ఇవి సైనెన్స్ నాళం ద్వారా నోటిలోకి తెరుచుకుంటాయి.

2. అధోజిహ్వక గ్రంథులు : ఇవి నాలుక కింది భాగంలో ఉంటాయి.

✧ ఇవి బోర్థోలిక్ నాళం ద్వారా నోటిలోకి తెరుచుకుంటాయి.

3. అధోజంబికా గ్రంథులు : ఇవి కింద దవడ లోపలిభాగంలో ఉంటాయి.

✧ ఇవి వార్డన్స్ నాళం ద్వారా నోటిలోకి తెరుచుకుంటాయి.

✧ లాలాజల గ్రంథుల నుంచి ఒక రోజుకు లీటరు లాలాజలం ఉత్పత్తి అవుతుంది. దీని పిహెచ్ విలువ 6.42 నుంచి 6.9 వరకూ ఉంటుంది. కావున ఇది తటస్థ ఆమ్లస్థితిలో ఉంటుంది.

✧ లాలాజలంలో మ్యూసిన్ అనే జిగట పదార్థం, టయలిన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి.

✧ నోటిలో లాలాజలంలో లైసోజోమ్ అనే ఎంజైమ్ కూడా ఉంటుంది. ఇది సూక్ష్మజీవి నాశినిగా పనిచేసి, నోటి దుర్వాసన లేకుండా చేస్తుంది.

✧ లాలాజల గ్రంథులకు వైరస్ వల్ల గవద బిళ్లలు (మమ్స్) అనే వ్యాధి కలుగుతుంది.

బి. జఠర గ్రంథులు : ఇవి జీర్ణాశయంలో ఉంటాయి.

✧ ఇవి జఠర రసాన్ని స్రవిస్తాయి.

✧ జఠర రసం యొక్క పిహెచ్ విలువ - 2 నుంచి 2.5 వరకూ ఉంటుంది.

✧ ఇది ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటుంది.

- జఠర రసంలో ఉండేవి

1. మ్యూసిన్ - ఇది జిగట పదార్థం.
2. హెచ్‌సిఎల్ - ఇది ఆహారంలోని సూక్ష్మజీవులను చంపుతుంది.
3. పెప్సిన్ - ఇది ఒక ఎంజైమ్.

నోట్ : చిన్న పిల్లల జీర్ణాశయంలో రెనిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది పాలలోని కెసిన్ అనే ప్రోటీన్‌ను పారాకెసిన్‌గా మార్చుతుంది.

సి. కాలేయగ్రంథి : దీని అధ్యయనాన్ని హెపటాలజీ అంటారు.

✧ ఇది మానవ శరీరంలోని అతిపెద్ద గ్రంథి.

✧ ఇది సుమారు 1.5 కిలోల బరువు ఉండి, ముదురు గోధుమ రంగును కలిగి ఉంటుంది. నాలుగు లంబికలు (గదులు)గా విభజించి ఉంటుంది.

✧ ఇది మూడు వారాలలో 80 శాతం పునరుత్పత్తి అవుతుంది.

✧ ఆల్కహాల్ ఎక్కువగా తీసుకుంటే 'లివర్ సిర్రోసిస్' వ్యాధి కలుగుతుంది.

✧ వైరస్‌లు కాలేయంపై దాడి చేయడంవల్ల 'పైత్యరసం' రక్తంలోకి విడుదలవుతుంది. దీంతో 'జాండిస్' (కామెర్లు) వస్తుంది.

✧ కాలేయంలో ఎ, డి, కె, బి12 విటమిన్స్ ఉంటాయి.

✧ ఈ గ్రంథిలో ఉండే కణాలను కాలేయ కణాలు/ హెపటాట్స్ అంటారు. ఈ కాలేయ కణాలు పైత్యరసాన్ని స్రవిస్తాయి.

✧ కాలేయం ఉత్పత్తి చేసే ప్రోటీన్ - 'హెపరీన్' ఇది రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టకుండా చేస్తుంది.

పైత్యరసం : ఇది బంగారు, పసుపు మిశ్రమ రంగులో ఉంటుంది. కానీ క్షీరదంలో ఆకుపచ్చ రంగులో ఉంటుంది.

✧ ఒక రోజుకు మానవునిలో 500 మిల్లీలీటర్ల నుంచి 600 మి.లీ పైత్యరసం స్రవిస్తుంది.

✧ పైత్యరసం పిహెచ్ విలువ - 6.8

✧ పైత్యరసం, బేరి పండు ఆకారంలో ఉన్న పిత్తాశయంలో నిల్వ ఉంటుంది.

✧ పైత్యరసంలో ఎంజైమ్‌లు ఉండవు. కానీ లవణాలు, వర్ణకాలు ఉంటాయి. పైత్యరసంలో నీటి శాతం - 86 శాతం.

గుంతకల్లుకు రైల్వే జోన్ హోదా కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్
గుంతకల్లుకు రైల్వే జోన్ హోదా కల్పించాలని సిపిఎం అనంతపురం జిల్లా (ఉత్తర ప్రాంత) కమిటీ కార్యదర్శి వి.రాంభూపాల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో అనంతపురం జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు, జిల్లాలో సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని కోరారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, కరువు ప్రాంతమైన జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు రైల్వే జోన్ ప్రకటించడానికి అన్ని అనుకూలతలు ఉన్నాయని అన్నారు.



అరెస్టులు ఐద్వా విజయనగరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించాలని కలెక్టరేట్ వద్ద దీక్షలు చేపట్టిన నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

మరుగుదొడ్లు నిర్మించాలని మహిళల ధర్నా
ఐద్వా నాయకుల అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్
వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరుతూ ఐద్వా విజయనగరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రామకృష్ణానగర్, కామాక్షినగర్, ఎల్.బి.జి.నగర్ కాలనీ వాసులు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. అయినా అధికారులు స్పందించకపోవడంతో కలెక్టరేట్ పోర్టికో వద్ద మహిళలు ధర్నా చేశారు. దీంతో జాయింట్ కలెక్టర్-2 నాగేశ్వరరావు స్పందించి ఐద్వా నాయకులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లతో గురువారం చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చర్చల అనంతరం బయటకొచ్చిన ఐద్వా నాయకులు పి.రమణమ్మ, ఎం.జగదాంబ, జి.పుణ్యవతి, వి.లక్ష్మి, కె.కుమారిని పోలీసులు అరెస్టు చేసి విజయనగరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు. అంతకుముందు ధర్నానుద్దేశించి ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ.. మరుగుదొడ్లు నిర్మించాలని అనేక సంవత్సరాలుగా అధికారులను, పాలకులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మరుగుదొడ్లు నిర్మించాలని మున్సిపల్ అధికారులకు కలెక్టర్ నేరుగా లేఖ ద్వారా ఆదేశించినా అమలుకు నోచుకోలేదని తెలిపారు. మరుగుదొడ్లను నిర్మించకుండా స్వచ్ఛాంధ్రప్రదేశ్ ఎలా సాధ్యమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

36వ రోజుకు మత్స్యకారుల దీక్షలు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ
మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 36వ రోజుకు చేరాయి. మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి శ్రీకాకుళం కన్వీనర్ దూడ సుధాకర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో 50 రోజులుగా ఇదే డిమాండ్ సాధనకు దీక్షలు సాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఎస్‌టిల్లో చేర్చాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో మత్స్యకారుల రాజకీయ నిర్ణయం తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఉండే వీలుంటుందని హెచ్చరించారు.

పెట్రో ధరల పెంపును నిరసిస్తూ సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-ఆకివీడు
బిజెపి అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్‌సహా నిత్యావసరాల ధరలు పెరిగిపోవడాన్ని నిరసిస్తూ పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో జాతీయ రహదారిపై ఆటోకు తాళ్లు కట్టి లాగి వినూత్నరీతిలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఆకివీడు మండల కార్యదర్శి కె.తవిడినాయుడు, పట్టణ కార్యదర్శి గేదెల అప్పారావు మాట్లాడుతూ ప్రతిరోజూ ధరలు ఎలా పెరుగుతాయో తెలియని ఆందోళనకర పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.సత్యవతి, షేక్ బాజీ, సందక సూరిబాబు, దొడ్డి పద్మ, ఎ.సుబ్బారావు, దానయ్య, జె.ప్రతాప్, జార్జి, సత్యనారాయణ, వాసు, యోహాన్, రాఫీ తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల దీక్షలు

ప్రజాశక్తి- యంత్రాంగం
తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫోరం ఆఫ్ బిఎస్ఎన్ఎల్ యూనియన్స్, అసోసియేషన్స్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు చేపట్టిన సత్యాగ్రహ దీక్షలు రెండో రోజూ కొనసాగాయి. బుధవారం నాటి దీక్షల్లో వక్తలు మాట్లాడుతూ 2017 జనవరి ఒకటో తేదీ నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో మూడో వేతన సవరణ అమలు చేయాలని, రెండో వేతన సవరణ నాటి అపరిష్కృత సమస్యలు పరిష్క రించాలని, ప్రత్యేక సబ్సిడీ సెల్‌టవర్ కంపెనీ ఏర్పాటును ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించనం దున సత్యాగ్రహ దీక్షలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. కృష్ణా జిల్లా విజయవాడలోని బిఎస్ఎన్ఎల్ రాష్ట్ర చీఫ్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద కొనసాగిన దీక్షా శిబిరంలో సిఐటియు పశ్చిమ కృష్ణా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ పాల్గొని సంఘీభావం తెలిపారు. గుంటూరులోని టెలికం జిల్లా మేనేజర్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. కర్నూలులో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల దీక్షలకు సిఐటియు, ఎఐటియుసి తదితర ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఒంగోలులోని దూర సంచార భవన్ వద్ద రెండో రోజు దీక్షా శిబిరాన్ని అసోసియేషన్ నాయకులు ఎం.మల్లికార్జున రావు ప్రారంభించి మాట్లాడారు. శ్రీకాకుళంలోని సంచార నిగమ్ భవన్ వద్ద సత్యాగ్రహ దీక్షలు కొనసాగాయి. కడపలోని బిఎస్ఎన్ఎల్ జిఎం కార్యాలయం ఎదుట చేపట్టిన సత్యాగ్రహ దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. చిత్తూరు జిల్లా తిరుపతిలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల దీక్షలు కొనసాగాయి.

అది రాజ్యాంగ విరుద్ధం



బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరైన గిరిజనులు (ఇన్‌సెట్లో) బహిరంగ సభలో మాట్లాడుతున్న డాక్టర్ మిడియం బాబూరావు

- బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు
- నిర్ణయం వెనక్కు తీసుకునేదాకా ఐక్య పోరాటాలు
- ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి
రాజకీయ లబ్ధి కోసం బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (గిరిజన సంఘం) అధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న తీర్మానాన్ని ప్రభుత్వం వెనక్కుతీసుకొనే వరకు గిరిజనులంతా ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగుదేశం, బిజెపి, వైసిపిలు బోయలను మోసగించి, గిరిజనులకు నష్టం తెచ్చిపెడుతున్నాయని విమర్శించారు. పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం గిరిజన సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన గిరిజన గర్జన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజనుల జీవితాలను అంధకారం చేసే ఈ విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చితే 34 తెగలకు చెందిన 27 లక్షల మంది గిరిజనులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల సౌకర్యం తగ్గిపోతుందన్నారు. ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు బోయలకు ఎటువంటి అర్హతలేదని 2010లో గిరిజన సాంస్కృతిక, పరిశోధన మండలి నివేదిక స్పష్టంగా పేర్కొందని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం ప్రణాళిక సంఘం రద్దు చేయడంతో ఎస్‌టి, ఎస్‌సి సబ్‌ప్లాన్ ప్రకారం గిరిజనులకు రావాల్సిన నిధులు రాకుండా పోయాయని చెప్పారు. ఆరో షెడ్యూల్ ప్రకారం త్రిపురలోని వామపక్ష ప్రభుత్వం మినహా మిగిలిన ఏ రాష్ట్రాలూ గిరిజనుల ప్రయోజనాలను కాపాడ్డంలేదన్నారు. ఈ సభలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, డిఎల్ఓ వ్యవస్థాపక అధ్యక్షులు చెండా ఏలియా తదితర నాయకులు పాల్గొన్నారు.

వేలాది మందితో భారీ ర్యాలీ

బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, కొండకుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన బహిరంగ సభకు ముందు వేలాది మంది గిరిజనులతో భారీ ర్యాలీ నిర్వహించారు. తలారిసింగి వద్ద ప్రారంభమైన ర్యాలీ ఐటిడిఎ, సినిమాహాల్ సెంటర్, లోసులపుట్టువీధి, గుడివాడ రోడ్, మార్కెట్ సెంటర్ మీదుగా జూనియర్ కళాశాల గౌండ్‌కు చేరుకుంది. థింసా నృత్యాలు, ప్రజానాట్యమండలి, గిరిజన కళాకారుల డప్పుల వాయిద్యాలతో ర్యాలీ కొనసాగింది.



బెయిల్‌పై సిపిఎం నాయకుల విడుదల
నేతలకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - నెల్లూరు
సిపిఎం, సిఐటియు నాయకులకు బెయిల్ మంజూరైంది. దాంతో వారు జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. నగరంలో పారిశుధ్య కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు జరిగాయి. ఈ నేపథ్యంలో జనవరిలో సమ్మె జరిగింది. ఆ సమయంలో సిఐటియు నాయకులు పారిశుధ్య కార్మికులు చేపట్టిన ప్రతి పోరాటంలోనూ అండగా నిలిచారు. ఈ కారణంగా పురపాలకశాఖా మంత్రి నారాయణ నాయకులపై కేసులు పెట్టించారు. వారిని జనవరి 22న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి అరస్టయిన వారికి బుధవారం బెయిల్ మంజూరైంది. విడుదలైన వారిలో మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, నాగేశ్వరరావు, ఎస్‌కె జిలానీ ఉన్నారు. తొలుత జైలు నుంచి విఆర్‌సి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నగర ఎంఎల్ఎ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ యాదవ్ వారిని పరామర్శించారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు, సిపిఎం నాయకులు పి.చంద్రమౌళి, జొన్నలగడ్డ వెంకమరాజు, జి.శ్రీనివాసులు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పందుల పెంపకందార్ల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ
ప్రతి నెలా మామూళ్లు ఇవ్వకుంటే పందులను చంపేస్తామంటూ జివిఎంసి సిబ్బంది బెదిరింపులను నిరసిస్తూ పందుల పెంపకందారులు బుధవారం విశాఖలో ర్యాలీ నిర్వహించారు. పిగ్ షూటర్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వాసు, డ్రైవర్ సాయిలపై జివిఎంసి కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని పెందుర్తి పందుల పెంపకందారులు డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొంతసేపు ధర్నా చేశారు. అనంతరం అక్కడి నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తి పందుల పెంపకందారుల సంఘం నాయకులు వాడపల్లి రాము, పెంద్రి రమణ, వాడపల్లి దసరా, డుంబారి రామారావు మాట్లాడుతూ.. తమ నుంచి వారానికి రూ.4 వేలు, లేదంటే నెలకు రూ.10 వేలు చొప్పున లంచాల రూపంలో ఇన్‌స్పెక్టర్ వాసు, షూటర్ నాయుడు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం చాలదని ఇప్పుడు పెంచాలని డిమాండ్ చేస్తున్నారని, లేకుంటే పందులు లేకుండా నాశనం చేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

అవినీతి తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలని
ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కడపఅర్బన్
నగరంలోని భూ అక్రమార్కులకు సహకరిస్తున్న కడప తహశీల్దారు అవినీతిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మూడవ డివిజన్‌లో ఈ నెల 12న 825 మందికి తహశీల్దారు ఎలాంటి విచారణ లేకుండా పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇందులో 50 శాతం బోగస్ ఉన్నాయని చెప్పారు. ఈ విషయంపై ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించామని తెలిపారు. విచారణ సక్రమంగా నిర్వహించలేదన్నారు. 340, 341, 342 సర్వే నెంబరులో 6 ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని ఫిర్యాదు కూడా చేశామని పేర్కొన్నారు. బోగస్ పట్టాలపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం దారుణమని చెప్పారు. విఆర్‌ఒతో కలిసి అవినీతికి పాల్పడుతున్న తహశీల్దారును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దాడులను నిరసిస్తూ క్రైస్తవుల ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి-ఏలూరు అర్బన్
క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పాతబస్టాండ్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ బుధవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడే ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐసిసి జాతీయ గౌరవాధ్యక్షులు బిషప్‌జాన్ ఎస్‌డి.రాజు మాట్లాడుతూ.. క్రైస్తవుల మీద దాడులు, చర్చిల కూల్చివేతలు ఇటీవల దేశంలో ఎక్కువయ్యాయన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నుంచి 28 వరకూ ఉన్న చట్టాన్ని ఉల్లంఘిస్తూ కొంతమంది మతోన్మాదులు బడాబాబుల అండతో క్రైస్తవులపై దాడులు చేస్తున్నారన్నారు. బైబిళ్లను తగులబెట్టిన వారిని కఠినంగా శిక్షించి క్రైస్తవులకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీమలో హైకోర్టు కోసం దీక్షలు

ప్రజాశక్తి- యంత్రాంగం
హైకోర్టు రాయలసీమలో ఏర్పాటు చేయడం రాయలసీమ ప్రజల హక్కు అని, ఇది భిక్ష కాదని సిపిఎం రాయలసీమ అభివృద్ధి సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు పేర్కొన్నారు. బుధవారం రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హైకోర్టు సాధన సమితి, జిల్లా న్యాయవాదుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కోర్టు ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపి ఓబులు మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జ్వాలాపురం శ్రీకాంత్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దకుంట వెంకటేశ్వర్ రెడ్డి, నగర అధ్యక్షులు కెఎం. శ్రీనివాసులు, రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజులు మద్దతు తెలిపారు. కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటు చేయాలని న్యాయవాదులు చేపట్టిన దీక్షలు 11వ రోజుకు చేరాయి.

కాల్వగట్లపై ఇళ్లు తొలగించొద్దని సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)



మధురానగర్‌లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

విజయవాడలోని మధురానగర్ మధ్యకట్టకు ఇరువైపులా ఉన్న ఇళ్లను తొలగించేందుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వేకు రానున్న సందర్భంగా ఇళ్లను తొలగించవద్దని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర చేపట్టారు. బుడమేరు వంతెన వద్ద నుంచి దేవీనగర్ బ్రిడ్జి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సార్లు సర్వే చేసి జాబితా ప్రకటించిందని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఎమ్యూనరేషన్ పేరుతో 50 బృందాలు సర్వేకు వస్తున్నట్లు ప్రకటించి ప్రజల్ని బెదిరించడం సరికాదన్నారు. సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యుడు తన భార్య పేరుతో, కుటుంబ సభ్యులకు భూములు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే అయి ఉండి స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన భూముల్ని కాజేయటం దారుణమన్నారు. పేదలకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు వారి భూముల్ని లాక్కోని సొంత వారికి కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి డి.విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

2న దేశవ్యాప్త నిరసనలకు సిద్ధం కండి
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేష్

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 2న దేశవ్యాప్త నిరసనలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిఎస్‌టి, నోట్ల రద్దు వల్ల ఆర్థిక వృద్ధిలో దూసుకుపోతున్నామని కేంద్ర ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతుందన్నారు. 12 శాతం ఉన్న పన్నులను జిఎస్‌టి రూపంలో 28 శాతం పెంచి పేదల కష్టాన్ని దోచుకుంటూ పోతే వృద్ధి పెరగదా? అని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం ఈ నాలుగేళ్ల కాలంలో కార్మిక వర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. సామాన్యులు తమ కష్టాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ రూపంలో దాచుకుంటే ఆ సొమ్మును పెద్దలకు మదుపుచేసే ప్రక్రియ ఈ నెల 1న ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో జరగనుందని తెలిపారు. దీని వల్ల బ్యాంకులు దివాళా తీసే పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకుల ప్రైవేటీకరణకు కేంద్రం వేసిన ఎత్తుగడ అని పేర్కొన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికో మనిషి.. ఊరికో బండి.. ఎర్రజెండా చేతబట్టి..

- 10న చలో భీమవరానికి తరలిరండి
- సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలకు ఆహ్వానం పలికిన ఉమామహేశ్వరరావు





ఏలూరులో చలో భీమవరం పోస్టరును ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు, భీమవరం టౌన్
సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఫిబ్రవరి 10న 'చలో భీమవరం' కార్యక్రమానికి వేలాదిగా తరలొచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల 'చలో భీమవరం' పోస్టరును ఏలూరు, భీమవరంలలో బుధవారం వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 'ఇంటికొక మనిషి- ఊరికొక బండి- ఎర్రజెండా చేతబట్టి- భీమవరం రండి' అంటూ జిల్లావ్యాప్తంగా కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. మహాసభల సందర్భంగా నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభలకు అంతా హాజరు కావాలన్నారు. బహి రంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్, బివి రాఘవులు తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా (అప్‌ల్యాండ్) కమిటీ కార్యదర్శి చింతకాయల బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, భీమవరంలో జరిగిన కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా (డెల్టా) కమిటీ కార్యదర్శి బి.బలరాం, నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, జెఎన్‌వి.గోపాలన్, డి.కళ్యాణి, పూర్వ శాసనసభ్యులు దిగుపాటి రాజగోపాల్ పాల్గొన్నారు.

లాఠీచార్జి

కౌలురైతులు, మహిళలపై లాఠీ-ఛార్జి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



యంత్రానికి అడ్డుగా బైఠాయించిన మహిళలు

పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో ఆర్‌అండ్‌ఆర్ భూముల్లో పొగాకు సాగు చేసిన కౌలురైతులు, మహిళలపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. రూ.20 లక్షల వరకూ పెట్టుబడి పెట్టామని, పంట ధ్వంసం చేస్తే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు పురుగు మందుల డబ్బాలు, పెట్రోలు క్యాన్లతో బుధ వారం ఆందోళన చేశారు. వారిని పోలీసులు ఈడ్చిపడేసి, చావబాదారు. దర్భగూడెంలో సుమారు 1300 ఎకరాలను ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ కింద కేటాయించింది. వేలేరుపాడు మండలం కొయిదాకు చెందిన కొందరు గిరిజనులకు భూమికి భూమి కింద పట్టాలు పంపిణీ చేశారు. వారు ఈ భూములను దర్భగూడేనికి చెందిన కొందరికి కౌలుకు ఇచ్చారు. దర్భగూడేనికి చెందిన అలవాల రాము, మరికొందరు రైతులు పొగాకు, మొక్కజొన్న సాగు చేశారు. రాము సుమారు 20 ఎకరాల్లో పొగాకు, మొక్కజొన్న వేశారు. మరో నెల రోజుల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉంది. ఆ భూముల్లో నిర్వాసితులకు మోడల్ కాలనీ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించారు. భూమికి భూమిగా పట్టాలిచ్చారుగా అని నిర్వాసితులు, కౌలురైతులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పని అధికారులు పంటను ధ్వంసం చేయడానికి సిద్ధమవడంతో రెండు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పంటను ధ్వంసం చేయడానికి ఉపయోగించే యంత్రాన్ని అధికారులు దర్భ గూడెం పంచాయతీ వద్దకు బుధవారం తీసుకొచ్చారు. కౌలు రైతులు అక్కడికి చేరుకుని యంత్రం టైర్లలోని గాలి తీసేశారు. పోలీసులు మళ్లీ గాలి పట్టించి ఆ యంత్రాన్ని తీసుకొచ్చారు. కౌలు రైతులు ప్రతిఘటించి యంత్రం వైరును తొలగించడం తో, నిలిచి పోయింది. ఆ సమయంలో మహిళలను, కౌలు రైతులను పోలీసులు పక్కకు నెట్టేశారు. పంటను ధ్వంసం చేస్తే చావే శరణ్యమంటూ పురుగు మందు డబ్బాలు, పెట్రోల్ డబ్బాలు కౌలురైతులు చేతబూనారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో యంత్రానికి మరమ్మతులు చేశారు. ఒక్కసారిగా కౌలురైతులు, మహిళలపై పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ చెదరగొట్టే ప్రయత్నం చేశారు. కొందరు కౌలురైతులు పెట్రోలు పోసుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు ఆపారు. పొలాల మధ్యలో ఉన్న పంట బోదెలో యంత్రం దిగబడి కదలకపోవడంతో పంట ధ్వంసం పనులు నిలిచిపోయాయి.

ఏడాదిలోగా
పేరూరు, బిటిపికి కృష్ణాజలాలు : మంత్రి దేవినేని

ప్రజాశక్తి- రాయదుర్గం
ఈ ఏడాది డిసెంబరు నెలాఖరులోగా అనంతపురం జిల్లాలోని పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టు (బిటిపి)లకు కృష్ణాజలాలు తీసుకొస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ, అనంతపురం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అనంతపురం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం రాయదుర్గం సమీపంలోని పైతోట నర్సరీ వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని చెప్పారు. జలవనరుల శాఖను నిర్వహించే తనను అనంతపురం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వేశారని, గృహ నిర్మాణాలు చూసే శాఖను కాలవ శ్రీనివాసులకు, పింఛన్లు మంజూరు చేసే శాఖను పరిటాల సునీతకు ఇవ్వడంతో పాటు శాసనమండలి, శాసనసభ చీఫ్‌విప్‌లు పయ్యావుల కేశవ్, పల్లెరఘునాథరెడ్డిలకు ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రూ.1,700 కోట్ల వ్యయంతో పేరూరు, బిటిపి ఎత్తిపోతుల పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలలో టెండర్లు పిలిచి వెంటనే పనులు ప్రారంభిస్తామని, డిసెంబరు నెలాఖరుకు రెండు రిజర్వాయర్లకు కృష్ణాజలాలు అందిస్తామన్నారు. ఉరవకొండలో ప్రయోగాత్మకంగా 50వేల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. పట్టిసీమ ద్వారా రాయలసీమకు 150 టిఎంసిల నీరు తీసుకొచ్చామంటే జగన్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే ఉండరన్నారు. పోలవరం ప్రాజెక్టు కాంక్రీట్ పనులు ఫిబ్రవరి 10 నుంచి చేపట్టి గేట్లు ఏర్పాట్లు చేస్తామన్నారు.

కస్‌గంజ్ హంతకుడు అరెస్టు

కస్‌గంజ్(ఉత్తరప్రదేశ్) : ఉత్తరప్రదేశ్‌లోని కస్‌గంజ్‌లో రిపబ్లిక్ డే రోజున జరిగిన హత్యకు కారకుడైన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. కస్‌గంజ్‌లోరిపబ్లిక్ డే రోజున మత ఘర్షణలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా చందన్ గుప్తా(22)పై కాల్పులు జరిపిన సలీమ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సలీమ్ తన ఇంటి పై కప్పు నుంచి గాని, బాల్కాని నుంచిగాని కాల్పులు జరిపినట్లు కొంతమంది సాక్షులు చేసిన వ్యాఖ్యలను బట్టి తెలుస్తున్నదని సీనియర్ పోలీసు అధికారి, శాంతి భద్రతల ఇన్‌ఛార్జ్ ఆనంద్ కుమార్ తెలిపారు. గడిచిన రెండు రోజులుగా కొన్ని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.



ప్రచారం

త్రిపురలో రానున్న శాసనసభ ఎన్నికలకు గాను అన్ని రాజకీయ పార్టీలు జోరుగా ప్రచారం ప్రారంభించాయి. బుధవారం అగర్తాలలో జరిగిన సిపిఎం బహిరంగ సభలో మాట్లాడుతున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి

హామీలు నెరవేర్చడంలో మోడీ విఫలమయ్యారు : సీతారాం ఏచూరి

అగర్తలా: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజలకు భారీగా ఇచ్చిన హామీలలో ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి విమర్శించారు. త్రిపురలోని జొలైబారిలో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో బుధవారం ఆయన మాట్లాడారు. మోడీ కార్పొరేట్ అనుకూలుడని పేర్కొన్నారు. నల్ల ధనాన్ని వెలికి తీస్తానని, బడాబాబులు విదేశాలలోదాచుకున్న పెద్ద మొత్తాలను వెనక్కి తెస్తానని మోడీ చేసిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మోడీ తన విధానాలతో ధనవంతులైన కార్పొరేటర్లను మరింత ధనవంతులుగాను, పేదవారిని మరింత పేదవాళ్ళగాను మార్చారని విమర్శించారు. దేశంలో దళితుల అణచివేత, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు తదితర సమస్యలను ఆయన లేవనెత్తారు. మత ప్రాతిపదికన ప్రజలను విభజించేందుకు మోడి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని తొలగించకపోతే, దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని ఏచూరి హెచ్చరించారు.

అలహాబాద్ హైకోర్టు సీనియర్ జడ్జి శుక్లాపై అభిశంసనకు సుప్రీం సిఫారసు

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు సీనియర్ జడ్జి నారాయణ శుక్లాపై అభిశంసనకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా సిఫారసు చేశారు. ఈ తీర్మానంతో కూడిన లేఖను ఆయన ప్రధాన మంత్రికి పంపారు. లక్నోలో బ్లాక్‌లిస్టులోని ప్రయివేటు మెడికల్ కాలేజీలకు సంబంధించిన కేసుల్లో శుక్లా నేతృత్వంలోని డివిజన్ బెంచ్ క్లీన్ చిట్ ఇవ్వడం చివరికి ఈ పరిణామానికి దారితీసింది. శుక్లా దోషి అని తేలితే పార్లమెంటులో ప్రవేశపెట్టే అభిశంసన తీర్మానంపై ఓటింగ్ జరిపి, మెజారిటీ ఓటుతో ఆయన్ని జడ్జి పదవి నుంచి తొలగిస్తారు. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి భోస్లే, శుక్లాను ఈడాది జనవరి 23న న్యాయ విధుల నుంచి తప్పించారు. జస్టిస్ శుక్లా అలహాబాద్ హైకోర్టు జడ్జిగా 2005లో బాధ్యతలు స్వీకరించారు. జులై 2020లో పదవీ విరమణ చేయవలసి ఉంది.

షారూక్ ఖాన్ అలిబాగ్ ఫామ్ హౌస్ జప్తు

ముంబయి : బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌కు అలిబాగ్‌లో ఉన్న ఫామ్ హౌస్ బినామిదని ఆదాయం పన్ను శాఖ అధికారులు పేర్కొన్నారు. ఆ ఫామ్ హౌస్‌ను తాత్కాలికంగా జప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలిబాగ్‌లో షారూక్‌ఖాన్‌కు 19,500 చదరపు అడుగుల్లో రూ.146.7 మిలియన్ విలువ గల ఆస్తులున్నాయి. దీనిపై స్పందించేందుకు షారూక్ ఖాన్‌కు ఐటి శాఖ 90 రోజులు గడువిచ్చింది. షారూక్ ఖాన్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేస్తున్నట్లు దరఖాస్తు చేసుకున్నారని, కాని అందులో వ్యక్తిగత ఉపయోగానికి నివాసయోగ్యమైన నిర్మాణాన్ని చేపట్టారని ఐటి శాఖ ఆరోపించింది. బినామి ఆస్తుల బదిలీ చట్టం (పిబిపిటి) కింద డిసెంబరులో జప్తుకు సంబంధించిన నోటీసులను షారూక్ ఖాన్‌కు జారీ చేసినట్లు ఐటి శాఖ వర్గాలు తెలిపాయి. పిబిపిటిలోని సెక్షన్ 24 కింద జప్తు చేసినట్లు ఐటి శాఖ వెల్లడించింది. షారూక్ ఖాన్ బంధువులు డైరెక్టర్లుగా ఉన్న డేజావు ఫామ్స్‌ను వ్యవసాయం కోసం తీసుకున్నారు కాని, వారు దానిని అందుకు ఉపయోగించలేదు. అందులో ఖరీదైన ఫామ్ హౌస్‌ను నిర్మించారని హెలిపాడ్, స్విమ్మింగ్‌పూల్ వంటి వసతులతో ఖరీదైన భవనం నిర్మాణమైందని ఐటి శాఖ పేర్కొంది.

బైక్‌ను ఢీ కొట్టిన బిజెపి ఎంఎల్ఎ కారు

ఇద్దరు మృతి

దేవాస్ : బిజెపి ఎంఎల్ఎ కారు సోమవారం రాత్రి సమయంలో ఒక బైక్‌ను ఢీ కొట్టిన ఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రామ్ సింగ్(45), సంతోష్ మల్వియా(35) అనే ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కారు డ్రైవర్ ఇంద్రజిత్ సింగ్(50)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భోపాల్‌లోని సెహోర్ జిల్లాకు సమీప గ్రామం నుండి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై సోన్‌ఖాచ్‌కు వెళుతున్నారు. ఆసమయంలో బిజెపి ఎంఎల్ఎ శైలేంద్ర జైన్‌కు చెందిన ఎంపి 15 ఎంఎఫ్ - 0001తో రిజిష్టరైన కారు బైక్‌ను వెనుకనుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

ఆర్మీ కాల్పుల్లో మరో పౌరుడు మృతి

జమ్ము : షోపైన్ జిల్లాలో శనివారం ఆర్మీ జరిపిన కాల్పుల్లో మరో పౌరుడు బుధవారం ఉదయం మృతి చెందినట్లు అధికారులు పేర్కొన్నారు. షోపైన్‌లో ఆర్మీపై రాళ్లు రువ్విన ఆందోళనకారులపై జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా, శనివారం కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన 19 ఏళ్ల రాయీస్‌ను షేర్-ఇ- కాశ్మీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎస్‌కెఐఎంఎస్) ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతున్న రాయిస్ అహ్మద్ బుధవారం ఉదయం మృతి చెందడంతో, మృతుల సంఖ్య ముగ్గురికి చేరింది. శనివారం గర్వాల్ యూనిట్ 10కి చెందిన అధికారిక కాన్వాయ్ మీద రాళ్లు రువ్వడంతో ఆర్మీ జరిపిన కాల్పుల్లో జావైద్ అహ్మద్, సువైల్ అహ్మద్‌లు మృతి చెందారు.

ఇకపై ప్రతిభ ఆధారిత వీసాలే

మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఇమ్మిగ్రేషన్ సంస్కరణలపై చట్టాన్ని తీసుకురావడానికి, అమెరికన్ల ప్రయోజనాల కోసం కలిసికట్టుగా కృషి చేద్దామంటూ డెమోక్రాట్లను కోరారు. ఇమ్మిగ్రేషన్ సంస్కరణలకు మూల స్తంభాలైనటువంటి నాలుగు అంశాలను ట్రంప్ ప్రతిపాదించారు. వాటిలో మొదటిది - పిల్లలుగా వున్నపుడు సరైన పత్రాలు లేకుండా తల్లిదండ్రులతో కలిసి అమెరికాలో అడుగుపెట్టిన డ్రీమర్లు (స్వాప్నికులు)గా పిలువబడే దాదాపు 18లక్షలమంది యువతకు అమెరికా పౌరసత్వాన్ని ఇవ్వడం, రెండవది - సరిహద్దు భద్రత కోసం అక్రమ చొరబాట్లను నిలువరించేందుకు దక్షిణ భాగంలో మెక్సికోకు సరిహద్దు గోడ నిర్మించడం, మూడవది - వీసా లాటరీ కార్యక్రమానికి స్వస్తి చెప్పడం, ఇక నాల్గవది గొలుసుకుట్టు వలస విధానాలను అంతమొందించడం. రంగు, జాతి నేపథ్యంతో సంబంధం లేకుండా మన ప్రజలందరినీ కాపాడుకునేందుకు, రిపబ్లికన్లు, డెమోక్రాట్లతో కలిసి పనిచేయాలని తాను కోరుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు. దాదాపు 80నిముషాల సేపు ఆయన ప్రసంగించారు. ప్రతిభ ఆధారిత ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను అమలుచేయడం వల్ల నైపుణ్యం వున్నవారెవరైనా లబ్ది పొందుతారని అన్నారు. ఇక్కడ పనిచేయాలని కోరుకునే, మన సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడాలని భావించే, మన దేశాన్ని ప్రేమించే, గౌరవించే వారికి ఎప్పటికీ ఇక్కడ స్థానం వుంటుందని ట్రంప్ పేర్కొన్నారు. తాను ప్రతిపాదించిన ఈ విధానం చాలా న్యాయమైనదని, ఎవరూ కూడా తామనుకున్న ప్రతీదాన్నీ పొందలేరని, కానీ ప్రస్తుతం దేశానికి చాలా కీలకమైన సంస్కరణలు అవసరమని వ్యాఖ్యానించారు. తాను ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, ఎవరికైతే నైతికంగా మంచి వ్యక్తిత్వాన్ని, లక్షణాలను కలిగివుంటారో వారికి అమెరికా పూర్తి స్థాయి పౌరులుగా మారే అవకాశం వుందని స్పష్టం చేశారు. ప్రతిభా పాటవాలు, నైపుణ్యాలు ఏమీ చూడకుండా కేవలం లాటరీ ద్వారా వీసా ఇచ్చే పద్ధతికి వెంటనే స్వస్తి చెప్పాల్సి వుందని అన్నారు. ఒక వ్యక్తి ఇక్కడ పనిచేస్తుంటే వారి భార్య లేదా భర్త వారి మైనర్ పిల్లలు ఇక్కడకు వచ్చేసే పద్ధతిని తక్షణమే నిలుపుచేయాలనుకుంటున్నామని చెప్పారు. కీలకమైన ఈ సంస్కరణ ప్రస్తుతం అమెరికాకు చాలా అవసరమని అన్నారు. కేవలం మన ఆర్థిక వ్యవస్థకే కాదు, మన భద్రతకు, మన భవితవ్యానికి కూడా మంచిదని అన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయాలు పక్కనపెట్టి దేశానికి అవసరమైన ఈ సంస్కరణలు, విధానాల అమలుకు చేతులు కలపాలని ట్రంప్ కోరారు.

అమెరికాను గొప్ప అమెరికాను చేస్తామంటూ ఆదేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నినాదమిచ్చారు. అమెరికన్ కాంగ్రెస్ సమావేశంలో ప్రసంగిస్తూ ఎన్నికల నాటి నుండి 24 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించినప్పటికీ, వాటిలో ఇంతవరకు ఇరవై లక్షల మంది ప్రజలకు మాత్రమే ఉపాధి కల్పించామని పేర్కొన్నారు. చాలా రోజుల తర్వాత వేతనాల పెంపు చూస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగుల శాతం 45కు తగ్గిందని పేర్కొన్నారు. తన చాంబర్‌లోని ప్రతినిధుల బాధ్యత అమెరికన్లను కలలను సాకారం చేయడమేనని పేర్కొన్నారు. అమెరికా ప్రజలకు వాగ్దానం చేసినట్లుగా పన్నుల సవరణను చేశామని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే అమెరికన్లకు పన్ను తగ్గింపునిచ్చినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా వివాహిత జంట మొదటి సంపాదన 24,000 డాలర్లకు పన్నును మినహాయింపునిచ్చారు. వ్యాపారం పన్ను రేటును 35 శాతం నుండి 21వరకు తగ్గించామని, ఈ భారీ పన్ను తగ్గింపు వల్ల మధ్యతరగతి, చిన్న తరహా వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. పన్నుల మినహాయింపు ఆమోదించినప్పటి నుండి దాదాపు 30 లక్షల మంది కార్మికులు పన్ను మినహాంయిపు నుండి ఉపశమనం పొందారని పేర్కొన్నారు.

నేడే బడ్జెట్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మరో కొద్ది గంటల్లో దేశంలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలతో కూడిన వార్షిక బడ్జెట్ పార్లమెంట్ ముందుకు రానున్నది. నేడు (గురువారం) లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 2019 ఎన్నికలకు ముందు కేంద్రం ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్ ఇదే కావడంతో వివిధ రాష్ట్రాలు, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఆశతో ఎదురుచూస్తోన్నాయి. అయితే ఎన్నికలే లక్ష్యంగా బడ్జెట్ ఉంటుందని కేంద్ర ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అందుకనుగుణంగానే కేటాయింపులు ఉంటాయని తెలుస్తోంది. బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్‌కు ఇదే పూర్తి స్థాయి బడ్జెట్ కావడంతో ఎన్నికలను బేరీజు వేసుకొని కేటాయింపులు చేస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

దేశంలో నరేంద్ర మోడీకి, బిజెపికి పట్టణ ప్రాంతాలు మద్దతుగా ఉన్నాయని, బలహీనంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలపై ఈసారి దృష్టి పెట్టాలని బిజెపి యోచిస్తోంది. అందులో భాగంగానే బడ్జెట్‌లో కూడా గ్రామీణ ప్రాంతానికే ఎక్కువ ప్రాధాన్యత ఉండవచ్చు. నోట్ల రద్దు, జిఎస్టీతో బాగా చితికిపోయిన మధ్యతరగతికి కొంత మేర ఉపసమనం కలిగించేందుకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆదాయపు పన్ను చట్టంలో కూడా కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. సెక్షన్ 80-సి ఆదాయ పరిమితిని పెంచాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల సమాచారం. సంవత్సర ఆదాయం 2.5 లక్షల నుంచి 5లక్షలకు పెంచే అవకాశాలున్నాయి. వ్యవసాయం, హౌసింగ్, మౌలిక వసతులు, ఆటో మొబైల్, విద్యా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలకు ప్రాధన్యత ఇచ్చే అవకాశముంది. ఆయా రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెరుగుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో 65 కొత్త జవహర్ నవోదయ విద్యాలయాలు(జెఎన్‌వి) ప్రకటించనున్నారు. 2017-18లో రూ.2,700 కోట్లు జెఎన్‌విలకు కేటాయించారని, మొత్తం విద్యా రంగానికి రూ.46,356.25 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి(ఎంహెచ్‌ఆర్‌డి) ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. బడ్జెట్ పూర్తిగా ఎన్నికల మీదే ఆధారపడి పైపై మెరుగులు తప్ప, చెప్పుకోదగ్గ నిర్మాణాత్మక మార్పులుండకపోవచ్చు.

ఏడాదికి కోటి ఉద్యోగాలు లేనట్లే

దేశంలో యువతకు ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2014లో ఎన్నికల ప్రచారం ప్రకటించారు. బిజెపి, మోడీ లెక్క ప్రకారం ఇప్పటికే బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం గద్దెనెక్కి నాలుగేళ్లు గడుస్తోంది. అంటే ఏడాదికి కోటి ఉద్యోగాలంటే, నాలుగేళ్లకు నాలుగు కోట్లు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు(అక్టోబర్) 8,23,000 ఉద్యోగాలు ఇచ్చి నట్లు నేషనల్ లేబర్ బ్యూరో(కేంద్ర ప్రభుత్వ సంస్థ) స్పష్టం చేసింది. అదే విషయాన్ని గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీల ఎంపిలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రులు పేర్కొన్నారు. గత మూడు బడ్జెట్‌ల్లో కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఎటువంటి నిర్ణయాలు వెల్లడించ లేదు. దీంతో దేశంలో యువత మోడీ సర్కార్‌పై ఆగ్రహంతో ఉన్నారు. అయితే ఇటీవలి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఒక సమావేశంలో ఉద్యోగాలపై శుభవార్త వింటారని వ్యాఖ్య చేశారు. ఈ బడ్జెట్‌లో జాతీయ ఉపాధి విధానం(ఎన్ఈపి) ప్రకటించే అవకాశముంది. ప్రపంచ బ్యాంక్ లెక్కల ప్రకారమే దేశంలో 15 నుంచి 29 మధ్య వయస్సు గల యువత 30.8శాతం ఉంది. వీరిలో అత్యదిక శాతం నిరుద్యోగులుగానే ఉన్నారు.

పసి పిల్లలపై తండ్రి కర్కశత్వం

సీలింగ్‌కు వేలాడతీసి కొట్టాడు

జైపూర్ : రాజస్థాన్‌లోని రాజసమంద్‌లో చైన్‌సింగ్ తన కొడుకును చితక బాది తాడుకు కట్టి వేసి వేలాడదీశాడు. తన మూడేళ్ళ కూతురును కూడా కొడుతున్న వీడియో పోలీసులకు చిక్కింది. ఈ వీడియోలో చిన్నారులిద్దరూ కేకలు పెడుతూ, ఏడుస్తున్నారు. కుమారుడి చేతులను తాడుతో కట్టి సీలింగ్ నుండి వేలాడదీశాడు. చిన్నారి పారిపోవడానికి ప్రయత్నించగా నేలపై తన్నుతూ ఉన్న వీడియోను తన తమ్ముడితో కలిసి తీశాడు. ఈ వీడియో సోషల్ మీడియోలో వైరల్ అవ్వడంతో దీనిని చూసిన పిల్లల సంరక్షణ అధికారులు పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. పిల్లలను కాపాడకుండా వీడియో తీసినందుకు తమ్ముడుతో సహా చైన్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తన ప్యాంట్‌ను మురికి చేశారని పిల్లలను కొట్టినట్లు విచారణలో తెలిపాడు. వారిపై హత్యాయత్నం కేసు, జువెనెల్ జస్టిస్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బిజెపిని వదిలొస్తేనే మాతో పొత్తు

శివసేనకు కాంగ్రెస్ ఆఫర్

ఔరంగాబాద్ : శివసేన బిజెపికి వ్యతిరేకంగా ఉండే పార్టీలతో చేతులు కలపాలంటే ముందుగా ఎన్‌డిఎతో సంబంధాలు వదులుకోవాలని, అధికారాన్ని కూడా వదులుకోవాలని కాంగ్రెస్ నేత పృధ్వీరాజ్ చవాన్ సూచించారు. శివసేన కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలంటే కేంద్రంలోని పార్టీ పెద్దలతో సమావేశమవ్వాలని అన్నారు. నేడు శివసేన, బిజెపితో కలిసి పదవిలో ఉన్నందువల్ల కేంద్రంలో హైకమాండ్‌తో మాట్లాడాలని ఆయన పేర్కొన్నారు. కాగా, ఛవాన్ ఔరంగాబాద్‌లో పార్టీ సమావేశంలో హాజరవడానికి వచ్చినట్లు తెలిపారు. ఎన్‌డిఎతో ఉమ్మడిగా ఉండే శివసేన ఇటీవల 2019లో జరిగే మహారాష్ట్ర ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వంలో శివసేన కూడా భాగస్వామ్యంగా ఉంది. చవాన్ మాట్లా డుతూ అన్ని పార్టీలు బిజెపిని ఓడించడానికి కాంగ్రెస్‌తో కలవాలని అన్నారు. సంఘ్ వ్యతిరేక పార్టీలన్నీ ఏకమవ్వాలని అప్పుడే బిజెపిని ఓడించడం కుదురుతుందని పేర్కొన్నారు.

ఐఎన్‌ఎస్ కరంజ్ ప్రారంభం

ముంబయి : స్కార్‌పెన్ తరహా మూడో జలాంతర్గామి కరంజ్‌ను భారత నావికాదళం బుధవారం ప్రారంభించింది. దేశ నావికాదళాధికారి అడ్మిరల్ సునీలా లాంబా భార్య రీనా లాంబా బుధవారం ఉదయం కరంజ్ జలాంతర్గామిని ప్రారంభించారు. ముంబయిలోని మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ వద్ద కరంజ్ జలాంతర్గామి ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ జలాంతర్గామి భారత్‌లోనే రూపొందింది. అత్యద్భుతమైన అనేక నిగూఢ లక్షణాలను ఈ జలాంతర్గామి కలిగి ఉంది. ఖచ్చితమైన దాడులతో శత్రువులను నిర్వీర్యం చేయగల సామర్థ్యం దీనికి ఉంది. కరంజ్ దేశీయంగా రూపొందించిన మూడో జలాంతర్గామి. ఐఎన్‌ఎస్ కల్వరి, ఐఎన్‌ఎస్ ఖందారి తరువాత మూడో స్థానంలో కరంజ్ జలాంతర్గామి చేరింది. ఈ సందర్భంగా అడ్మిరల్ లాంబా మాట్లాడుతూ ఈ జలాంతర్గామి ద్వారా నావికాదళం శిక్షణ, ధృవీకరణలు ఇచ్చే విషయంలో స్వీయ సమృద్ధిని సాధించిందని చెప్పారు.



కరంజ్ జలాంతర్గామి-కొన్ని వాస్తవాలు

అధునాతనమైన ధ్వని సంబంధిత నిశ్శబ్ద సాంకేతికత, తక్కువ రేడియేషన్ గల శబ్ద స్థాయిలు, హైడ్రో డైనమిక్ చరశీలత గల అనుకూల ఆకారం, శత్రువులు ఉపయోగించిన ఖచ్చితమైన మార్గనిర్దేశ ఆయుధాలను నిర్వీర్యం చేయగల సామర్థ్యం కరంజ్ జలాంతర్గామి కలిగి ఉంది. నౌకా విధ్వంసక ఆయుధాలను, గొట్టాలతో రూపొందిన నౌక నిరోధక క్షిపణులతో ఐఎన్‌ఎస్ కరెంజ్ ఉపరితలంపైన, నీటి లోపల దాడి చేయగలదు. అనేక ఇతర జలాంతర్గాములకు సరిపోలని విధంగా అభేద్యమైన లక్షణాలు ఇందులో ఉన్నాయి. ఉపరితల నిరోధక, యుద్ధ జలాంతర్గామి నిరోధక, గూఢచార సేకరణ, ప్రాంత పర్యవేక్షణకు సంబంధించిన విస్తృత మిషన్లను స్కార్పియన్ తరహా జలాంతర్గాములు తీసుకెళ్ళగలవు. ఫ్రాన్సుకుచెందిన నావికాదళరక్షణ కంపెని డిఎస్ఎన్ఎస్ ఐఎన్ఎస్ కరంజ్ నమూనాను రూపొందించింది. మరో మూడు స్కార్పియన్ తరహా జలంతర్గాములు నిర్మాణంలో ఉన్నాయి. స్కార్పియన్ జలాంతర్గాములకు సంబంధిం చిన ఒప్పందంపై 2015 అక్టోబరులో సంతకాలు జరిగాయి. తొలి స్కార్పియన్ తరహా జలాంతర్గామి ఐఎన్ఎస్ కల్వరి గత ఏడాది భారత నావికాదళానికి చేరింది. రెండో జలాంతర్గామి ఖందేరిని 2017 జనవరిలో ప్రారంభించారు.

ప్రపంచ శరణార్థుల రాజధానిగా మార్చొద్దు

రోహింగ్యాల కేసులో సుప్రీంకు కేంద్రం విజ్ఞప్తి

న్యూఢిల్లీ : దేశాన్ని ప్రపంచ శరణార్థుల రాజధానిగా మార్చొద్దని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీం కోర్టును కోరింది. రోహింగ్యా ముస్లింలను తిరిగి వారి స్వదేశమైన మయన్మార్‌కు తిప్పి పంపే విషయంలో జోక్యం చేసుకోవద్దని కోరింది. రోహింగ్యాలను వారి స్వదేశానికి పంపే విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిరోధించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం కోర్టు బుధవారం విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వం తరుపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) తుషార్ మెహతా విచారణకు హాజరయ్యారు. ఈ కేసు విచారణ జరుపుతున్న ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని న్యాయమూర్తులు ఎఎం కన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి ఆయన తన వాదనలు వినిపించారు. ప్రస్తుతం దేశంలో 40 వేల మంది దాకా రోహింగ్యాలు ఉన్నారు. మయన్మార్‌లో మిగిలిన శరణార్థులు సరిహద్దు దాటి దేశంలోకి ప్రవేశించేదుకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరుతూ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తాజాగా దరఖాస్తు చేసుకున్నారు.

విచారణ ప్రారంభంలో తుషార్ మెహతా మాట్లాడుతూ "ప్రపంచ శరణార్థులకు భారత దేశం రాజధాని కావాలని మేం కోరుకోవడం లేదు. ఇతర దేశాల నుంచి శరణార్థులను అనుమతిస్తే వారు వరదలా వస్తారు. ప్రభుత్వం దౌత్య చర్చల్లో ఉంది. అది ఒక నిర్ణయం తీసుకుంటుంది. ఇప్పటికి అనిశ్చితి ఏమీ లేదు. అయినా ఇది కోర్టు జోక్యం చేసుకోవలసిన విషయం కాదు. ఏదైనా కనికరం చూపే అంశం కాదు" అని ధర్మాసనానికి విన్నవించుకున్నారు.

యుపిలో అవినీతి పెరిగింది

- యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై మంత్రి రాజ్‌బార్ ఆరోపణలు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో అవినీతి పెరిగిపోయిందని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలోని మంత్రే స్వయంగా ఆరోపించారు. ఆయన చేసిన ఆరోపణలను యుపిలోని బిజెపి ప్రభుత్వాన్ని కలవరపాటుకు గురిచేశాయి. ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంలో రాజ్‌బార్ మంత్రిగా పనిచేస్తున్నారు. ఆయన సుహల్దేవ్ భారతీయ సమాజ్‌పార్టీ(ఎస్‌బిఎస్‌పి) సభ్యులు. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఎస్‌బిఎస్‌పి మిత్ర పార్టీగా ఉంది. రాష్ట్రంలోని గత ఎస్‌పి, బిఎస్‌పి ప్రభుత్వాలతో పోల్చుకుంటే బిజెపి పాలనలో అవినీతి పెచ్చు మీరిందని రాజ్‌బార్‌ఆరోపించారు. ఇది తన ప్రభుత్వం కాదని, తాను ఈ ప్రభుత్వంలో ఒక భాగమేనని, బిజెపితో పొత్తు పెట్టుకున్నామని రాజ్‌బర్ మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో పెరిగిపోయిన అవినీతిపై తాను ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. 2019 ఎన్నికల్లో బిజెపితో కలిసి మీ పార్టీ పోటీ చేస్తుందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ అది బిజెపిపై ఆధారపడి ఉందన్నారు. తమతో పొత్తు పెట్టుకోవాలా?వద్దా? అని ఆలోచించాల్సింది బిజెపినే అన్నారు. స్థానిక ఎన్నికల్లో లాగా బిజెపి తమతో కలవకపోతే తాము లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. కస్‌గంజ్ ఉదంతంపై ప్రశ్నించగా అది దురదృష్టకర సంఘటన అని పేర్కొన్నారు. కొంతమంది అధికారులు ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నారన్నారు. రాజ్‌బార్ చేసిన అవినీతి అభియోగాలపై రాష్ట్ర బిజెపి ప్రతినిధి రాకేష్ త్రిపాఠి స్పందించారు. ఎన్నికల ముందునాటి పొత్తులను కాదనుకోవడం తమ పార్టీ సాంప్రదాయం కాదని చెప్పారు.

ప్రత్యేకం

హర్యానాలో సాంస్కృతిక క్షీణత మహిళలకు లేని భద్రత



చండీఘడ్ : బేటీ బచావో, నవ భారతం వంటి నినాదాలు కేవలం కాగితాలకు, నేతల మాటలకే పరిమితం అవుతున్నట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా ముఖ్యంగా హర్యానాలో నెలకొన్న పరిస్థితి చూస్తుంటే ఆవేదన కలగకమానదు. వయస్సుతో నిమిత్తం లేకుండా కేవలం మూడేళ్ళ ప్రాయంలోని చిన్నారుల నుండి 50ఏళ్ళ మహిళల వరకు లైంగిక దాడులకు బలవుతునే వున్నారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నపుడు చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఖండిస్తూనే వుంటారు కానీ బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. జనవరి నెల్లో రాష్ట్రంలో వరుసగా సామూహిక అత్యాచారాలు, హత్యల పరంపర చోటు చేసుకున్నాయి. 2016లో జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) డేటాను చూసినట్లైతే గ్యాంగ్ రేప్‌ల్లో హర్యానా మొదటి స్థానంలో వుంది. దేశవ్యాప్తంగా ఏడాదిలో వెయ్యికి పైగా ఇటువంటి సంఘటనలు జరిగితే 200కి పైగా కేసులు హర్యానాలోనే నమోదయ్యాయి. వెలుగులోకి రాకుండా పోయిన కేసులు ఇంకెన్నో. ప్రజా భద్రతకు హామీ కల్పించడంలో మనోహర్ లాల్ ఖట్టార్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వపరంగా తాము చేయాల్సింది చేయకపోగా ఇలాంటి సంఘటనలను రాజకీయం చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై దుమ్మెత్తడం మరీ విచారకరం. పైగా మహిళల వస్త్రధారణ వల్లనే లైంగిక హింసాకాండ ఎక్కువవుతోందంటూ గతంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రి వంటి ఉన్నత స్థాయిలో వుండి ఇటువంటి తిరోగమన మనస్తత్వం వుంటే అది, పాలనా యంత్రాంగానికి తప్పుడు సంకేతాలు పంపుతుంది. నేరస్తులు మరింత రెచ్చిపోవడానికి దారి తీస్తుంది. ఇటువంటి దారుణాలకు మహిళలు, మైనర్లు ఎందుకు బాధితులవుతున్నారని ప్రశ్నించుకుంటే నయా ఉదారవాద మార్కెట్ శక్తులు అనుసరించే క్షీణించిన విలువలే కారణమని చెప్పుకోవాల్సి వుంటుంది. దీనికి తోడు ముదురుతున్న వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగిత పెచ్చరిల్లడం వంటివి యువతలో అసంతృప్తికి కారణమవుతున్నాయి. దీంతో మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం, ఆ మత్తులో వివిధ రకాల నేరాలకు పాల్పడడం సర్వసాధారణమైపోతోంది. పైగా హర్యానాలో నేడు సాంస్కృతిక క్షీణత బాగా కనిపిస్తోంది. దీనికితోడు విశృంఖలమైన ఆర్థిక సరళీకరణ విధానాలు, ఫ్యూడల్ విలువలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. స్త్రీ, పురుష నిష్పత్తి తగ్గిపోవడం పరిస్థితి మరింత దిగజారడానికి కారణమవుతోంది. ఇలా లైంగిక దాడులకు గురవుతున్నవారిలో అన్ని వర్గాల వారు వున్నప్పటికీ ప్రధానంగా దళిత మహిళలు చాలా సులభమైన లక్ష్యాలుగా మారుతున్నారు. పోలీసు యంత్రాంగం కానీ, చట్టం కానీ ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయలేకపోతుందనే భావన సమాజంలో ప్రబలంగా వుంది. ఇటువంటి పరిస్థితుల్లో బాధిత మహిళలే నిర్భయంగా ఎదురు తిరిగి పోరాటాలు జరిపితే కొంతవరకు పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశముంది. దీనికితోడు విశాల దృక్పథంతో తీసుకునే చొరవలు, ఉద్యమాలు అవసరం. శాంతిభద్రతలను అమలు చేసే యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం జవాబుదారీగా వ్యహరించాల్సి వుంది. దళిత, మహిళా సంఘాలు, పౌర సమాజ గ్రూపులు, వ్యక్తులు, సామాజిక సంస్థలు అందరూ కలిసి ఒక్కతాటిపైకి వచ్చి మహిళల గౌరవం కోసం, ప్రజల మౌలిక హక్కుల కోసం పోరాటాలు చేయాల్సి వుందని హర్యానాకి చెందిన మహిళా ఉద్యమ కార్యకర్త జాగ్మతి సంగ్వాన్ అభిప్రాయపడ్డారు.

సంక్షిప్తం

ఫిబ్రవరి 8, 15 తేదీల్లో త్రిపురలో మోడీ ప్రచారం

అగర్తలా : ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరి 8, మళ్లీ 15వతేదీనా అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్యటన చేయనున్నారు. త్రిపుర రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బిప్‌లాబ్ కుమార్ డెబ్ బుధవారం ఈ వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 8న ఉనకోటి జిల్లాలోని కైలాశహర్, 15న దక్షిణ త్రిపుర జిల్లాలోని శాంతిర్‌బజార్‌లోను మోడీ పర్యటిస్తారన్నారు.

ఆర్మీ అధికారుల కేసులపై బిజెపి నిరసన

న్యూఢిల్లీ : జమ్ము కశ్మీర్‌లో జనవరి 27న ఆందోళనకారులపై ఆర్మీ సిబ్బంది జరిపిన కాల్పుల ఘటనలో మరో వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు పౌరులు మరణించినగా తొమ్మిది మందికి గాయాలయైన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన ఇద్దరు ఆర్మీ అధికారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్ముకశ్మీర్‌లో సంకీర్ణ ప్రభుత్వమైనప్పటికీ, ఈ ఎఫ్ఐఆర్‌పై బిజెపి నిరసన వ్యక్తం చేసింది. ఆ రాష్ట్ర బిజెపి అధికారి ప్రతినిధి వీరేంద్రగుప్తా మాట్లాడుతూ రాళ్లను విసిరిన ఆందోళన కారులపై కేసు పెట్టకుండా ఆర్మీ సిబ్బందిపై కేసులు పెట్టడం విచారకరమని పేర్కొన్నారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపం

ఉత్తర భారతం, పాక్‌ల్లోనూ ప్రకంపనలు

కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్‌లో బుధవారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.1గా నమోదైంది. పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, న్యూఢిల్లీ, నేషనల్ కేపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్), పాకిస్తాన్‌ల్లో కూడా ప్రకంపనలు సంభవించాయి. పాక్‌లోని బెలూచిస్తాన్‌లో ఇంటి పైకప్పు కూలడంతో ఒక చిన్నారి మరణించగా, 9మంది కుటుంబ సభ్యులు గాయపడ్డారు. ఆఫ్ఘనిస్తాన్-తజకిస్తాన్ సరిహద్దుకు దగ్గర్లో జార్మ్ పట్టణానికి 35కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం వుంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.36గంటలకు భూకంపం సంభవించింది.

కాలుష్యంపై సమరానికి చైనా కసరత్తు

బీజింగ్: కాలుష్యంపై యుద్ధానికి 2018-2020కి ప్రణాళికను రూపొందించడానికి చైనా కరసత్తు చేస్తోంది. ప్రస్తుతం అందుకు వివరాలు సేకరిస్తున్నామని పర్యావరణ మంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలిపారు. ఆ శాఖ ప్రతినిధి లీ యుబిన్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆ ప్రణాళికకు అవసరమైన విధి విధానాలను ప్రస్తుతం అధికారులు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రధాన పారిశ్రామిక ప్రాంతాలైన జింగ్-తియాన్ జిన్-హిబియ్, యాంగ్ట్జి డెల్టా ప్రాంతాల్లో కాలుష్య నివారణపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.

ఎంతపెద్ద నెమలో!

బరువు ఎక్కువ ఉందటూ ఓ నెమలిని విమానంలో ప్రయాణించేందుకు నిరాకరించిన అధికారులు



నెమలికి విమాన టిక్కెట్!

అనుమతించని విమానాశ్రయ అధికారులు

వాషింగ్టన్ : తనతో పాటు తన పెంపుడు పక్షి నెమలిని కూడా విమానంలో తీసుకెళ్ళాలని ఒక మహిళ భావించింది. అందుకోసం దానికి టిక్కెట్ కూడా తీసుకుంది. అయినా సరే విమనాశ్రయ అధికారులు అనుమతించలేదు. ఇటీవల న్యూజెర్సీలోని నెవార్క్ లిబర్టీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎమోషనల్ సపోర్ట్ యానిమల్ నిబంధనల ప్రకారం తన పక్షిని తనతో విమానంలో తీసుకెళతానని సదరు మహిళ వాదించినా లాభం లేకపోయింది. విమానంలో ప్రయాణానికి సంబంధించిన పలు మార్గదర్శక సూత్రాలు ఆ నెమలి విషయంలో ఉల్లంఘించబడ్డాయని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ అధికారులు స్పష్టం చేశారు. నెమలి బరువు ఎక్కువగా వుందని, పరిమాణంలో కూడా చాలా పెద్దదిగా వుందని చెప్పారు. ఆ మహళ తన నెమలితో పాటు విమానాశ్రయానికి వచ్చిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో కూడా ఈ మహిళ తన నెమలిలో విమానంలో ప్రయాణించేందుకు పలుసార్లు ప్రయత్నాలు చేసిందని కానీ ఫలితం లేకపోయిందని మాజీ ఫ్లైట్ అటెండెంట్ బాబీ లోరీ తెలిపారు. నెవార్క్ విమానాశ్రయంలో నెమలికి అనుమతిని నిరాకరించిన తర్వాత ఆ మహిళ టిక్కెట్ మొత్తాన్ని కూడా అధికారులు తిరిగి ఇచ్చేశారు. పైగా విమానాశ్రయం నుండి హోటల్‌కు వెళ్ళేందుకు అయ్యే ఖర్చును కూడా చెల్లించారని లోరీ తెలిపారు.

అమెరికన్ నటుడు సాలింగ్ ఆత్మహత్య

న్యూయార్క్ : లైంగిక వేధింపులు తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న అమెరికన్ నటుడు మార్క్ సాలింగ్ (35) నివాసంలో మంగళవారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి తరుపు న్యాయవాది మైఖెల్ ప్రోక్టార్ ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. గ్లీ వంటి టీవీ సిరీస్‌లలో మంచి నటుడిగా అతడికి పేరుంది. 2015లో అతడిపై లైంగిక వేధింపులు, చైల్డ్ పోర్నోగ్రఫీ ఆరోపణలు వచ్చాయి. దీంతో అతడిని అరెస్టు చేసిన పోలీసులు 2016లో చార్జిషీట్ ఫైల్ చేశారు. అతడి ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని పరిశీలించగా అందులో దాదాపు 50 వేల చైల్డ్ పోర్నోగ్రఫిక్ ఫొటోలు, వీడియోలు లభించాయి. ఈ మేరకు వాదోపవాదాలు పరిశీలించి అతడు దోషి అని న్యాయమూర్తి నిర్ధరించారు.

ఏనుగు వెళుతుంటే కుక్కలు మొరుగుతాయి

అమెరికా ఆంక్షల జాబితాపై పుతిన్ వ్యాఖ్య

మాస్కో/వాషింగ్టన్ : త్వరలోనే ఆంక్షలు విధించే అవకాశం వుందంటూ వందమందికి పైగా రష్యా నేతలు, సంస్థల పేర్లను పేర్కొంటూ అమెరికా జాబితాను విడుదల చేయడాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కొట్టిపారేశారు. పైగా ఆ జాబితాలో తన పేరు లేనందుకు బాధపడ్డానంటూ జోక్ చేశారు. అయితే ఇది 'శత్రుపూరిత చర్య' అని వ్యాఖ్యానించారు. సమీప భవిష్యత్తులోనే రష్యాపై కొత్త ఆంక్షలను విధిస్తామని అమెరికా ఆర్థిక మంత్రి స్టీవెన్ నుచిన్ పేర్కొనడంపై స్పందిస్తూ పుతిన్, అదే గనుక జరిగితే ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత అధ్వాన్న స్థితికి చేరుకుంటాయని అన్నారు. ఆంక్షలు విధించే వారి జాబితా అంటూ అమెరికా వెలువరించిన నివేదికపై తాము ఇప్పుడే స్పందించబోమని అన్నారు. పైగా ఆ నివేదికకు తాము ప్రాధాన్యత ఇవ్వబోమని చెబుతూ, 'ఏనుగు వెళుతుంటే కుక్కలు అరుస్తాయి." అన్న సామెతను ఉదహరించారు. అమెరికాతో ఘర్షణ పడాలన్న ఆసక్తి ఏమీ తమకు లేదని అన్నారు. అంతర్జాతీయ చట్టాల ప్రాతిపదికన దీర్ఘకాల, సుస్థిర సంబంధాలు నెలకొల్పుకోవాలనే రష్యా భావిస్తుందని తెలిపారు. కాగా, అమెరికా జాబితాకు తామిచ్చే ప్రాధాన్యత శూన్యమని ప్రధాని మెద్వెదెవ్ పేర్కొన్నారు. కాగా రష్యాలోని సంపన్నుల జాబితాతో ఫోర్బ్స్ సంస్థ వెలువరించిన నివేదికను కాపీ కొట్టినట్లు అమెరికా జాబితా వుందని పలువురు వ్యాఖ్యాతలు



వ్యాఖ్యానిస్తున్నారు. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకున్నందుకు రష్యా ప్రభుత్వంపై చర్యలు తీసుకునే అవకాశం వుందని పేర్కొంటూ 114మంది పేర్లతో మంగళవారం జాబితా వెల్లడైంది.

ఇంటిపై కూలిన హెలికాప్టర్

ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు

లాస్‌ఏంజెల్స్ : దక్షిణ కాలిఫోర్నియాలోని ఒక ఇంటిపై బుధవారం హెలికాప్టర్ కూలిపోయిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారని, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని ప్రత్యక్ష సాక్షులు, అత్యవసర సహాయ విభాగ సిబ్బంది తెలిపారు. ఈ హెలికాప్టర్ శిక్షణా కార్యక్రమాలకు ఉపయోగించేదని చెప్పారు. నాలుగు సీట్లు గల రాబిన్సన్ 44 హెలికాప్టర్ ఒక్కసారిగా కిందకు దిగిపోయి ఒక ఇంటి పైకప్పును ఢీకొందని, అనంతరం మరో ఇంట్లోకి దూసుకెళ్ళిందని, సంఘటన జరిగిన విధానాన్ని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సంఘటనా ప్రాంతంలో పెద్ద ఎత్తున పొగ కమ్మేసిందని, పైగా రైలు దూసుకువస్తున్నట్లుగా శబ్దం వినిపించిందని పొరుగు ఇంట్లోని వ్యక్తి చెప్పారు. ఆ విమానం నుండి ఒకరు బయటకు పడిపోయినట్లు కనిపించిందని, అయితే ఎవరూ జీవించి వుండే అవకాశాలు లేవనిఒక మహిళ తెలిపారు. విమానం ఢీకొన్న ఇంట్లోని వారెవరూ గాయపడలేదని చెప్పారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ హెలికాప్టర్ రివల్యూషన్ ఏవియేషన్‌కి చెందినది. పైలట్ శిక్షణకు, సైట్ సీయింగ్ టూర్‌లకు దీన్ని వినియోగిస్తుంటారు.

మేయర్, ప్రతిపక్ష నేతను హత్య చేయాలనుకున్నా



లండన్ దాడి నిందితుడి వెల్లడి

లండన్ : లండన్ మేయర్ సాదిక్ ఖాన్‌ను హతమార్చివుంటే లాటరీ గెలిచినంత సంతోషపడేవాడినని లండన్ దాడి నిందితుడు డారెన్ ఒస్బోర్న్ వ్యాఖ్యానించాడు. పైగా ప్రతిపక్ష నేత జెరిమీ కార్బిన్‌ను కూడా చంపాలని భావించానని చెప్పాడు. లండన్‌లో రంజాన్ ప్రార్ధనలకు హాజరవుతున్న ముస్లిం బృందంపై ఉద్దేశ్యపూర్వకంగా వ్యాన్‌తో దాడి జరిపిన ఘటనలో నిందితుడైన ఒస్బోర్న్ విచారణ సందర్భంగా ఈ విషయాలు వెల్లడించాడు. గతేడాది జూన్ 19న జరిగిన ఈ దాడిలో 51ఏళ్ళ మకరం అలీ మరణించాడు. ఇటీవల జరుగుతున్న తీవ్రవాద దాడులు, బాలలపై లైంగిక వేధింపులు, కుంభకోణాలు వంటి వాటిలో ప్రధానంగా ముస్లింల పాత్ర వుందంటూ ఆగ్రహంతో ఈ దాడికి దిగినట్లు విచారణ సందర్భంగా ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. అయితే ఒస్బోర్న్ ఈ అభియోగాలను నిరాకరిస్తున్నాడు. పాల స్తీనా అనుకూల ప్రదర్శన సందర్భంగా టెర్రీ జోన్స్, డేవ్‌లను హతమార్చా లని తాను భావించానని తెలిపాడు. సెంట్రల్ లండన్‌లో జరిగే ఆ ప్రదర్శనకు కార్బిన్ వస్తారని భావించారు. అయితే ఆ దారి మూసివేయడంతో ప్రదర్శకులను చేరుకునే అవకాశం లేకపోయిందని తెలిపాడు. కార్బిన్‌ను హత్య చేయగలననే భావించావా అని ప్రాసిక్యూటర్లు ప్రశ్నించగా, కచ్చితంగా అని సమాధానమిచ్చాడు. మేయర్ సాదిక్ ఖాన్ అక్కడ వుంటే మరింత బాగుండేదని వ్యాఖ్యా నించారు. అయితే టెర్రీ, డావెలను చంపాలనుకున్నానంటూ ఒస్బోర్న్ చెబుతున్నదంతా కల్పితమని, ముస్లింల పట్ల ఆగ్రహతోనే ఈ దాడికి దిగాడని ప్రాసిక్యూటర్లు తెలిపారు.

జాత్యంహకార వ్యాఖ్యలు చేసిన అమెరికన్ సార్జెంట్ సస్పెన్షన్

వాషింగ్టన్ : తన కిందిస్థాయి ఉద్యోగులైన నల్లజాతీయులపై వివక్షపూరిత వ్యాఖ్యలు చేసినందుకు అమెరికా వైమానిక బలగాలకు చెందిన టెక్నికల్ సార్జెంట్‌ను విధుల నుండి సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. టెక్నికల్ సార్జెంట్ గెరాల్డిన్ లప్లీ తన కిందిస్థాయి ఉద్యోగులపై కేకలు వేస్తున్న వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. వారు చాలా పొగరుతో వ్యవహరిస్తారని, తనకు అసలు గౌరవం ఇవ్వరని ఆమె అందులో పేర్కొన్నారు. ఆ వీడియో వైరల్ కావడంతో, నిందాపూర్వకంగా, దురుసుగా ఆమె ఉపయోగించిన పదజాలం నెవడాలోని నెల్సీల్ ఎయిర్‌ఫోర్స్ స్థావరంలోనే కాదు, దేశ వ్యాప్తంగా కూడా తీవ్ర విమర్శలకు గురైంది. బాస్‌గా తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నించానని ఆమె ఆ వీడియోలో పేర్కొన్నారు. వారు నాతో మాట్లాడిన ప్రతీసారీ అలానే వ్యవహరిస్తున్నారని చెప్పారు. 99వ ఫోర్స్ సపోర్ట్ స్వాడ్రన్ సభ్యురాలైన లప్లీ, 'ప్రతీసారీ వారి వ్యవహారాన్ని తేలికగానే తీసుకుంటూ వచ్చానని, వారితో ఘర్షణకు దిగలేదని చెప్పుకొచ్చారు. ఆమె చర్యలు అనుచితంగా వున్నాయని, ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కావని నెల్లీస్ ఎయిర్‌ఫోర్స్ బేస్ పేర్కొంది. ఆమెపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు. మతం, రంగు, జాతి వంటి కారణాలనతో ఎవరినీ అవమానించే చర్యలను సహించేది లేదని మేజర్ జనరల్ పీటర్ గెర్‌స్టన్ వ్యాఖ్యానించారు. జార్జియా యూనివర్శిటీ సాకర్ క్రీడాకారిణి నటాలియా మార్టినెజ్ కూడా ఇలానే వర్ణ వివక్ష పూరితమైన వ్యాఖ్యలు చేయడమే కాక ఆ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు ఆమెను మందలించడమే కాకుండా సాకర్ టీం నుండి తొలగించారు. ఆ సంఘటన జరిగిన వారం రోజులకే లప్లీ సస్పెన్షన్ చోటు చేసుకుంది.

ఆఫ్ఘన్‌లో 70శాతం భూభాగంలో తాలిబన్లు క్రియాశీలం

బిబిసి అధ్యయనంలో వెల్లడి

వాషింగ్టన్ : ఆఫ్ఘనిస్తాన్‌లోని 70శాతం ప్రాంతాల్లో తాలిబన్లు క్రియాశీలంగా వున్నారని బిబిసి అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని నాలుగు శాతం ప్రాంతంపై పూర్తి పట్టు కలిగివున్నారని, మరో 66శాతం ప్రాంతాల్లో తమ ఉనికిని తెలియచేస్తున్నారని ఆ అధ్యయనం పేర్కొంది. తాలిబన్ల కార్యకలాపాలు, వారి స్థితిగతులపై ఇటీవల నాటో నేతృత్వంలోని సంకీర్ణ కూటమి అధ్యయనం చేసినదానికన్నా బిబిసి అంచనాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2017 అక్టోబరు నాటికి ఆఫ్ఘన్‌లో కేవలం 44శాతం ప్రాంతమే తాలిబన్ల అదుపులో వుందని నాటో కూటమి పేర్కొంది. గత పది రోజులుగా ఆఫ్ఘన్‌లో తాలిబన్ల హింసాకాండ పెచ్చురిల్లింది. దానిపై జరిపిన పరిశీలనాంశాలు కూడా మంగళవారం నాటి బిబిసి అధ్యయనంలో వెల్లడయ్యాయి. 122జిల్లాలు లేదా 30శాతం భూభాగంపై ఆఫ్ఘన్ ప్రభుత్వానికి అదుపు వుందని బిబిసి పేర్కొంది. అంటే దీనర్థం ఈ ప్రాంతంలో తాలిబన్ దాడులు జరగడం లేదని అర్థం కాదని పేర్కొంది. కాబూల్, ఇతర ప్రధాన నగరాలు ఇంకా ఎక్కువగా దాడులకు గురవుతున్నాయని, తాలిబన్ స్లీపర్ సెల్స్ నుండి వీటికి ముప్పు ఎక్కువగా పొంచి వుందని బిబిసి నివేదిక తెలిపింది. బిబిసి అధ్యయనంపై పెంటగన్ నేరుగా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. కానీ నాటో నివేదికతో పోలుస్తూ 56శాతం భూభాగం ఆఫ్ఘన్ ప్రభుత్వ అధీనంలోనే వుందని తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో టిటిడి స్టీరింగ్!

లోనూ తలదూరుస్తోంది. అన్య మతం పేరుతో రాద్ధాంతం చేస్తూ 45 మందిని తొలగించేందుకు నోటీసులను జారీ చేసింది. దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు తాజాగా సామాన్య భక్తులకు రెండుసార్లే దర్శనమంటూ జీవో తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో భక్తుల్లో అశాంతి మొదలయ్యింది. శ్రీవారిని దర్శించుకోడానికి కూడా ఆంక్షలా? అంటూ భక్తులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. మరోపక్క టిటిడి ఉద్యోగుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉద్యోగులకు మతం రంగు పులిమి తొలగించరాదంటూ ఆందోళనకు సిద్ధమవుతోంది. తెలుగుదేశం పార్టీ పొత్తు బిజెపి అజెండాకు బాగా ఉపయోగపడుతోంది. రాష్ట్ర విభజన తరువాత ఎన్‌డిఏ ప్రభుత్వం చేయాల్సిన ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజిలు ఇవ్వడం కంటే, మతతత్వ అజెండాను ముందుకు తీసుకెళ్లడంలో బిజెపి ముందుంది. ఆరంభంలోనే దేవాదాయ శాఖ మంత్రిగా బిజెపికి చెందిన మాణిక్యాలరావును తీసుకున్నారు. టిటిడి ట్రస్టు ఏర్పడి 80 ఏళ్లు కావస్తోంది. మొన్నటివరకూ రాష్ట్రానికి చెందిన ఐఎఎస్ క్యాడర్‌నే కార్యనిర్వహణాధికారిగా నియమిస్తూ వచ్చారు. అయితే తొలిసారిగా ఏడాదిన్నర క్రితం ఉత్తరాదికి చెందిన ఐఎఎస్ అధికారి అనిల్‌కుమార్ సింఘాల్‌ను నియమించారు. టిటిడిలో అన్యమతస్తులు 45 మంది ఉన్నారని, వారిని వెంటనే తొలగించాలన్న ఆర్‌ఎస్‌ఎస్ రాద్ధాంతానికి ఈవో తలొగ్గి నోటీసులను జారీ చేశారు. యనమల రామకృష్ణుడు వియ్యంకుడు, కడపకు చెందిన పుట్టా సుధాకర్ యాదవ్‌ను ధర్మకర్తల మండలి ఛైర్మన్ చేయాలని టిడిపి ఆరునెలల క్రితం సిద్ధమయ్యింది. అయితే ఆర్‌ఎస్‌ఎస్ పనిగట్టుకుని అతను క్రిష్టియన్ సభలకు వెళ్లి సందేశాలిచ్చారన్న కారణం చూపి మోకాలడ్డారు. అతనిని నియమిస్తే రాష్ట్రమంత్రులు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాసరావులు రాజీనామా చేస్తామని హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. దీంతో టిడిపి వెనక్కి తగ్గింది. దాదాపు టిటిడి బోర్డు గడువు పూర్తయి ఏడాదైనా ఇంతవరకు కొత్తది ప్రకటించకపోవడం గమనార్హం. తాజాగా మంత్రి మాణిక్యాలరావు సామాన్య భక్తులను కట్టడి చేసేందుకంటూ 'ఏడాదికి రెండుసార్లే దర్శనం' అని చర్చ లేవనెత్తారు. త్వరలోనే జీవో తీసుకురానున్నట్లు సమాచారం. అయితే ఈ విషయమై సామాన్యుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

150 కోట్ల కమీషన్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అతనికి ఉమ్మడి రాజధాని హైదరాబాద్ ప్రాంతంలో కోట్లాది రూపాయిల విలువైన భూములున్నాయి. 1987లో వాణిజ్య పన్నుల శాఖలో సిటిఓగా చేరిన లక్ష్మీ ప్రసాద్ గుంటూరు జిల్లా నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లిలో ఎక్కువకాలం విధులు నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖలోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోనూ విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో డిప్యూటీ కమిషనర్ హోదాలో విధులు నిర్వహించారు. 2017 జూన్ నుంచి జిఎస్‌టి విభాగంలో అదనపు కమిషనర్ హోదాలో విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్మీ ప్రసాద్ మొదటి భార్యకు అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది. ద్వితీయ వివాహం చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. లక్ష్మీ ప్రసాద్ గతంలో కొంతకాలం మంత్రి యనమల రామకృష్ణుడు వద్ద ఓఎస్‌డిగా విధులు నిర్వహించారు. బుధవారం సాయంత్రం నిందితుడిని అరెస్ట్ చేసి ఎసిబి కోర్టులో హాజరుపర్చారు.వీటితో పాటు కోటి రూపాయిలు విలువైన ప్రాంశరీ నోట్లు, రూ.34 లక్షల బ్యాంకు బ్యాలెన్స్, రూ.32 వేల నగదు, రూ.40 లక్షల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల గృహోపకరణాలు, మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాల్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి ఇండియన్ ఓవర్ సీస్ బ్రాంచ్‌లో లాకర్ ఉన్నట్లు కనుగొన్నారు. దీనిని ఇంకా తెరవాల్సి ఉంది.

జనవరిలోనే...

జనవరిలోనే విజయవాడలోని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా అదనపు కమిషనర్ ఏడు కొండలుతో పాటు అతనికి సహకరించిన సూపరింటెండెంట్‌నూ ఎసిబి అరెస్ట్ చేసింది. రాష్ట్ర చరిత్రలోనే రూ.23.20లక్షలు నగదును లంచం రూపంలో తీసుకున్న అదనపు కమిషనర్ హోదాలోని వ్యక్తి రెడ్ హేండెడ్‌గా దొరకడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇది జరిగి 20 రోజులు గడవక ముందే అదే కార్యాలయంలోని మరో కమిషనర్ లక్ష్మీ ప్రసాద్ ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో దొరకడం చర్చానీయాంశమయ్యింది.

లక్ష్మీ ప్రసాద్ పేరు మీద

- శ్రీకాకుళం టౌన్‌లో 7000 వేల చదరపు అడుగుల రెండంతస్తుల భవనం
- గుంటూరు జిల్లా గోరంట్లలో 400 చదరపు గజాల్లో పక్కా భవనం
- హైదరాబాద్ అశోక్‌నగర్‌లో 1485 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్
- హైదరాబాద్ నారాయణగూడాలో 1594 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్
- హైదరాబాద్ గచ్చిబౌలీలో 2040 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్

మొదటి భార్య అలివేలు పేరు మీద

- విశాఖపట్నంలో 366, 200 చదరపు గజాలు
- హైదరాబాద్ పరిగిలో 200 చదరపు గజాల స్థలాలు 4 ఉన్నాయి
- గుంటూరు జిల్లా గోరంట్లలో 889 గజాల ఇళ్ల స్థలం

రెండో భార్య మల్లిక పేరు మీద

- గుంటూరు జిల్లా తాడికొండ మండలం, లాం వద్ద 172 గజాలు
- గుంటూరు జిల్లా తాడికొండ మండలం, లాం వద్ద 400 గజాల స్థలాలు 2 ఉన్నాయి
- గుంటూరు జిల్లా గోరంట్లలో 240 గజాల ఇంటి స్థలం

విలువైన భూములు

- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, అమీర్‌పేటలో ఒక గుంట భూమి
- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, అమీర్‌పేటలో 1.14 గుంటల భూమి
- విశాఖపట్నం అచ్యుతాపురం మండలం, దుప్పిటూరులో 17 సెంట్ల భూమి

అత్త అప్పలనరసమ్మ పేరు మీద

- శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో 2 ఎకరాల భూమి
- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేటలో 2 ఎకరాల భూమి
- గుంటూరు జిల్లా గోరంట్లలో 222 గజాలు

గొట్టిపాడు బాధితులకు తక్షణ లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

నాగార్జునసాగర్ కుడికాల్వ ఛైర్మన్ బి.భుజంగరాయలు, తహశీల్దార్ ప్రసాదరావు, సర్పంచ్ జి.బాబురావు ఉన్నారు. అనంతరం పలువురు స్థానికులతో మాట్లాడిన రాములు రాతపూర్వకంగా వివరాలు సేకరించారు.

బాధితులకు న్యాయం చేయాలని వినతులు

గొట్టిపాడు సందర్శనకు బుధవారం గుంటూరు వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో వివిధ ప్రజాసంఘాలు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కోన శశిధర్, అర్బన్, రూరల్ ఎస్‌పిలు విజయరావు, అప్పలనాయుడు, పత్తిపాడు ఎమ్మెల్యే తదితరులు రాములుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారితో రాములు సుమారు గంటపాటు అంతర్గతంగా సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గొట్టిపాడు ఘటన వివరాలు వారి ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. గొట్టిపాడులో జనవరి ఒకటోతేదీన ఘటన తర్వాత ఇరు పక్షాలు దాడులు చేసుకున్నాయని తనకు అధికారులు చెప్పారన్నారు. దళితులపై దాడులపై కమిషన్ తీవ్రంగా ఆలోచిస్తోందని, ఎపిలో గుంటూరు, విజయనగరం, పశ్చిమగోదావరి, విశాఖ ఇలా అనేక జిల్లాల్లో దళితులపై దాడుల సందర్భంగా ఎస్సీ కమిషన్ స్పందించి బాధితులకు న్యాయం చేకూరేలా చూస్తోందని చెప్పారు. అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయటానికి, సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా ఉండేందుకు కమిషన్ కృషి చేస్తుందని చెప్పారు.

ఇళ్ల చుట్టూ పోలీసులే..!

దాడి నాటి నుంచి బిక్కుబిక్కుమంటూ ఉంటున్నాం. బాధను ఎవరితోనైనా చెప్పుకోడానికి బయటకు వెళ్లామంటే పోలీసులు ఇళ్ల చుట్టూ కాపలా ఉంటున్నారు. ఎక్కడికీ వెళ్లనివ్వడం లేదు. పెత్తందార్లు మాత్రం స్వేచ్ఛగా తిరుగుతున్నారు.

– సౌభాగ్యం, స్థానిక మహిళ

కులం పేరుతో తిట్టారు

నూతన సంవత్సరం రాత్రి బండిపై వెళుతున్నవారు కింద పడినందుకు దుర్భాషలాడి కులం పేరుతో తిట్టారు. ప్రార్థన సమయంలో మారణాయుధాలు, కర్రలు, రాళ్లను ట్రాక్టర్‌లో వేసుకుని వచ్చి దాడి చేశారు. అర్ధరాత్రి ఘటనకు ఎస్‌ఐ సమక్షంలోనే క్షమాపణ చెప్పినా దాడికి వచ్చారు.

– పీటర్‌పాల్, దయారత్నం

రాలిన విద్యా కుసుమాలు

(మొదటి పేజీ తరువాయి)

దూకేశాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి రక్తం మడుగులో పడి ఉన్న కొడుకు మృతదేహం చూసి బోరున విలపించింది. తమ బిడ్డకు ఆరోగ్యం బాగోని కారణంగా చనిపోయాడంటూ తల్లిదండ్రులు చెప్పారు.

నిధులు కురిసేనా

(మొదటి పేజీ తరువాయి)

అందించింది. ముందుగా ఎప్పటిమాదిరిగానే లోటు నిధులను బడ్జెట్ కేటాయించాలని కోరింది.2014-15 సంవత్సరానికి 16 వేల కోట్లరూపాయల ఆదాయ లోటు నెలకొందని, అలాగే పిఆర్‌సి అమలులో భాగంగా ఉద్యోగుల పింఛన్ల కోసం మరో రూ.5325 కోట్లు ఇవ్వాలని కోరుతుండగా, కేంద్రం మాత్రం వివిధ పథకాలకు ఇచ్చే మొత్తం మినహాయించ గా, కేవలం రూ.4117 కోట్లు మాత్రమే రాష్ట్రానికి వస్తుందని చెబుతోంది. దీంతో కేంద్రం చెబుతున్న మొత్తాన్నయినా బడ్జెట్‌లో పొందుపరచాలని రాష్ట్ర ఆర్థిక శాఖ కోరుతోంది. కాగా, రాజధాని నిర్మాణానికి సంబంధించి తాజా బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలని కోరుతున్నారు. దీనికి అదనంగా అమరావతి నుంచి అన్ని ప్రాంతాలకు రోడ్డు, రవాణా సౌకర్యం కల్పించేందుకు విశాఖ నుంచి అమరావతిని కలుపుతూ చెన్నై వరకు హై స్పీడ్ రైలు మార్గాన్ని నిర్మించేందుకు, విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించేందుకు కూడా బడ్జెట్‌లో మరికొంత కేటాయించాలని ప్రతిపాదనల్లో కోరారు. కొత్త రాష్ట్రంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేందుకుగాను రాయితీలు, ప్రోత్సాహకాలకుగాను రూ.1500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని రాష్ట్రం డిమాండ్ చేస్తోంది. అలాగే అమరావతి నగరంలో పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా సహాయం చేయాలని, అమరావతి నగర ప్రాంతానికి వచ్చే అన్ని పరిశ్రమలకు వాటి ఉత్పత్తులపై పదేళ్లపాటు వంద శాతం ఎక్సయిజ్ డ్యూటీ మినహాయింపు ఇవ్వాలని, ఐదేళ్లపాటు వందశాతం ఆదాయపు పన్ను మినహాయింపులు, తదుపరి ఐదేళ్లపాటు 30 శాతం మినహాయింపును ఇవ్వాలని, ప్లాంట్, మిషనరీ వంటి వాటిపై 15 శాతం పెట్టుబడి వ్యయంపై సబ్సిడీ ఇవ్వాలని, దీన్ని కూడా బడ్జెట్‌లో అధికారికంగా ప్రకటించాలని కోరుతున్నారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటనలో భాగంగా ఈ ఏడాదికి రూ.3238 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు ప్రస్తుతం నేరుగా గ్రామాలకే ఇస్తున్నారు. అయితే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌గా భరించిన 1200 కోట్ల రూపాయలను బడ్జెట్ ద్వారా విడుదల చేయాలని కోరుతున్నారు. అలాగే విశాఖలో రైల్వే జోన్, గన్నవరాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్పు చేయడం, ఇతర విమానాశ్రయాల్లో విస్తరణ పనులు, విశాఖ నుంచి చెన్నై వరకు కోస్టల్ కారిడార్ నిర్మాణం, కేంద్రం ఇప్పటికే ప్రకటించి జాతీయ విశ్వవిద్యాలయాల ప్రారంభం వంటి వాటికి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులకు 90:10 నిష్పత్తిలో నిధులు ఇచ్చేందుకు ముందుగా కేంద్రం అంగీకరించినప్పటికీ, తరువాత కాలంలో డివల్యూషన్ నిధుల్ని పది శాతం పెంచడం వల్ల 90:10 నిష్పత్తికి కేంద్రం ససేమిరా అంటోంది. అయితే రాష్ట్ర ప్రత్యేక అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని 90:10 నిష్పత్తితో నిధులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. పోలవరాన్ని తామే నిర్మిసా_మని కేంద్రం చెబుతున్నప్పటికీ, దానికి సంబంధించిన నిధుల్ని బడ్జెట్‌లో చూపించాలని కోరుతోంది.ఇలా భారీ స్థాయిలో నిధుల్ని కోరుతుండగా, గురువారం బడ్జెట్‌లో ఎంతవరకు కేంద్రం స్పందిస్తుందన్నది వేచి చూడాల్సిం దేనని ఆర్థికశాఖ అధికారులు వ్యాఖ్యాని స్తున్నారు. అలాగే అంతర్జాతీయ విమానాశ్రయంగా గన్నవరం, రోడ్లు, కోస్టల్ కారిడార్‌లకు నిధులు, ఇపి పనులకు 90:10 నిష్పత్తి అమలు, పోలవరం పూర్తికి బడ్జెట్‌లో కేటాయింపులు, జాతీయ సంస్థల ప్రారంభానికి చర్యలు, విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటుకు అదనంగా నిధులు సమకూర్చాల్సి ఉంది.

రైల్వే జోన్ వచ్చేనా ?

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రైల్వేలో అత్యంత కీలకమైన రైల్వేజోన్‌పై నేడు స్పష్టత రానుంది. రైల్వే పరంగా జోన్ ఏర్పాటు చేయడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం గతంలోనే తేల్చిచెప్పింది. అయితే రాజకీయంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కేంద్రమంత్రి సుజనాచౌదరి కూడా దీనిపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ప్రకటించారు. గత రెండేళ్లుగా రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్లో కలిపేయడంతో రాష్ట్రాల్లో ప్రాజెక్టుల్ని ప్రాధాన్యతాక్రమంలో కేటాయిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కీలకంగా ఉన్న అమరావతిలో 106 కిలోమీటర్ల మేర నిర్మించే కొత్త రైల్వేలైనుకు గత బడ్జెట్లో ఆమోదం తెలిపారు. దీనికి రూ.2680 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్లో దీనిపై స్పష్టత రానుంది. అలాగే రైల్వేజోన్ విషయంలోనూ నేడు వెలువడే ప్రకటనే కీలకం కానుంది. దీనిపైనే అందరూ దృష్టి సారించారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి చేపట్టే ప్రాజెక్టులూ ఉన్నాయి. అలాగే హైస్పీడు రైలు మార్గంపై మూడేళ్లుగా చర్చ జరుగుతున్నా ఇంతవరకు కొలిక్కి రాలేదు. విజయవాడ, చెన్నై మధ్య లాజిస్టిక్ రవాణాకు ప్రత్యేక రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయినా ఇంతవరకు కార్యారూపం దాల్చలేదు. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సుమారు 600కుపైగా కల్వర్టులు దెబ్బతిన్నాయి. వాటిని మార్చాల్సి ఉన్నా రైల్వే రద్దీ దృష్ట్యా వాటిని మార్చడం లేదు. విజయవాడలో మరో రైలు వంతెన ప్రతిపాదన కూడా ఉంది. అలాగే విభజనానంతరం విజయవాడ రైల్వేస్టేషన్ పూర్తి రద్దీగా మారింది. పది ఫ్లాట్‌ఫారాలు ఉన్నప్పటికీ చాలడం లేదు. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల ఉన్న గుణదల, రామవరప్పాడు, రాయనపాడు, గన్నవరం, కృష్ణాకెనాల్ స్టేషన్లను శాటిలైట్ స్టేషన్లుగా మార్చి రోడ్డు రవాణా సదుపాయాన్ని కూడా పెంచాలని గతంలో ప్రతిపాదనలున్నాయి. కృష్ణాకెనాల్ జంక్షన్లో రైల్వేభూమి 2000 ఎకరాల వరకూ ఉంది. అక్కడ స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా అమరావతికి అనుసంధానం తేలికవుతుంది. ప్రభుత్వం దీనిపై ఇంతవరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఈ బడ్జెట్లో అయినా విజయవాడ స్టేషన్‌పై ప్రత్యేక ప్రకటన ఉంటుందేమో అని ఎదురు చూస్తున్నారు. దీంతోపాటు కీలకమైన నడికుడి కాళహస్తి, కొత్తలైనుకు గత బడెట్లో రూ.340 కోట్లు కేటాయించారు. కొంత పని జరుగుతున్నా పూర్తి చేసేందుకు వీలుగా నిధుల కేటయింపు లేదు. కడప- బెంగుళూరుకు గతేడాది రూ.24 కోట్లు, కోటిపల్లి-నరసాపురానికి రూ.430 కోట్లు, గుంటూరు- గుంతకల్లుకు రూ.124 కోట్లు కేటాయించారు. అలాగే తెనాలి- గుంటూరు డబ్లింగ్‌కు రూ.36 కోట్లు కేటాయించగా దాన్ని పూర్తి చేశారు. విజయవాడ, భీమవరం, నిడదవోలు మధ్య డబ్లింగ్, విద్యుదీకరణ పనులు చేయాల్సి ఉంది. దీనికి రూ.122 కోట్లు కేటాయించినా ఇంకా పనులు పూర్తికాలేదు. ఎర్రగుంట్ల నంద్యాల మధ్య ఇటీవల రైల్వేలైను ఏర్పాటు చేశారు. దీన్ని కడప వరకూ పొడిగించాలని ప్రజా ప్రతినిధులు కోరుతు న్నారు. అలాగే నంద్యాల, కడప, తిరుపతి మధ్య ఒకరైల్వేలైను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే విజయవాడ, సికింద్రాబాద్ మధ్య రోజువారీ పాసింజర్ రైళ్లను ఏర్పాటు చేయాలని, మచిలీపట్నం నుండి యశ్వంత్‌పూర్ వెళ్లే రైలును రోజూ నడపాలని అప్పట్లో ప్రయాణికుల సంఘాలు ప్రతిపాదనలు పెట్టాయి. ఎంపిలు కూడా దీనిపై రైల్వేశాఖకు ప్రతిపాదనలు పెట్టారు. విష్ణుపురం, మోటమర్రి వద్ద రైల్వేలైనును వినియోగించుకుంటే దూరం కూడా తగ్గుతుందని అంచనా వేశారు. అలాగే కోటిపల్లి, భద్రాచలం రోడ్ రైల్వేలైను ప్రతిపాదనకు ఆమోదం లభించినప్పటికీ దీనిపై ఇంతవరకు కార్యాచరణ మొదలు కాలేదు. కోటిపల్లి నరసాపురం ప్రాజెక్టుకు గతంలో రూ.430 కోట్లు కేటాయించారు. దీన్ని కూడా పూర్తిచేయాలని కోనసీమ వాసులు కోరుతున్నారు. కీలకమైన విజయవాడ రైల్వేయార్డు అభివృద్ధి అంశం కూడా పెండింగ్‌లో ఉంది. ఉద్యోగుల వెయిటింగ్ రూములు, గృహ నిర్మాణం వంటి ప్రాజెక్టులు చేపడతామని గతంలో ప్రకటించారు. దీనిపై ఇంతవరకు స్పష్టత లేదు. పలు స్టేషన్ల స్థాయిలు మార్చినప్పటికీ వాటికి అనుగుణంగా అభివృద్ధిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అన్ని సినిమాలూ ఆడాలి

"ఒక థియేటర్‌లో నాలుగు సినిమాలు ప్రదర్శిస్తుంటే మూడు థియేటర్లు ఫుల్‌గా వుంటే.. ఓవర్‌ఫ్లో అయిన జనాలు నాలుగో సినిమాకు ఆటోమేటిక్‌గా వస్తారు. అలా చిన్న, పెద్ద సినిమా తేడా లేకుండా సినిమాను సక్సెస్ చేస్తారని" సి. కళ్యాణ్ విశ్లేషించారు. ఆయన నిర్మించిన 'ఇంటిలిజెంట్' చిత్రం ఈనెల 9న విడుదలకాబోతుంది. 10న వరుణ్‌తేజ్ 'తొలిప్రేమ' విడుదలకాబోతుంది. ఆ తర్వాత మోహన్‌బాబు 'గాయత్రి' రాబోతోంది. దీన్ని పురస్కరించుకుని సి.కళ్యాణ్ మాట్లాడారు.



సి.కళ్యాణ్

అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా కెరీర్ స్టార్ట్ అయ్యింది. మా గురువు దాసరిగారి దయవల్ల నేను ఇంతవాణ్ణి అయ్యాను. నా డైరెక్షన్‌లో సుమన్, జయసుధ, సుహాసిని కాంబినేషన్‌లో సినిమా ప్లాన్ చేశాం. అనుకోని సంఘటనల వల్ల ఆ సినిమా రద్దయింది. దాంతో నిర్మాతగా మారాను. అప్పట్నుంచీ ఇప్పటిదాకా 69 సినిమాలు చేశాను. 'ఇంటిలిజెంట్' 70వ సినిమా.

ఈ ఏడాది శుభారంభం

ఈ ఏడాది సంక్రాంతికి సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో నిర్మించిన మా 'జై సింహ' చిత్రాన్ని సూపర్‌హిట్ చేసి మా బేనర్‌కి 2018లో గొప్ప శుభారంభాన్ని ప్రేక్షకులు ఇచ్చారు. అలాగే 'ఇంటిలిజెంట్' సినిమా ప్రారంభం రోజునే ఫిబ్రవరి 9న రిలీజ్ అని చెప్పటం జరిగింది. అనుకున్నట్లుగానే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. ఈమధ్యనే బాలయ్యబాబు టీజర్‌ని రిలీజ్ చేశారు. టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రభాస్ పాటల్ని లాంచ్ చేశారు. అన్ని పాటలకి మంచి స్పందన వచ్చింది.

రాజమండ్రిలో ప్రీ రిలీజ్

'ఇంటిలిజెంట్' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ని ఈనెల 4న రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్ పై జంక్షన్‌లో భారీ ఎత్తున జరుపుతున్నాం. ఈ ఫంక్షన్‌కి అందరి అభిమానులు విచ్చేసి సక్సెస్ చెయ్యాలని కోరుకుంటున్నాను. 'ఛలో' ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవిగారు 'ఇంటిలిజెంట్' టైటిల్ చాలా బాగుంది అని వున్నంత సేపు మా సినిమా గురించే మాట్లాడారు. 'ఖైది నంబర్ 150' చిత్రం తర్వాత పెద్ద హీరోలతో కాకుండా సాయిధరమ్ తేజ్‌తో సినిమా చేద్దాం.. అని వినాయక్ నాతో చెప్పగానే ఓకే అని చెప్పాను. సాయిధరమ్ తేజ్ కెరీర్ గ్రాఫ్‌లో గొప్పగా చెప్పుకునే విధంగా ఈ చిత్రం నిలుస్తుంది. పాటలు, ఫైట్స్ విజువల్‌గా అద్భుతంగా వుంటాయి. సినిమా ఎప్పుడు స్టార్ట్ అయ్యిందో ఎప్పుడు ఎండ్ అయ్యిందో కూడా తెలీకుండా మైమరచిపోయే విధంగా వుంటుంది. చిరంజీవి మొదట్లో ఎలా చేశారో తేజు అలా చేశాడని అన్పించింది. మొత్తం నాలుగు పాటలున్నాయి. వాటిల్లో 'కళామందిర్' అనే పాటని భాస్కరభట్ల అద్భుతంగా రాశారు. ఈ పాటని కళామందిర్ షోరూమ్‌లో విడుదల చేశాం. దీంతో అన్ని పాటలు రిలీజ్ అయ్యాయి.

సత్యమూర్తి ప్రభావం ఎక్కువ

నేను కథలో పూర్తిగా ఇన్‌వాల్వ్ అవుతాను. అయితే నా సలహాలు దర్శకుడికి చెప్తాను తప్ప పూర్తిగా ఒత్తిడి చేయను. మా గురువుగారు, రైటర్ సత్యమూర్తిగారి ప్రభావం నాపై ఎక్కువ వుంది. డైరెక్షన్‌లో ఇన్‌వాల్వ్ కాకుండా నిర్మాతగా నా వంతు బాధ్యతని సక్రమంగా నిర్వర్తిస్తాను. అందర్నీ ఆలోచింపజేసే విధంగా ఓ కొత్త డైరెక్టర్‌తో 'భారతి' అనే సినిమా ప్లాన్ చేస్తున్నాను. అలాగే రానా హీరోగా శివ డైరెక్షన్‌లో నిర్మించే '1945' సినిమా దాదాపు ముగింపు దశలో వుంది. పది రోజుల పని మాత్రమే మిగిలి వుంది. ఇది పీరియాడికల్ మూవీ. బ్యూటిఫుల్ లవ్‌స్టోరి. ఆ రోజుల్లో లవ్‌స్టోరి ఎంత క్లారిటీతో వుండేదో చూపిస్తున్నాం. రానా చాలా గొప్పగా చేశాడు. త్వరలో ఆ సినిమా రిలీజ్ చేస్తాం. పిమ్మట వినాయక్‌తో మరో సినిమా వుంటుంది.

నక్సలైట్‌గా మారే అవకాశముంది

నిర్మాతగా నాకు రామానాయుడుగారు స్ఫూర్తి. ఆయన ప్రేరణతో ఇప్పటివరకు 70 సినిమాలు చేశాను. ఇదే ఎనర్జీతో ఓపికతో వంద సినిమాలు పూర్తి చేస్తాను. నిర్మాతగా ఎంత బిజీగా వున్నా అఖిలభారత చలనచిత్ర కార్మిక సమాఖ్య ప్రెసిడెంట్‌గా నా బాధ్యతలు నేను నిర్వర్తిస్తున్నాను. మార్చి 1న థియేటర్స్ బంద్ పిలుపు కొరకు నార్త్, సౌత్‌వారితో గట్టిగా మీటింగ్స్ జరుగుతున్నాయి. నిర్మాతల్ని, డిస్ట్రిబ్యూటర్స్‌ని దోచుకుంటున్నారు. అలా చేస్తే చివరకు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు నక్సలైట్స్‌గా మారే అవకాశం వుంది. అలా జరగకూడదని మార్చి 1న బంద్ ప్రకటించి తగు చర్యలు తీసుకోబోతున్నాం. అందరికీ ఇండస్ట్రీలో మేలు జరిగేలా న్యాయం చేస్తాం.

అందుకే నిర్మాతగా మారా

నాకు సాయిధరమ్ తేజ్ కంటే వరుణ్‌తో చాలా అటాచ్‌మెంట్ ఎక్కువ. అందుకే 'లోఫర్' చిత్రాన్ని భారీగా తీశాం. 'ఇంటిలిజెంట్' సినిమాకి వరుణ్ 'తొలిప్రేమ'కి ఎలాంటి పోటీకాదు. అలాగే అన్నయ్య మోహన్‌బాబు చాలా కష్టపడి 'గాయత్రి' సినిమా చేశారు. ఆ చిత్రం కూడా బాగా ఆడి మరిన్ని డబ్బులు రావాలని కోరుకుంటున్నా. వాళ్ళ ఫ్యామిలీ నుండే నేను ఇండస్ట్రీకి వచ్చాను.'గాయత్రి' చాలా పవర్‌ఫుల్ టైటిల్. ఆ గాయత్రి దేవి ఆశీస్సులతో సినిమా మంచి సక్సెస్ అవ్వాలి. అన్ని సినిమాలు బాగా ఆడాలి. అప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది. థియేటర్స్‌కి ఆడియన్స్ మరింత మంది వస్తారు.



సాయి కొర్రపాటి, గుణ్ణం గంగరాజు, కళ్యాణ్ దేవ్, చిరంజీవి, సెంథిల్, కీరవాణి, రాజమౌళి, మాళవిక నాయర్, రాకేశ్ శశి, బివిఎస్ఎన్ ప్రసాద్


వెండితెరపై చిరంజీవి అల్లుడు

చిరంజీవి అల్లుడు (శ్రీజ భర్త) కళ్యాణ్ దేవ్ వెండితెర ఆరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ వారాహి చలనచిత్రం నిర్మిస్తోంది. చిత్ర ప్రారంభోత్సవం పూజా కార్యక్రమాలతో బుధవారం సంస్థ కార్యాలయంలో జరిగింది. రాకేష్ శశి దర్శకత్వం వహించనున్నారు. 'ఎవడే సుబ్రమణ్యం' ఫేమ్ మాళవిక నాయర్ నాయికగా నటించనుంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి చిరంజీవి క్లాప్ కొట్టగా రాజమౌళి గౌరవ దర్శకత్వం వహించారు. ఎం.ఎం.కీరవాణి కెమెరా స్విచ్చాన్ చేశారు.

అనంతరం చిత్ర నిర్మాత సాయి కొర్రపాటి మాట్లాడుతూ.. "చిరంజీవిగారి అల్లుడైన కళ్యాణ్ దేవ్ పరిచయ చిత్రాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. రాకేష్ శశి తయారుచేసిన కాన్సెప్ట్‌ను ఎక్కడా రాజీపడకుండా భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కించనున్నాం. 'బాహుబలి' చిత్రానికి తన కెమెరా పనితనంతో జీవం పోసిన సెంథిల్ కుమార్ ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తించనుండగా.. 'రంగస్థలం' చిత్రంతో కళా దర్శకుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రామకృష్ణ ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేయనున్నారు. అతి త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్వీ ప్రసాద్, గుణ్ణం గంగరాజు, కళ్యాణ్ కోడూరి, అవసరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరాజయాలే గుణపాఠాలు

"నేను ఎదుర్కొన్న పరాజయాలే నాకు ఎక్కువ గుణపాఠాలు నేర్పాయి. అందులో ముఖ్యమైనది మొహమాటానికిపోయి సినిమాలు చేయకూడదు అని. అలా మొహమాటానికి సినిమాలు చేసే నా కెరీర్ పాడుచేసుకొన్నాను. భవిష్యత్‌లో అలాంటి తప్పులు పొరపాటున కూడా చేయనని" కథానాయకుడు నాగశౌర్య స్పష్టం చేశారు. స్వంతబేనర్ ఐరా క్రియేషన్‌లో నటించిన సినిమా 'ఛలో'. ఈ శుక్రవారమే విడుదలకాబోతుంది. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలను తెలియజేశారు.



నాగశౌర్య

హీరో కాకముందు ప్రేక్షకుడినే

ఇప్పుడంటే హీరో అయ్యాక నా అంచనా దెబ్బతిన్నది కానీ.. నిజానికి నేను మంచి ప్రేక్షకుడ్ని. ఈ కథ కూడా ప్రేక్షకుడిగానే విన్నాను, ఆడియన్స్‌కి నచ్చేలా డిజైన్ చేసుకొన్నా. మా అమ్మ కూడా నన్ను తెరపై ఎలా చూడాలనుకొంటుందో అలాగే డైరెక్టర్‌కి చెప్పి తీర్చిదిద్దింది.

కథలో రాజకుమారిలో..

నా కెరీర్‌లో నేను చేసిన పెద్ద తప్పిదాల్లో 'కథలో రాజకుమారి' ఒకటి. అసలు కథ వినకుండా కేవలం నారా రోహిత్ కోసం ఆ సినిమా చేయాల్సి వచ్చింది. సినిమా రిలీజయ్యాక చాలా బాధపడ్డాను. నేను ఎమోషనల్‌గా చేసిన మిస్టేక్స్‌లో అది ఒకటి.

చాలా మొండోడ్ని..

చిన్నప్పుడు తెగ అల్లరి చేసేవాడ్ని, ముఖ్యంగా స్టడీస్ విషయంలో మా అమ్మ నన్ను చితక్కొట్టేది. మొదట్లో భయపడినా.. తర్వాత అలవాటైపోయి అమ్మ కొడుతున్నప్పుడు పరిగెట్టడం మానేసి అక్కడే నిల్చోని ఉండేవాడ్ని. అడిగితే.. "ఎలాగో కొడతావు, పరిగెడితే ఇంకా కసిగా కొడతావు, అందుకే అలా నిల్చోవడం బెటర్" అని చెప్పేవాడ్ని. సినిమాలో నా పాత్ర కూడా అలాగే ఉంటుంది. అందుకే చాలా రియలిస్టిక్‌గా యాక్ట్ చేయగలిగాను.

ఐరా క్రియేషన్స్ మాది మాత్రమే కాదు..

"ఐరా క్రియేషన్స్" అనేది చెప్పుకోవడానికి మా స్వంత సంస్థ అయినప్పటికీ.. దానికి మెయిన్ పిల్లర్స్ మాత్రం మా బంధువులు బుజ్జి, శ్రీనివాసరెడ్డి. వారి అండతోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'ఛలో' చిత్రీకరణ పూర్తి చేయగలిగామ్. ఇక బ్యానర్ పేరు విషయానికి వస్తే.. మా అమ్మానాన్నలకి ఆడపిల్ల పుడితే 'ఐరా' అనే పేరు పెట్టాలనుకొన్నారు. సో! ఆ కోరిక ఈ బ్యానర్ రూపంలో తీరిందన్నమాట.

అనుకొన్న కథను ఎప్పుడూ తీయలేం

ఎంత పెద్ద దర్శకుడైనా, కొత్త దర్శకుడైనా తాను పేపర్ మీద రాసుకొన్న కథను ఉన్నది ఉన్నట్లుగా ఎప్పుడూ తెరపై చూపలేదు. అయితే అనుకొన్నదానికంటే అద్భుతంగా తెరకెక్కిస్తాడు, లేదంటే చెత్తగా అయినా తీస్తాడు. మా 'ఛలో' మేం అనుకొన్నదానికంటే బెటర్‌గా వచ్చింది. అందుకే రిలీజ్ రెండ్రోజుల్లో పెట్టుకొని కూడా చాలా హ్యాపీగా ఉన్నాం.

పాటల్లోంచి టైటిల్..

సినిమా షూటింగ్ అవుతూ ఉంది కానీ.. టైటిల్ ఏం పెట్టాలనే విషయంలో మా నాన్నగారితో రోజూ గొడవ అయ్యేది. ఇంకోవారంలో నేనేం చెప్పకపోతే 'బయల్దేరినాడే చిన్నోడు' అనే టైటిల్ ఫిక్స్ చేసేస్తా అన్నారు. దెబ్బకి భయపడి ఏదో ఒక టైటిల్ ఫిక్స్ చేద్దాం అనుకొంటున్న టైమ్‌లో రేడియోలో 'బ్రూస్ లీ' సినిమాలోని 'లే ఛలో' సాంగ్ విన్నాక వెంకీతో చెబితే 'ఛలో' అనే టైటిల్ ఫిక్స్ చేశాడు.

ఆ ప్రభావం కెరీర్‌పై పడేంది

ఇదివరకు నటించిన సినిమాల్లో ఏ అంశమైనా నచ్చకపోతే దర్శకులకు మామూలుగా చెప్పేవాడ్ని. కానీ సినిమా విడుదలయ్యాక ఆ ఎఫెక్ట్ నా కెరీర్ మీద పడేది. అందుకే నేను నా బ్యానర్‌లో చేస్తున్న 'ఛలో' సినిమాలో ప్రీప్రొడక్షన్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ప్రతి విషయంలో ఇన్వాల్వ్ అయ్యాను. ఇకపై కూడా నా భవిష్యత్ సినిమాల విషయంలో మొహమాటపడకుండా ఏ విషయమైనా నాకు నచ్చకపోతే దర్శకుడితో విబేధించడానికైనా రెడీ.

ఆ వార్తలో నిజంలేదు

గత కొన్ని రోజులుగా నిహారికతో పెళ్లంటూ వార్తలు విన్పిస్తున్నాయి. కొన్ని మాధ్యమాల్లో రాశారు. ఛలో ఆడియోవేడుకకు చిరంజీవి రావడం కూడా వార్తకు మరింత బలం చేకూరింది. అయితే ఇదంతా అబద్ధం. ఆ వార్తలో ఏమాత్రం నిజంలేదు. నాలుగేళ్ళలో ఇంట్లోవారు చూడబోయే అమ్మాయినే పెళ్లి చేసుకుంటా.

కొత్త చిత్రాలు

కెమెరామెన్ సాయిశ్రీరామ్‌తో రెండున్నరేళ్ల క్రితమే సినిమా అనుకొన్నామ్. కానీ కథ సెట్ అవ్వక సెట్స్ మీదకి రాలేదు. రీసెంట్‌గా స్టోరీ కుదిరింది. మార్చి నుంచి రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది. ఇది చక్కటి లవ్ స్టోరీ. నటుడిగా నాలోని సరికొత్త కోణం ఆ సినిమాతో బయటకొస్తుంది. ఆ తర్వాత కృష్ణవంశీగారి అసిస్టెంట్ శ్రీనివాస్ అనే కుర్రాడి దర్శకత్వంలో 'నర్తనశాల' అనే సినిమా చేస్తాం. ఇంకో రెండు కథలు చర్చల్లో ఉన్నాయి.

వాటి గురించే మాట్లాడుతున్నారు



అనుష్క

"నేను నటించిన భాగమతి పాత్రను బాగుందని అందరూ మెచ్చుకుంటున్నారు. కానీ అంతకంటే ఎక్కువగా కెమెరా విజువల్స్, థమన్ నేపథ్య సంగీతం, రవీందర్ ఆర్ట్ పనితనం చిత్రాన్ని మరో మెట్టు ఎక్కేలా చేశాయని మాట్లాడుకుంటున్నారని" నటి అనుష్క తెలియజేసింది. యువి క్రియేషన్స్ బేనర్‌పై అశోక్ దర్శకత్వంలో రూపొందిన 'భాగమతి' విజయసభ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సినిమా చేస్తున్నప్పుడే సెట్లో ప్రతివారిలో ఎక్సైట్‌మెంట్, ఒత్తిడిని గమనించాను. వారికంటే నా పని ఎక్కువగా చేయాలనే తపన పడ్డాను. విడుదల తర్వాత వస్తున్న ప్రశంసలతో అవన్నీ మర్చిపోయానని చెప్పారు. చిత్ర దర్శకుడు అశోక్ మాట్లాడుతూ.... 2012లో మొదలైన కథ ఇది. అప్పుడు తీసుకున్న నిర్ణయం కరెక్టే అనిపించింది. ఐదేళ్ళ క్రిందటి కథను నిర్మాతలు నమ్మినందుకు ముందుగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా కథను నమ్మి చేయగలననే ఆర్టిస్టు కూడా వుండాలి. ఆ గట్స్ తనకున్నాయని అనుష్క నిరూపించింది. ముందుగా ఆమెకు ధన్యవాదాలు. తన నటనలో కోపం, ఆవేశం, బాధ.. అన్ని కోణాలను ఎక్కువతక్కువ కాకుండా చేసింది. అమీర్‌పేట నుంచి అమెరికా వరకు అనుష్క ఈజ్ ది బెస్ట్ అంటున్నారు. తమిళనాడు, కేరళ, విదేశాల్లోనూ ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని చెప్పారు.

ఇక్కడ 10, అక్కడ 9



వరుణ్‌తేజ్, రాశీఖన్నా

సాయిధరమ్‌తేజ్ 'ఇంటిలిజెంట్', వరుణ్‌తేజ్ నటించిన 'తొలిప్రేమ' చిత్రాలు ఈనెల 9న విడుదల చేయాలని ఇరువురు నిర్మాతలు నిర్ణయించారు. అయితే ఒకేరోజున విడుదల చేస్తున్నారంటూ అభిమానుల్లోనూ బయట చర్చ జరుగుతోంది. దీంతో 'తొలిప్రేమ'ను ఒకరోజుకు వాయిదా వేశారు.

ఈ విషయాన్ని నైజాం డిస్ట్రిబ్యూటర్ దిల్‌రాజు విలేకరులతో మాట్లాడుతూ.... తెలుగు సినిమాల్లో హీరోలు ఎక్కువయ్యారు. ఒక్కో హీరో రెండు, మూడు సినిమాలు చేస్తున్నారు. 1980లో ఇలా వుండేది. ఇప్పుడు పోటీవల్ల వారానికి సినిమాలు ఎక్కువ విడుదలవుతున్నాయి. అందుకే పెద్ద హీరోల చిత్రాలు ఒకేరోజు విడుదల చేసే పరిస్థితి వచ్చింది. తొలిప్రేమ నిర్మాత ప్రసాద్‌గారిని సంప్రదించి 10వ తేదీన రిలీజ్ చేద్దామని నిర్ణయించుకున్నాం. ఇదే విషయాన్ని సి.కళ్యాణ్‌కు చెప్పాం. మెగా అభిమానులందరికీ ఒకేరోజు రెండు సినిమాలు కన్‌ఫ్యూజ్ లేకుండా వుండాలని అనుకున్నాం. అత్తారింటికి దారేది, డార్లింగ్‌లాగా.. ప్రసాద్‌గారి బేనర్‌లో బెస్ట్ సినిమా అవుతుంది. నేను డిస్ట్రిబ్యూటర్‌గా పాలుపంచుకోవడం ఆనందంగా వుంది. అయితే ఓవర్‌సీస్‌లో మాత్రం 9నే విడుదలవుతుంది అని చెప్పారు.

'హౌరా బ్రిడ్జ్' గీతాలు

రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరీ, మనాలీ రాథోడ్ హీరో హీరోయిన్లుగా రేవన్ యాదు దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'హౌరా బ్రిడ్జ్'. శేఖర్ చంద్ర సంగీతం అందించిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మినిస్టర్ పత్తిపాటి పుల్లారావు, నారా రోహిత్, రాహుల్ రవీంద్రన్, నిఖిల్, సాయికార్తీక్, శేఖర్ చంద్ర, ప్రతాని రామకృష్ణ గౌడ్, చాందిని చౌదరి, జె.ఎస్.రాజు, నవీన్ చంద్ర, రాజా రవీంద్ర, అశ్విన్‌కుమార్ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. ఆడియో సీడీలను నారా రోహిత్ విడుదల చేసి మినిస్టర్ పత్తిపాటి పుల్లారావుకి అందించారు.

నారా రోహిత్ మాట్లాడుతూ.. ఈనెల3న విడుదలవుతున్న ఈ సినిమా మంచి సక్సెస్‌ను సాధించాలి. శేఖర్ చంద్ర మ్యూజిక్ బావుంది. చరణ్‌గారికి నిర్మాతగా తొలి చిత్రమిది. సినిమా పెద్ద సక్సెస్‌ను అందుకోవాలని కోరారు. చాందిని చౌదరి మాట్లాడుతూ... నటిగా చాలా విషయాలను నేర్చుకున్నాను. రాహుల్ రూపంలో నాకు ఈ సినిమాతో మంచి స్నేహితుడు దొరికాడు. నిజాయితీగా నటిస్తాడు. తనతో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. మనాలి రాథోడ్ చక్కగా నటించింది. మంచి ప్రేమకథ. శేఖర్ చంద్ర మంచి మ్యూజిక్ ఇచ్చారు. పాటలు చాలా క్యాచీగా ఉన్నాయని అన్నారు.

హీరో రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ – "సినిమా బాగా వచ్చింది. దర్శకుడు హుందా అయిన క్యారెక్టర్‌ను డిజైన్ చేసి ఇచ్చారు. విజయ్ మిశ్రా విజులవ్‌గా తెరకెక్కించారు. శేఖర్ ఎక్స్‌ట్రార్డినరీ ట్యూన్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. ఇదొక లవ్‌లీ అనుభవమున్న జర్నీ" అన్నారు.



రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరీ

మళ్లీ.. మళ్లీ చూసేలా అనిపిస్తోంది..

నిఖిల్ సిద్దార్థ్ హీరోగా ఎ టివి సమర్పణలో ఎ కె ఎంటర్టైన్మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మించిన చిత్రం 'కిర్రాక్ పార్టీ'. నిర్మాత రామ బ్రాహ్మమ్ సుంకర కాగా, దర్శకుడు శరన్ కొప్పిశెట్టి. నిఖిల్‌కు జంటగా సిమ్రాన్ పరీన్జా, సంయుక్త హెగ్డే నటిస్తున్నారు ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం సాయంత్రం ప్రసాద్ ల్యాబ్‌లో దర్శకుడు తేజ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిర్మాత అనిల్ సుంకర బ్యానర్లో సినిమా చేస్తున్నా... అందుకే రావడం జరిగింది.. ఇక టీజర్ అయితే మళ్లీ.. మళ్లీ చూసేలా అనిపిస్తోంది.. నిఖిల్‌కు స్నేహితులుగా నటించిన వారందరూ చాలా న్యాచురల్‌గా ఫ్రెష్‌గా ఉన్నారు.. తప్పకుండా సినిమా బాగుంటుందని ఆసిస్తూ.. అందరికీ మంచి పేరు తెచ్చేలా ఉంటుందని భావిస్తూ శుభాకాంక్షలు తెలియచేస్తున్నా అన్నారు.. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ... టీం అంతా చాలా అనుభవం ఉన్నవాళ్ళలా చేశారు. చాలా బాగొచ్చింది.. కాలేజ్ డ్రాప్ లో వచ్చిన సినిమాల్లోనే బెస్ట్ ఫిల్మ్‌గా నిలుస్తుందని మాత్రం ఖచ్చితంగా చెప్పగలనని చెప్పారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ... 'హ్యాపీ డేస్' సినిమాతో ఇలానే కొత్తవారితో కలసి పనిచేశా. అదే ఫీల్ ఇప్పుడు ఈ కిర్రాక్ పార్టీ చిత్రంతో కలుగుతోంది. చాలా ప్రత్యేకమైన సినిమా నాకు.. తప్పకుండా అందరికీ నచ్చే సినిమా అవుతుంది. దర్శకుడు శరన్ మాట్లాడుతూ... కన్నడలో బిగ్గెస్ట్ ఫిల్మ్ కిర్రిక్ పార్టీ... ఆ ఫ్లావర్ పోకుండా తెలుగు నేటివిటీకి తగ్గట్టు చిత్రీ కరించామని తెలిపారు.




అనిల్‌సుంకర, తేజ, సిమ్రాన్, నిఖిల్, సంయుక్త, శరన్ కొప్పిశెట్టి తదితరులు

www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.



అదరహో.. కన్యాశుల్కం!

తెలుగు నాటకరంగ చరిత్రలో 'కన్యాశుల్కం' నాటకానికున్న ప్రత్యేక వేరు. తెలుగు నాటకానికి వందల ఏళ్ళ చరిత్ర ఉంది అని చెప్పడానికి ఇంతకంటే ఏ రుజువూ అక్కరలేదు. 125 ఏళ్ళ క్రితమే గురజాడ.. నాటి సమాజపు పెడ ధోరణుల జాడను ఒడిసిపట్టి.. అదరక, బెదరక అన్నట్టు అప్పటి సామాజిక దురాచారంపై కత్తికట్టి.. కలంపట్టి రాసిన 'కన్యాశుల్కం' రచన అప్పడే కాదు.. ఇప్పటికీ ఓ సంచలనమే! కాలం మారుతున్నా.. సమాజంలో ఏమాత్రం మారని తీరును ఈ నాటకం ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంది. కథనం పాతకాలపు ముచ్చటగా తోచినా గానీ.. అన్ని కాలాల్లోనూ కొత్తగా.. మారురూపంలో సమాజంలో తిష్టవేసిన అనేక చేష్టల్ని, మనుషుల స్వభావాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దుయ్యబడుతూనే ఉంది. ఎప్పుడో స్వాతంత్ర్యం రాకపూర్వం పుట్టిన ఈ నాటకం.. ఇప్పటి జనాలకు నచ్చుతుందా? అని నొసలు చిట్లించిన వారి సందేహాలను పటాపంచలు చేస్తూ మరోసారి 'కన్యాశుల్కం' నాటకం అశేషమైన ప్రేక్షకుల సాక్షిగా విటేఅణదరణ పొందింది.



నాటక దర్శకుడు శొంఠినేని కిషోర్‌ని సత్కరిస్తున్న సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు

సాధారణంగా విజయవాడలోని పిబి సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలోఉన్న ప్రత్యేక థియేటర్లోనే నాటక ప్రదర్శనలు జరుపుతుంటారు. కానీ, కన్యాశుల్కం నాటకంపై నిర్వాహకులకు ఉన్న అంచనాల కారణంగా వేలాది జనాలు చూసేవిధంగా ఆరుబయట ఉన్న ఆడిటోరియంలో నాటక ప్రదర్శనకు తగిన ఏర్పాట్లు చేశారు. వారి అంచనా తప్పు కాలేదు. సాయంత్రం 5.30 గంటలకు ప్రదర్శన అని ప్రకటిస్తే.. సరిగ్గా ఐదు గంటలకే ప్రేక్షకులు తండోపతండాలుగా రావడం మొదలైంది. సరిగ్గా 6.15 నిమిషాలకు నాటకం మొదలయ్యే సమయానికి వేలాదిమంది ప్రేక్షకులతో ప్రాంగణం కళకళలాడింది. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, విజయవాడ నిర్వహణలో విజయనగరానికి చెందిన నవయువ ఆర్ట్సువారు ఈ నాటకాన్ని ప్రదర్శించారు.

ఎప్పుడు చూసినా.. ఎడ్యుకేషనే!

కన్యాశుల్యంలోని కీలక పాత్రధారి గిరీశం 'నాతో మాట్లాడ్డమే ఓ ఎడ్యుకేషన్' అంటాడు. ఈ నాటకమూ అలాంటిదే. 125 ఏళ్ల క్రితం రాసిన ఈ నాటకం నేటితరానికి కొత్తగా.. సరికొత్తగా.. ప్రదర్శించిన ప్రతిసారీ.. సమాజానికి అంతో ఇంతో జ్ఞానాన్ని బోధిస్తూనే ఉంది. ప్రేక్షక జనాలపై అనేక కొత్త ప్రశ్నలు గుప్పిస్తూనే ఉంది. ఇక తాజా ప్రదర్శన విషయానికి వస్తే గతంలో ఈ నాటక సమాజం వారే 38 సీన్లతో ఎనిమిది గంటల నిడివితో సుదీర్ఘ ప్రదర్శనగా రాష్ట్రంలోని ముఖ్య పట్టణాల్లో ఏడెనిమిది ప్రదర్శనలు నిర్వహించారు.

ఇప్పుడు తిరిగి మూడు గంటల నాటకంగా కుదించి 16 సీన్లతో ప్రదర్శించారు. ఈరోజుల్లో మూడు గంటల పాటు ఓపిగ్గా ఓ నాటకం చూడ్డం అంటే నమ్మశక్యం కాని విషయం. కానీ, ఆరంభం నుంచీ నాటకం పూర్తయ్యేవరకూ ప్రేక్షకులు తమ సీట్లలోంచి కదల్లేదు. అంతగా నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. చెప్పుకోదగ్గ విషయమేమంటే.. నాటకం చూడ్డానికి నిన్నటితరం వారితోపాటు నేటితరం మహిళలు, కళాశాల, పాఠశాల విద్యార్థులూ పెద్ద సంఖ్యలో రావడం విశేషం.

గిరీశం, మధురవాణి, రామప్పంతులు, లుబ్ధావధానులు, పూటకూళ్ళమ్మ, బుచ్చమ్మ, అగ్నిహెూత్రావధాని, కరకటశాస్త్రి.. ఇలా నాటకంలోని వివిధ పాత్రలు పోషించిన నటీనటులందరూ పాత్రోచితమైన నటనతో ఆకట్టుకున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు కలిపి సుమారు 35 మంది ఈ నాటకం కోసం పనిచేశారు.



కన్యాశుల్కం నాటకంలో ఒక సన్నివేశం

కన్యాశుల్కం నాటకం సామాజిక దురాచారాన్ని ఎండగట్టిన తొలి నాటకంగానే కాకుండా తెలుగునాట వాడుకభాషలో వచ్చిన తొలి తెలుగు నాటకమూ ఇదే. తాజా ప్రదర్శనలలోనూ గురజాడ రాసిన సంభాషణలకు కత్తెర వేయకుండా.. యధాతథంగా ప్రదర్శించారు. ఆయా సంభాషణలకు అడుగడుగునా ప్రేక్షకుల నుంచి చప్పట్ల రూపంలో విశేష స్పందన లభించింది. నాటకం ప్రదర్శనకు అవసరమయ్యే మౌలిక ఏర్పాట్లతోపాటు వేదికకు దూరంగా కూర్చున్నవారి కోసం వేదికకు రెండువైపులా ఎల్‌సిడి స్క్రీన్లను నిర్వాహకులు ఏర్పాటు చేయడం బావుంది. నాటకం, సాంస్కృతిక కళల్ని ప్రోత్సహించే నెలవారీ కార్యక్రమంలో భాగంగా సిద్ధార్థ కళాపీఠం నిర్వహణలో ఈ నాటకం ప్రదర్శించారు. సిద్ధార్థ అకాడమీ సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు కళాకారుల్ని సత్కరించగా, ఖందాపు మన్మధరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. తరాలనాటి ఒక మంచి సందేశాత్మక నాటకం నేటితరానికి అందించే ప్రయత్నం చేసిన నిర్వాహకులు అభినందనీయులు.

- గంగాధర్ వీర్ల

వల్లూరు శివప్రసాద్ 25 నాటికలు

సాహిత్యరంగంలో నాటక రచనకున్న ప్రత్యేకత వేరు. నాటిక లేదా నాటకం అంటే సర్వ కళల సమాహారమైన ఓ రూపకకళ. అలా తెలుగునాట నాటక రచన సామూహిక ప్రదర్శనకళగా తరాలుగా జనరంజకమవుతూనే ఉంది. ఎప్పటికప్పుడు సమాజాన్ని దర్శిస్తుంది. అంతకుమించి ప్రశ్నిస్తుంది. అసలు నాటకానికున్న సిసలైన గుణమే ప్రశ్నించడం. సమాజంలోని విషజాఢ్యాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ.. ఆలోచింపజేస్తూ జనచైతన్యానికి వారధికట్టే కళారూపమే నాటకం. అలాంటి నాటక రచనలతో తెలుగునాటక రంగాన తనదైన ముద్రవేసిన రచయితల్లో వల్లూరు శివప్రసాద్ ఒకరు. ఒకటికాదు.. రెండు కాదు.. ఏకంగా పాతిక నాటికలు రాయడం అంటే.. ఎంతో కృషి జరిగితేగానీ అది సాధ్యంకాదు. రాసిన ప్రతి నాటిక రచనా నంది, ఇతర పోటీ నాటిక, నాటక పరిషత్తుల్లో ఉత్తమమైన బహుమతులు తెచ్చుకున్నవే. అంతేకాదు, ఆయా నాటక రచనల్ని ఆసరా చేసుకున్న కళాకారులు, సమాజాలకూ ఎంతో ఖ్యాతిని అందించాయి. ఒక నాటక రచయిత రాసిన పాతిక నాటికలు.. ఒక సంపుటిగా రావడం, తీసుకురావడం బహుశా ఇదే తొలిసారి కావొచ్చు. వల్లూరి రాసిన 25 నాటికల సంపుటిని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, కృష్ణా జిల్లాశాఖ నిర్వహణలో ఫిబ్రవరి 6న విజయవాడ, ఘంటసాల సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాటక, కథారచయిత, అరసం రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివప్రసాద్‌తో 'సంగమం' స్పెషల్ చిట్‌చాట్.



'స్వర్గానికి వంతెన' నాటికలో ఒక దృశ్యం

సాహిత్యంలో ప్రేరణ ఎవరు?

మా ఊరి శాఖా గ్రంథాలయ అధికారిగా నాన్న పనిచేసేవారు. రోజూ నాన్న వెంట గ్రంథాలయానికి వెళ్ళేవాణ్ణి. 'చందమామ, బాలమిత్ర' వంటి పిల్లల పుస్తకాలు చదవడంతో నా సాహిత్య అభిలాష మొదలైంది. ఆ చిన్న వయసులోనే లైబ్రరీలో ఉన్న శరత్ రాసిన 'దేవదాసు' వంటి పలు నవలలు చదివాను. అలా నాన్న వల్లే సాహిత్యంతో అనుబంధం ఏర్పడింది.

రచయితగా నాంది ఎలా?

స్కూళ్ళకు సెలవొచ్చినప్పుడు బంధువుల పిల్లలమంతా.. కలుసుకోవడం, ఆటలతోపాటు కథలు చెప్పుకోవడం చేసేవాళ్ళం. కథలు చెప్పడంలో నేను మిగతావారి దృష్టిలో పడేవాడ్ని. పుస్తకాల్లో చదివిన వాటితోపాటు ఊహాత్మకంగా మరికొన్ని విషయాలు జోడించి.. పాత్రలు సృష్టించి.. కథలు అల్లి చెప్పేవాణ్ణి. దాన్ని నా సీనియర్లు, ఇంట్లో మా అక్క గమనించి– 'బావుంది. కథలు రాయి!' అని ప్రోత్సహించేవారు. అలా కథ అనేది రాయొచ్చు.. అనేది స్కూలు స్థాయిలో బీజం పడింది. పదో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు కథలు రాయడం ప్రారంభమైంది. మా స్కూలు వార్షికోత్సవం కోసం తొలిసారి 'ఎడారి బతుకు' అనే నాటికను రాసి, ప్రదర్శించాం.


కథా రచయితగా ప్రయాణం?

కాలేజీ చదువు పూర్తయ్యాక 1976లో నిరుద్యోగ సమస్యపై 'సశేషం' అనే కథ రాశాను. అది అప్పటి 'చక్రవర్తి' మాసపత్రికలో బహుమతి పొందింది. అలా పత్రికలో నా కథల ప్రయాణం మొదలై.. ఇప్పటిదాకా దాదాపు తెలుగు పత్రికలు అన్నింటిలో సుమారు డెబ్బై, డెబ్బై ఐదు కథలు రాశాను. 'తాజ్‌మహల్, కురిసిన మబ్బు, ముందే మేలుకో, నాగేటిచాలు' పేర్లతో కథాసంపుటాలు వచ్చాయి. సుమారు ముప్పయి, ముప్పై అయిదు కథలు హిందీలోకి అనువాదం అయ్యాయి. పిల్లలకోసమూ పలు కథలు రాశాను. అవన్నీ 'ఏకాగ్రత' అనే పేరుతో కథ సంపుటిగా వచ్చాయి. 'రేపటి పౌరులు' అనే పేరుతో ఓ నవల రాశాను. విశాలాంధ్ర వారు 'తెలుగు కథ, కథాసాగర్, తెలుగు కథాపారిజాతాలు, కథ–2011, రైతుకథ, సీనియర్ సిటిజన్ కథలు, కథావరణం, గుంటూరు కథ, మన ఆరోగ్య కథానికలు' వంటి పలు సంకలనాల్లో నేను రాసిన కథలు ప్రచురించారు.

నాటక రచన ప్రస్థానం?

ఉద్యోగంలో చేరి.. కాస్తంత వెసులుబాటు వచ్చాక మళ్ళీ నాటకం రచనవైపు దృష్టి సారించా. గంగోత్రి నాటక సమాజం కోసం 'యద్భవిష్యం' నాటిక రాశా. అలా రెండోదఫా.. నాటక రచన వేగం పుంజుకుంది. ఇప్పటిదాకా ఐదు నాటకాలు, సుమారు పాతిక నాటికలు రాశాను. వాటితోపాటు కొన్ని రేడియో నాటికలు రాశాను. 'శ్రీచక్రం, హింసధ్వని, భూమిపుత్రుడు, మిస్డ్‌కాల్, శ్రీముఖ వ్యాఘ్రం, ఏరువాక సాగాలి, ధ్వంసరచన, మనిషితనం, క్షతగాత్రగానం, వానప్రస్థం, రంకె, ఆగ్రహం, స్వర్గానికి వంతెన' వంటి పలు నాటక రచనలు ప్రజల్లోకి బాగా వెళ్ళాయి. నంది, అనేక పరిషత్ పోటీల్లో బహుమతులు తెచ్చిపెట్టాయి.

- అంజుశ్రీ



అరసం.. వారధిగా

నూరేళ్ళ నాటకరంగ చరిత్రలో వచ్చిన విలువైన 108 నాటికలతో ప్రసిద్ధి తెలుగు నాటికలు, ప్రసిద్ధి హాస్య నాటికలు పేరుతో స్వీయ సంపాదకత్వంలో సంకలనాలు తీసుకొచ్చాం. అరసం తరపున కొడవటిగంటి, మధురాంతకం, చాసో, పెద్దిభొట్ల, కేతు విశ్వనాథరెడ్డి, పి.సత్యవతి, అల్లం రాజయ్య, కొలకలూరి, ఓల్గా వంటి ప్రసిద్ధ కథకుల సాహిత్యాన్ని ఈ తరం చదివేందుకు వీలుగా సంకలనాలు అందుబాటులోకి తెచ్చాం.

రచయిత కాలంతో నడిచే వ్యక్తి. సమాజాన్ని దర్శించే వ్యక్తి. ఇంకా చాలా రాయాలి. ఏ రచయిత రాసిన రచనలు అయినా ప్రజలకు చేరాలంటే సరైన వారధి దొరకాలి. అలా నా నాటక రచనలకు తగిన రూపకాలుగా మలచి, ప్రదర్శించిన గంగోత్రి నాయుడు గోపి, అరవింద్ సాయి వంటి వారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు.



- వల్లూరి శివప్రసాద్

ఫోన్ : 9291530714

సినిమా అంటే వివాదమా?

హైదరాబాద్ నుంచి బస్సులో గుంటూరు వస్తూ, మంగళగిరి చేరేసరికి అర్ధరాత్రి పన్నెండైంది. ఆ సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉండాల్సింది పోయి, జనంతో కళకళలాడుతున్నాయి. రోడ్డు డివైడర్లపై పది, పదిహేను ఏళ్ల వయస్సున్న కుర్రాళ్ళు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎవరన్నా పెద్దవాళ్ళు పోయారేమో అనే అనుమానం వచ్చింది. కానీ, డ్రైవర్ చెప్పిన సమాధానం వేరేలా ఉంది. వాళ్ళ అభిమాన హీరో సినిమా ఆ రోజే విడుదలైందట! రోజుకు ఏడు ఆటలు వేస్తున్నారట! షో కోసం వారు వేచి ఉన్నారట! రెండు గంటల సినిమా కోసం తెల్లార్లూ మేల్కొని అటు డబ్బు, ఇటు ఆరోగ్యం చెడగొట్టుకుంటున్న యువకుల్ని చూసి నవ్వాలో, ఏడవాలో, జాలిపడాలో అర్థంకాలేదు. ప్రభుత్వం కూడా అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా రోజుకు ఏడు ఆటలు అనుమతి ఇవ్వడమంటే యువత పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుంది. కర్నాటక వంటి కొన్ని రాష్ట్రాల్లో రెండో ఆట కూడా తొమ్మిదింటికల్లా ముగించాలనే నియమం వల్ల అర్ధరాత్రి వరకూ మేల్కొని, ఆరోగ్యాలు పాడు చేసుకోనక్కర్లేదు. ఇప్పుడొచ్చే సినిమాల్లో అన్నీ పెడ ధోరణులు, యువతను వక్రమార్గంలో రెచ్చగొట్టే సన్నివేశాలే! అటువంటి ఆలోచనలతో అర్ధరాత్రి నడిరోడ్డు మీద జరగరాని సంఘటనలు జరిగితే ఎవరు బాధ్యులు? ప్రభుత్వాలు కూడా తమ రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అనుమతులివ్వడం దిగజారుడుతనానికి నిదర్శనం.

ఒకప్పుడు రాజకీయాలు, కులాలు, మతాలు మాత్రమే మనుషుల్ని వర్గాలుగా విడగొట్టాయి. ఇప్పుడు సినిమాలు కూడా ఆ కోవలోకే వస్తున్నాయి. సినిమా హీరోల్ని కథానాయకులుగా కాకుండా తమ కులాన్ని, జాతిని ఉద్ధరించే నాయకులుగా చూస్తూ, ఒకరిపై ఒకరు దాడులకు దిగే స్థాయికి దిగజారుతున్నారు. ఇద్దరు తెలుగు నటుల అభిమానులు ఇటీవల కోనసీమ గ్రామాల్లో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవటమే ఇందుకు నిదర్శనం.

ఒకప్పుడు పండగలకు పదిమంది హీరోల పది సినిమాలు పది సినిమాహాళ్లల్లో విడుదలయ్యేవి. బాగున్నా బాగోకపోయినా పండగ కాబట్టి ఎవరికిష్టమైన సినిమా వాళ్ళు చూసేవాళ్ళు. బతుకు బతికించు అనే ఇటువంటి విధానం వల్ల నటీనటుల మధ్య సామరస్య వాతావరణమే కాకుండా సినిమా హాళ్ళల్లో పల్లీలు అమ్ముకునే వారి దగ్గర్నుంచి, సినిమా హాళ్ళ యజమానుల వరకూ, లైట్‌బాయ్ దగ్గర్నుంచి నిర్మాత వరకూ అందరూ హాయిగా ఉండేవాళ్ళు. కానీ, ఇప్పుడు పండగొచ్చినా పబ్బమొచ్చినా ఒక్క హీరో సినిమా మాత్రమే ఊళ్ళోని అన్ని సినిమా హాళ్ళల్లో విడుదలవుతోంది. ఒకరిద్దరు సినీ పెద్దల చేతుల్లోకి హాళ్ళ



వెళ్ళిపోవడం వల్ల, వారి కుటుంబసభ్యుల చిత్రాల ప్రదర్శనకు మాత్రమే అవకాశం ఉంటోంది కానీ, ఇతర నిర్మాతల, హీరోల చిత్రాలు ఎంత బాగున్నా.. సినిమాహాళ్ళు దొరకక విడుదలలో జాప్యమేర్పడి, నష్టాలకు గురవుతున్నాయి.

సినిమాకు లేని ఆదరణ కలిగించటానికి, ఏదో ఒక వివాదాన్ని సృష్టించటం పరిపాటిగా మారిపోయింది. ఈ వివాదాలకు ఆజ్యం పోసి, రోజుల తరబడి పనికిమాలిన చర్చలతో ప్రజల విలువైన సమయాన్ని హరించటానికి టీవి ఛానళ్ళు ఉండనే ఉన్నాయి. ఆడియో ఫంక్షన్లలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసి అభిమానులను రెచ్చగొట్టడం పరిపాటిగా మారిపోయింది. సినిమా అభిమానుల్లో నూటికి తొంభై మంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి యువకులే ఎక్కువ. స్పెషల్ షోలు, బెనిఫిట్ షోలు అంటూ రకరకాల పేర్లతో ఒక్కో టిక్కెటే రూ.500 నుంచి, రూ.1000 వరకు పెంచి, వీరి జేబులు గుల్ల చేస్తున్నారు.

ఒకప్పుడు సినిమాలను, సినిమా వాళ్ళను రాజకీయ నాయకులు పట్టించుకునేవారు కాదు. ఎందుకంటే ప్రజల్లో సినిమా వారికంటే నిస్వార్థంగా పనిచేసే రాజకీయ నాయకులంటే విలువ ఎక్కువ ఉండేది. క్రమేణా రాజకీయాల్లో స్వార్థం, అవినీతి, రౌడీయిజం పెరిగిపోవటంతో వారికి విలువ తగ్గిపోవడంతో, ఇప్పుడు రాజకీయ నాయకులు సైతం సినిమావారి మద్దతు కోసం పాకులాడుతున్నారు. కొత్త సినిమా విడుదలైతే, ఆ హీరోకు మద్దతు తెలుపుతూ రాజకీయ నాయకుల పేరుతో ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఇటువంటి పరిణామాల వల్ల సినిమా హీరోలు కూడా ఏదో ఒక కులానికో, రాజకీయపార్టీకో తలొగ్గాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ ప్రభావం అభిమానుల మీదా పడి, వారూ వర్గాలుగా విడిపోయి, ఒకరి మీద ఒకరు కాలు దువ్వుతున్నారు.

ఒకప్పుడు సినిమాని ఒక సాంకేతిక విద్యగా భావించి, దానిని అభ్యసించాలని దాదాఫాల్కే లాంటి వాళ్ళు పాశ్చాత్య దేశాలకు వెళ్ళి, నేర్చుకుని మన వారికి దాన్ని పరిచయం చేశారు. తదనంతరం సినిమాలను ఒక కళగా భావించి ఎన్నో కళాత్మకమైన చిత్రాలను అందించారు ఎందరో దర్శకులు. సినిమా ద్వారా మన సంస్కృతి యొక్క గొప్పదనాన్ని తెలియజెప్పారు ఇంకొందరు. ఇంకొక అడుగు ముందుకేసి, సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపారు మరి కొంతమంది అభ్యుదయ దర్శకులు. ఇప్పుడు సినిమాల ధోరణి పూర్తిగా మారిపోయింది.

సమాజానికి మంచి చెయ్యకపోయినా ఫర్వాలేదు కానీ, చెడు మాత్రం చేయకూడదన్న కనీసధర్మాన్నీ సినిమా వాళ్ళు ఆలోచించకపోవడం దురదృష్టకరం. సినిమాల కులపిచ్చి ఎంతగా పెరిగిపోయిందంటే, విదేశాల్లో సైతం కులాల వారీగా విడిపోయి, సినిమా హీరోలకు మద్దతు తెలియచేయడమే దీనికి ఉదాహరణ. సినిమాల్లో కొన్ని కులాల్ని కించపరుస్తూ హీరోలు పలికే డైలాగులు, విన్యాసాలూ వీరిని ఆ కులాలకు దూరం చేస్తున్నాయి. సినిమాని సినిమాగా చూడకుండా, కులం రంగులోంచి చూడటం వల్లా ఇటువంటి పరిణామాలు ఏర్పడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచిన 'పద్మావత్', 'జీఎస్‌టి' సినిమాలే దీనికి ఉదాహరణ. అభిమానాన్ని తమ స్వార్థానికి వాడుకునే సినీ రాజకీయ నాయకుల చెర నుంచి బయటపడటానికి నేటి యువతరాన్ని మేల్కొలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డాక్టర్ ఈదర శ్రీనివాసరెడ్డి

SPORTS ఆటలు

చరిత్ర తిరగరాస్తారా?

నేడు దక్షిణాఫ్రికాతో తొలి వన్డే

మధ్యాహ్నం 4.30 గం॥ల నుండి



టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి

టెస్ట్ సిరీస్‌ను 1-2తో కోల్పోయిన టీమిండియా... వన్డే సిరీస్ తప్పక గెలవాలనే పట్టుదలగా ఉంది. జోహన్స్‌బర్గ్‌లో జరిగిన మూడో టెస్ట్‌మ్యాచ్ గెలిచి సఫారీ జట్టుపై భారతజట్టు పైచేయి సాధించిందనడంలో ఎటువంటి సందేహం లేదు. అయినా టెస్ట్‌లు వేరు... వన్డేలు వేరు... వన్డేల పరంగా చూసుకుంటే ప్రస్తుతం దక్షిణాఫ్రికా కంటే భారతజట్టే పటిష్టంగా ఉంది.

దర్బన్: భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలివన్డే బుధవారం నాడిక్కడ జరగనుంది. దక్షిణాఫ్రికా గడ్డపై టెస్ట్ సిరీసే కాదు.. వన్డే సిరీస్ కూడా టీమిండియాకు తీరని కలగానే మిగిలిపోయింది. 25 ఏళ్ళల్లో ఒక్కసారి కూడా సిరీస్ విజయం సాధించలేదు. ఎప్పుడు సఫారీ పర్యటనకు వెళ్లినా ఖాళీ చేతులతోనే తిరిగొస్తోంది. తొలి వన్డే జరిగే దర్బన్ వేదికలో టీమిండియా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా గెలుపొందలేదు. 1992 నుంచి దర్బన్ మైదానంలో సౌతాఫ్రికాతో ఏడు వన్డేలు ఆడిన టీమిండియా ఆరింట్లో ఓడింది.. ఒకదాంట్లో ఫలితం తేలలేదు. టెస్ట్ సిరీస్ కోల్పోయినా.. అత్యంత క్లిష్టమైన వాండరర్స్ పిచ్‌పై మూడో టెస్ట్ గెలిచి ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమిండియా.. విజయంతో వన్డే సిరీస్ మొదలుపెట్టాలని చూస్తున్నది. దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్ డివిలియర్స్ గాయం కారణంగా తొలి మూడు మ్యాచ్‌లకు దూరం కావడం టీమిండియాకు ఊరట కలిగించే విషయం.

2016 జనవరి నుంచి సొంతగడ్డపై మొత్తం 19 వన్డేలు ఆడిన దక్షిణాఫ్రికాజట్టు 17 మ్యాచ్‌లలో గెలిచి, కేవలం రెండింట్లోనే ఓడింది. సఫారీలు చివరిసారి 2016, ఫిబ్రవరి 6న ఇంగ్లండ్ చేతిలో సొంతగడ్డపై ఓడిపోయారు. ఇటుటీమిండియా కూడా వరుసగా 8 వన్డే సిరీస్‌లు గెలిచి మంచి ఊపు మీదున్నా.. కోహ్లి సేన ఎలా ఎదుర్కో బోతున్నదన్నది ఆసక్తికరంగా మారింది.

దక్షిణాఫ్రికా వన్డేల్లో టీమిండియా ప్రదర్శన...

1992-93లో	5-2	(పరాజయం)
2006-07లో	4-0	(,,)
2010-11లో	3-2	(,,)
2013-14లో	2-0	(,,)

1996, 2001లలో రెండుసార్లు ట్రై సిరీస్‌లలోనూ ఇండియా ఆడింది. ఆ సిరీస్‌లలో జింబాబ్వే, కెన్యాలపై గెలిచినా... ఆ ట్రై సిరీస్‌లనూ సఫారీ జట్టే గెలుచుకుంది. 25 ఏళ్లలో సౌతాఫ్రికా గడ్డపై ఇరుజట్లమధ్య 28 వన్డేలు జరగగా.. 21 మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికా జట్టే గెలిచింది.



దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసెస్

ఫైనల్‌కు చేరిన కేరళ మహిళా జట్టు

ఉత్కంఠగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు



కేరళ ఎలక్ట్రిసిటీ, కర్నాటక జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం

ప్రజాశక్తి-కార్పొరేషన్(గుంటూరు)

మారెళ్ల కైలాష్‌నాథ్‌రెడ్డి మెమోరియల్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో మహిళల విభాగంలో కేరళ జట్టు ఫైనల్ కు చేరుకుంది. బుధవారం జరిగిన సెమిఫైనల్ మహిళల తొలి మ్యాచ్‌లో కేరళ ఎలక్ట్రిసిటి బోర్డు, కర్నాటక స్టేట్ జట్టుపై విజయకేతనం ఎగురవేసింది. 25-16, 25-14, 26-24 పాయింట్ల తేడాతో కేరళ ఎలక్రిస్టిటీ జట్టు గెలిచింది. అనంతరం జెప్పియర్, చెన్నై, కేరళ పోలీస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ పోలీస్ జట్టు వరుస సెట్లలో 19-25, 22-25, 18-25 పాయింట్ల తేడాతో జెప్పియర్, చెన్నై జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగంలో సిఆర్‌పిఎఫ్, ఢిల్లీ, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డు జట్లు తలపడ్డాయి. తొలుత క్రీడాకారులను గుంటూరు తహశీల్దార్ ఎం.నాగిరెడ్డి, మాస్టర్ అథ్లెట్ గింజుపల్లి శివరామకృష్ణలు, రెండో మ్యాచ్‌ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మద్దాలి గిరధర్ ప్రారంభించారు.

సింధూ, సైనా విజయం

న్యూఢిల్లీ : డిఫెండింగ్ ఛాంపియన్ పి.వి. సింధూ, అద్భుత ఫామ్‌లో ఉన్న సైనా నెహ్వాల్ ఇండియా ఓపెన్ తొలిరౌండ్‌లో విజయాలను నమోదు చేసుకున్నారు. మహిళల సింగిల్స్ తొలిరౌండ్లో సోఫీ డాల్ (డెన్మార్క్)తో తలపడిన సైనా 21-15, 21-9 సెట్ల తేడాతో సునాయాసంగా గెలిచింది. డిఫెండింగ్ ఛాంపియన్, నెంబర్‌వన్ సీడ్ పి.వి. సింధూ నటాలియా రోడ్ (డెన్మార్క్)తో తలపడి 21-10, 21-13 సెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. డ్రా ప్రకారం సెమీస్ వరకు ప్రత్యర్థుల్ని ఓడిస్తూ వస్తే ఫైనల్లో సైనా, సింధూ ముఖాముఖి తలపడే అవకాశముంది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ లీ చుక్ (హాంకాంగ్)పై 21-17, 21-18తోనూ.. సమీర్ వర్మ 7వ ర్యాంకర్ ఆంటోసన్‌పై 22-20, 21-2 పాయింట్ల తేడాతో గెలిచారు.

కాంబ్లికి పితృ వియోగం



ముంబాయి : టీమిండియా మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లికి పితృవియోగం కలిగింది. కాంబ్లి తండ్రి గణపత్ మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని వినోద్ కాంబ్లినే స్వయంగా బుధవారం వెల్లడించారు. కాంబ్లీ మాట్లాడుతూ తన తండ్రి ప్రతి విషయంలోనూ తనను ప్రోత్సహించేవారన్నారు. కాంబ్లి తండ్రి గణపత్ మృతిపట్ల బీసీసీఐ ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది.



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో మొదటి ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌ను అధికారికంగా ప్రారంభిస్తూ... బ్యాడ్మింటన్ క్రీడాకారులనుండి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న దృశ్యం

అంబటి రాయుడుపై రెండు మ్యాచ్‌ల నిషేధం

ముంబయి: హైదరాబాద్ క్రికెటర్ అంబటి రాయుడుపై బీసీసీఐ బుధవారం రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. దీంతో అతడు త్వరలో ప్రారంభంకానున్న విజయ్ హజారే ట్రోఫీలో మొదటి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. ఇటీవల విశాఖలో హైదరాబాద్-కర్ణాటక మధ్య మ్యాచ్‌లో అంపైరింగ్ పొరపాటు కారణంగా తాము ఓడిపోయామంటూ అంపైర్లతో వాగ్వాదానికి దిగారు. దీనిపై విచారణ జరిపిన బీసీసీఐ తాజాగా హైదరాబాద్ సారథి అంబటి రాయుడు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చి రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని విధిస్తున్నట్లు ప్రకటించింది.

నేటితో ముగియనున్న అథ్లెటిక్స్

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు)

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతూ... నేటితో ముగియనున్నాయి. రెండు రోజుల ఫలితాలను శాప్ ఓఎస్‌డి రామకృష్ణ వెల్లడిస్తూ... పురుషుల విభాగంలో 400మీటర్ల పరుగులో అమల్ రాజా (బెంగుళూరు ఆర్ఎస్‌బి) ప్రథమ, ఎస్.మెర్విన్ (చెన్నై ఆర్ఎస్‌బి) ద్వితీయ... 1500 మీటర్లలో ఓమ్ ప్రకాష్ (బెంగుళూరు ఆర్ఎస్‌బి) ప్రథమ, జెయేష్ చౌదరి (మహారాష్ట్ర) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 110మీటర్ల హార్డిల్స్‌లో కె.ప్రేమ్‌కౌర్ (హైదరాబాద్) ప్రథమ, ధర్మేంద్ర మహంతా(భువనేశ్వర్ ఆర్ఎస్‌బి) ద్వితీయ... పోల్‌వాల్ట్‌లో టి.శరవణ్(చెన్నై ఆర్ఎస్‌బి) ప్రథమ, ఎస్.ఇలాంగో(హైదరాబాద్) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. డిస్కస్ త్రోలో ఆర్ఎస్.రాధి(సెంట్రల్ న్యూఢిల్లీ) ప్రథమ, తుషార్ మునే (ముంబయి ఆర్ఎస్‌బి) ద్వితీయ... 400మీటర్ల అండర్-40-50లో హాబి రవీంద్రన్ (కేరళ) ప్రథమ, ప్రమోద్‌తాండల్(మహారాష్ట్ర) ద్వితీయ స్థానంలో నిలిచారు.

మహిళల విభాగంలో 400మీటర్ల పరుగులో నిత్యశ్రీ (బెంగుళూరు ఆర్ఎస్‌బి) ప్రథమ, అశ్విని మంజ్రకర్(ముంబయి ఆర్ఎస్‌బి) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 1500మీటర్లలో ఫాతిమాటుడు (కలకత్తా ఆర్ఎస్‌బి) ప్రథమ, జయంతి తప్లియాల్ (న్యూఢిల్లీ సెంట్రల్) ద్వితీయ స్థానంలో నిలువగా... 100 మీటర్ల హార్డిల్స్‌లో దీపికా (చెన్నై ఆర్ఎస్‌బి) ప్రథమ, పింకీరాణి (జైపూర్ ఆర్ఎస్‌బి) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. లాంగ్‌జంప్‌లో పింకీరాణి (జైపూర్‌ఆర్ఎస్‌బి) ప్రథమ, వనితా ఇంగోల్(మహారాష్ట్ర) ద్వితీయ స్థానం సాధించారు. ఓవరాల్ రేసులో బెంగుళూరు ఆర్ఎస్‌బి జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. 61పాయింట్లతో చాంపియన్‌షిప్ రేసులో బెంగుళూరు ఆర్ఎస్‌బి జట్టు ప్రథమస్థానంలో ఉండగా చెన్నై ఆర్ఎస్‌బి జట్టు 56పాయింట్లతో 2వ స్థానంలో, అహ్మదాబాద్ ఆర్ఎస్‌బి 3వ స్థానంలో నిలిచాయి. కాగా పోటీలు నేటితో ముగియనున్నాయి. విజేతలకు గురువారం బహుమతులు అందజేస్తారు.



దీపికా (చెన్నై ఆర్ఎస్‌బి)



ఆర్ఎస్.రాధి(సెంట్రల్ న్యూఢిల్లీ)

తేజస్విని ఆత్మహత్యపై నివేదిక కోరాం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ హైమావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నం చైతన్య కళాశాలలో ఇంటర్ విద్యార్థి గ్రంధి తేజస్విని ఆత్మహత్య ఘటన పై నివేదిక సమర్పించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ జి హైమావతి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజుల పేరుతో ఒత్తిడి పెంచడం ద్వారా విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులవుతున్న కళాశాలల యాజమాన్యాలకు ఇంటర్ బోర్డ్ ద్వారా నోటీసులు జారీ చేస్తామన్నారు. బాలల హక్కుల్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె పేర్కొన్నారు. ఫీజులు చెల్లించని కారణంగా ప్రాక్టికల్స్‌తో పాటు పబ్లిక్ పరీక్షలకు హాల్‌టిక్కెట్లు నిరాకరించడం అమానుషమని, దీన్ని హత్యానేరం కింద పరిగణించాల్సి వస్తుందన్నారు. విద్యా సంస్థల్లో స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించాలని, సత్ప్రవర్తనకు సంబంధించి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తూ, వారిలో సృజనాత్మక శక్తిని వెలికి తీయాలన్నారు. కానీ అందుకు విరుద్ధంగా ఫీజుల పేరుతో మానసికి ఒత్తిడికి గురిచేస్తూ, వారి భవిష్యత్‌ను అంధకారం చేయడం సరికాదన్నారు. బాలల రక్షణ విధానాల్ని అన్ని విద్యా సంస్థల్లో తప్పనిసరిగా అమలు చేయాలని ఆమె స్పష్టం చేశారు.

ఏడు లోపు నాలుగేళ్ళు ఎక్కడ చదివితే అదే స్థానికత

తెలంగాణ సిఎం పరిశీలనలో ముసాయిదా

కేబినెట్లో చర్చించాక తుది నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి స్థానికతకు ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలో కొన్ని కీలక మార్పుల్ని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. తాజా పరిస్థితుల్ని అధ్యయనం చేసిన ప్రభుత్వం వివిధ ఉద్యోగ, ప్రజా సంఘాల నుంచి వచ్చిన వినతుల్ని పరిగణలోకి తీసుకుంది. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ వారికి స్థానికత వర్తించేలా కీలక నిర్ణయాన్ని తీసుకోనుందని అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చైర్మన్‌గా 'జోన్లు, స్థానికత' పై నియమించిన కమిటీ ముసాయిదాను ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలనకు పంపింది. సిఎం సూచనల మేరకు మంత్రిమండలి సమావేశంలో చర్చించి అధికారికంగా నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. ఇప్పటివరకు 4 నుంచి 10వ తరగతి వరకు ఏడేళ్ల చదువులో నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికత (లోకల్) హోదా పొందే విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. వారు నివశించే ప్రాంతంలో అనువైన విద్యాసంస్థలు లేకపోవడంతో పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు ఆరో తరగతి నుంచే పిల్లల్ని ఇతర జిల్లాలు, నగరాల్లో చదివిస్తున్నారు. దీనివల్ల కుటుంబం, నివాసం ఒక జిల్లాలో ఉంటే.. ఉద్యోగాల ఎంపిక సమయంలో వారు మరో జిల్లాకు స్థానికులవుతున్నారు. ప్రస్తుతం జిల్లాల పెంపుతో అది మరింత పెద్ద సమస్యగా పరిణమించింది. ప్రాథమిక విద్యను ఎక్కువగా సొంత గ్రామం, మండలం, జిల్లాలో చదువుతారు కాబట్టి ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువును పరిగణలోకి తీసుకోవాలని కమిటీ సిఫారసు చేసినట్లు తెలిసింది. అంటే ఆ ఏడేళ్ల విద్యలో నాలుగేళ్లు ఏ జిల్లాలో చదివితే ఆ జిల్లాకు,జోనల్,రాష్ట్రానికి స్థానికులవుతారు. నివాసం ఆధారంగా స్థానికతను పరిగణలోకి తీసుకోవాలని భావించినా అక్రమంగా ధ్రువపత్రాలు సష్టించే అవకాశముందని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. ఉద్యోగాల ఎంపికకు, బదిలీకి జిల్లా, జోనల్, రాష్ట్రం అనే మూడు కేడర్లు మాత్రమే ఉంటాయి. మొదట్లో మల్టీ జోనల్ కూడా పెట్టాలని భావించినా దానిపై కమిటీ సుముఖత చూపలేదు. ఈ సిఫారసులతో తయారు చేసిన ముసాయిదాను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపారు. స్థానికత విషయంలో మంత్రివర్గ ఉపసంఘం చేసిన ప్రతిపాదనలపై సిఎం కెసిఆర్ అడ్వకేట్ జనరల్, రాజ్యాంగ నిపుణుల్ని సంప్రదించినట్లు తెలిసింది.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంటిపై ఐటిదాడులు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ప్రముఖ పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాలపై ఆదాయపు పన్నుశాఖ బుధవారం దాడులు నిర్వహించింది. నెల్లూరులోని రామలింగాపురంలోని ఆయన నివాసం, కార్యాలయంలో అధికారులు దాడులు నిర్వహించారు. కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతంలోని ఆయన కార్యాలయంపై రాత్రి వరకు దాడులు కొనసాగినట్లు తెలిసింది. అక్కడ కూడా కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.ఇటీవల ఆయన టిడిపి నుంచి వైసిపిలో చేరిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆయన ఇళ్లు, కార్యాలయాలపై దాడులు జరిగాయి. దాంతో ఆయన అనుచరులు, వైసిపి నేతల్లో కలకలం రేగింది. ఇది కేవలం రాజకీయ కుట్రగా వారు అంటున్నారు. ఏదేమైనా రాజ్యసభ సీటు కోసం వేమిరెడ్డి కొత్త కొత్త సమస్యలు తెచ్చు కుంటున్నారు.

ఏపికి నాలుగేళ్ల క్రితమే 'చంద్ర' గ్రహణం

ప్రజాశక్తి-పొదలకూరు (నెల్లూరు)

రాష్ట్రానికి నాలుగేళ్ల క్రితమే చంద్ర గ్రహణం పట్టిందని వైసిపి నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా బుధవారం నెల్లూరు జిల్లా పొదలకూరుకు చేరుకున్నారు. స్థానిక పంచాయతీ బస్టాండులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఈ గ్రహణాన్ని వదిలించేందుకు యువకులు సైనికుల్లా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. చంద్రబాబు విదేశాలకు వెళితే ఆయన సీట్లో బాలకృష్ణ కూర్చుంటారని విమర్శించారు. మామూలు పూజలు జరగాల్సిన దుర్గమ్మ గుడిలో తాంత్రిక పూజలు, మాంత్రిక పూజలు జరుగుతున్నాయని విమర్శించారు. చంద్రబాబు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను నిస్సిగ్గుగా కొనుగోలు చేస్తూ వారికి మంత్రి పదవులు ఇస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగిపోయాయన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక ఆరేడు రూపాయల ధర తక్కువగా ఉందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇస్తామన్నారు. చెడు రాజకీయ వ్యవస్థను రూపుమాపి విశ్వసనీయత, నిజాయతీ వ్యవస్థను తీసుకొస్తానన్నారు. రైతుల సంక్షేమం కోసం వడ్డీ లేని రుణాలు, పండిన పంటకు గిట్టుబాటు ధర, ఉచితంగా బోర్లు వేయిస్తామన్నారు. గిడ్డంకులు, కోల్డ్ స్టోరేజీలు రైతుల కోసం నిర్మిస్తామన్నారు.

బహిరంగ సభలో వైఎస్ జగన్



నెల్లూరు జిల్లా పొదలకూరు బహిరంగం సభలో మాట్లాడుతున్న జగన్

చంద్రబాబు చీకటి పాలనను తరిమికొట్టాలి : కాకాణి

రాష్ట్రంలో చంద్రబాబు చీకటి పాలనను తరిమికొట్టాలని వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో తిరుపతి ఎంపి వరప్రసాద్, నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు ఎంఎల్ఎ అనిల్‌కుమార్ యాదవ్, ఆత్మకూరు ఎంఎల్ఎ గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచార కమిషన్ ఆదేశాలకు ఎందుకు స్పందించలేదు?

విశాఖ రెవెన్యూ అధికారుల్ని నిలదీసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశాఖ జిల్లాలో అత్యంతర ఖరీదైన భూముల వివరాలివ్వాలని సమాచార కమిషనర్ ఆదేశాలిచ్చినా రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని హైకోర్టు నిలదీసింది. కప్పరాడ, మర్రిపాలెం గ్రామాల్లోని 41, 57, 58, 59, 66 సర్వే నెంబర్లల్లోని భూముల వివరాల్ని పిటిషనర్‌కు అందజేయాలని హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్ రామచంద్రరావు బుధవారం విశాఖ జిల్లా రెవెన్యూ అధికారుల్ని ఆదేశించారు. ఆదేశాలు జారీ చేసిన సమాచార కమిషనర్ కూడా ఇప్పుడు స్పందించడం లేదని, సమాచారమిచ్చేలా ఆదేశాలివ్వాలని న్యాయవాది పి.లక్ష్మీనారాయణ దాఖలు చేసిన కేసులో న్యాయమూర్తి పైవిధంగా ఆదేశాలిచ్చారు. లక్ష్మీ టెక్నో సొల్యూషన్స్ అనే కంపెనీకి భూములిచ్చే ప్రయత్నాలు జరుగుతున్నందునే సమాచారమివ్వడం లేదన్నారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు భూములిచ్చేందుకే నిషేధిత జాబితా నుంచి ఏకారణం చూపకుండానే కలెక్టర్ తొలగించేశారన్నారు. విచారణ వాయిదా పడింది.

క్లౌడ్ హబ్ పాలసీ విధివిధానాలు ఖరారు

- ఉద్యోగాల కల్పన ఆధారంగా రాయితీలు
- స్టేట్ జిఎస్టీలో 50 శాతం సబ్సిడీ
- మూడేళ్ల పాటు 50 శాతం రాయితీతో ఫైబర్ కనెక్షన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్లౌడ్ హబ్ పాలసీ 2018-2020 విధివిధానాల్ని ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ బుధవారం ఉత్వర్తులు జారీ చేశారు. ఈ పాలసీ 2020 మార్చి 31 వరకు చెల్లుబాటులో ఉంటుందని, రెండేళ్ల తరువాత పాలసీకి అవసరమైన మార్పులు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డేటా సెంటర్లు, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ క్లౌడ్ హబ్ కంపెనీల ద్వారా 2020 నాటికి రాష్ట్రానికి రూ. 32,500 కోట్ల మేర పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ పాలసీని ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆమోదించిన విషయం తెలిసిందే. అత్యాధునిక సాంకేతిక పరీక్షా కేంద్రాలు, డ్రైవర్ లేని కార్లు, డ్రోన్లు, ఫిన్‌టెక్, స్మార్ట్ సిటీల్లాంటి టెక్నాలజీని పరీక్షించే అవకాశాన్ని కల్పించడం, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌లో నూతన ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి జరిగేలా ప్రోత్సాహాన్ని అందించడం, డేటాకు గోప్యత, భద్రత కల్పించడం పాలసీ ముఖ్య ఉద్దేశాలుగా నిర్ణయించారు. ఉద్యోగాల కల్పన ఆధారంగా కంపెనీలకు రాయితీ ఇవ్వనున్నారు. పూర్తి స్థాయి మౌలిక వసతుల్ని, అభివృద్ధి చేసిన భూమి, విద్యుత్, ఫైబర్ కనెక్షన్, నీరు అందించనున్నారు. స్టేట్ జీఎస్టీలో 50 శాతం సబ్సిడీ అందించడంతో పాటు కంపెనీ ప్రారంభించిన రెండేళ్ల వరకు విద్యుత్ ఛార్జీలో యూనిట్‌కు రూ.2లు చొప్పున రాయితీ ఇవ్వనున్నారు. కనీసం 250 మందికి ఉద్యోగాలిచ్చే కంపెనీలకు 80 శాతం వరకు రాయితీతో భూముల్ని కేటాయించనున్నారు. మూడేళ్ల పాటు 50 శాతం సబ్సిడీతో ఫైబర్ కనెక్షన్, రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రత్యేక రాయితీల్ని అందించనున్నారు. పేటెంట్ అప్లికేషన్ కోసం ప్రత్యేకంగా 75 శాతంతో గరిష్టంగా రూ.6 కోట్ల వరకు ప్రోత్సాహం ఇవ్వనున్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌లో జరిగే పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందించనున్నారు. ఈ పాలసీలోని రాయితీల కోసం వచ్చిన దరఖాస్తుల్ని ఎపిఇటిఎ పరిశీలిస్తుంది.

అండర్-19 జట్టుకు బీసీసీఐ నజరానా

న్యూఢిల్లీ: అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాక్‌ను చిత్తు చేసి ఫైనల్‌కు చేరుకున్న పృథ్వీ షా సారథ్యంలోని యువ క్రీడాకారులకు, కోచ్ ద్రావిడ్‌కు బీసీసీఐ బుధవారం నజరానా ప్రకటించింది. ఈ సందర్భంగా బీసీసీఐ ప్రతినిధులు మాట్లాడుతూ ఫైనల్ చేరిన యువజట్టుకు, నగదు ప్రోత్సాహంతోపాటు ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. టోర్నీలో భాగంగా మంగళవారం జరిగిన సెమీస్‌లో పాక్‌పై భారత్ 203 పరుగుల తేడాతో భారీ విజయం సాధించి ఫైనల్లో ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. కివీస్ పర్యటనలో కోచ్ రాహుల్ ద్రావిడ్ సారథ్యంలోని యువ ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన చేస్తున్నారు. భవిష్యత్తులో వీరు మరింత మంచి ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నామని తెలిపారు. అయితే బీసీసీఐ ఆటగాళ్లకు ఎంత నజరానా ప్రకటించిందన్నది వెల్లడించలేదు.

దుబాయ్ మ్యాచ్‌పై ఐసీసీ ఆరా!

దుబాయ్ : యూఏఈ క్రికెట్ బోర్డు స్వయంగా నిర్వహించిన అజ్మన్ ఆల్ స్టార్స్ క్రికెట్ లీగ్ టీ20 మ్యాచ్‌పై ఐసీసీ ఆరా తీయనుంది. క్రికెట్ లీగ్‌లో భాగంగా దుబాయ్ స్టార్స్... షార్జా వారియర్స్ మధ్య మ్యాచ్‌లో ఎనిమిదిమంది క్రీడాకారులు రనౌట్ అయ్యారు. లీగ్‌లో ఇరుజట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దుబాయ్ స్టార్స్ 136 లక్ష్యాన్ని ప్రత్యర్థుల ముందుంచింది. ఆ తర్వాత అసలు కథ మొదలైంది.. బ్యాటింగ్‌కు దిగిన వారియర్స్ జట్టు ఆటగాళ్లు ఎప్పుడెప్పుడు ఔట్ అవుదామా అన్నట్లు క్రీజ్‌లోకి వచ్చారు. కావాలనే బంతులను వదిలేసి క్రీజ్ బయటకు వచ్చి కొందరు స్టంప్ ఔట్ కాగా.. మరి కొందరు అనవరమైన పరుగుల కోసం ప్రయత్నించి కావాలనే రన్ ఔట్ అయ్యారు. దీంతో వారియర్స్ జట్టు కేవలం 46 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఐసీసీతో పాటు పలువురు క్రికెట్ దిగ్గజాలు కూడా ఈ విచిత్రమైన ఇన్నింగ్స్ చూసి ఆశ్చర్యపోయారు. క్రికెట్ అభిమానులు ఈ వీడియోను విపరీతంగా షేర్ చేయడంతో అది ఐసీసీ దృష్టికి చేరింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఐసీసీ తమ అవినీతి నిరోధక శాఖ అధికారులను దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది. అప్పటివరకూ ఆ టోర్నీలో మ్యాచ్‌లు నిర్వహించవద్దని పేర్కొంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68